www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అవయవదాతల పార్థివ దేహాలకు
ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ఆ కుటుంబానికి 10 వేలు ఆర్థిక సాయం

అంత్యక్రియల్లో జిల్లా కలెక్టర్ నేరుగా పాల్గొనాలి

ఉత్తర్వులు జారీ చేసిన స్పెషల్ సీఎస్ కృష్ణబాబు

3

శుక్రవారం | 9-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 115 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి తె. 3.14 తదుపరి షష్ఠి; నక్షత్రం: హస్త రా. 2.44 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 9.04 -10.53; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.23, మ. 12.45-1.36; అమృతఘడియలు: రా. 7.56-9.45; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.40 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నీరజతమే!

పారిస్ ఒలింపిక్స్‌లో రజతంతో సరిపెట్టుకున్న నీరజ్ చోప్రా



89.45 మీ. విసిరి రెండోస్థానంలో జావెలిన్ త్రోయర్

92.97 మీటర్లతో స్వర్ణం నెగ్గిన పాకిస్థానీ నదీమ్

స్పెయిన్‌పై గెలిచిన భారత హాకీ జట్టుకు కాంస్యం

వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకంతో రికార్డు

క్రీడాంశాలన్నీ అయిపోతున్నా అతడిపై ఆశ..! స్టార్లంతా చేతులెత్తేస్తున్నా అతడు మాత్రం అద్భుతం చేస్తాడన్న భరోసా..! భరత మాత మెడలో మళ్లీ బంగారు పతకం వేస్తాడన్న అంచనా..! కానీ, పారిస్ ఒలింపిక్స్‌లో స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఉసూరుమనిపించాడు. 89.45 మీటర్ల దూరం విసిరి రజత పతకానికి పరిమితం అయ్యాడు. ఈ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇదే తొలి రజతం. పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ నదీమ్ రికార్డు స్థాయిలో 92.97 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించాడు. మరోవైపు, వెనుకబడినా పుంజుకున్న భారత హాకీ జట్టు అద్భుతం చేసింది! కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 3 నిమిషాల్లో చకచకా రెండు గోల్స్ కొట్టడంతో కాంస్యం సాధించింది. స్పెయిన్‌ను 2-1తో మట్టికరిపించింది. 9

రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన వినేశ్ ఫొగట్



ఒలింపిక్స్‌లో స్పెయిన్‌పై గెలుపుతో కాంస్యం సాధించిన భారత హాకీ జట్టు వి జయానందం



జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ!

ఉప కులాల జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్లు

జిల్లాల్లో దామాషా ప్రకారం లబ్ధి

ఇలాగైతే ఎవరికీ సమస్యలు ఉండవు

పొలిట్‌బ్యూరో భేటీలో చంద్రబాబు

జాతీయ రహదారుల నమూనాలో

ప్రైవేటు పెట్టుబడులతో రాష్ట్ర రోడ్లు

లారీలు, కార్ల వరకే టోల్ వసూలు

అదీ బాగా పెద్ద రోడ్లయితేనే!

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం యోచిస్తోంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన తమ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో వెల్లడించినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా టీడీపీ అంతర్గతంగా తమ పార్టీ ఎస్సీ నేతల భేటీలో ఇదే నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు ధర్మాసనం వర్గీకరణకు ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో ఈ అంశం పొలిట్‌బ్యూరో సమావేశంలో చర్చకు వచ్చింది. జిల్లాను యూనిట్‌గా తీసుకుని ఆ జిల్లాలో ఉప కులాల

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రంలో మళ్లీ జన్మభూమి!

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు వద్దు

ఆ విధానాన్ని రద్దు చేయండి: సీఎం

సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన.. ఉద్యోగుల క్రమబద్ధీకరణ

క్లస్టర్ వ్యవస్థతో గ్రామీణ ప్రజలకు సేవలందించే యోచన

‘రోడ్డు’ ఎక్కుతున్న ఉపాధి!



మెటీరియల్ నిధుల కింద అందే 2 వేల కోట్లతో రాష్ట్రంలో పెద్దఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణం

పథకానికి పూర్వ వైభవం దిశగా అడుగులు

ఐదేళ్లూ అడ్డదారులూ.. అడ్డగోలు పనులే

కేంద్రం ముందు తలదించుకున్న వైనం

దొంగ మస్టర్లతో అప్రతిష్ఠ..

రోడ్డు పనులు చేసిన ఇంజనీర్లకు వేధింపులు

కూటమి సర్కారు రాకతో మళ్లీ మహర్దశ

3 నెలల జీతం బకాయి 2,300 కోట్ల విడుదల

ఇంజనీర్లపై విజిలెన్స్ కేసుల రద్దు యోచన

పేదలకు వ్యక్తిగత ఆస్తుల కల్పనకు చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. గత ఐదేళ్లు ఉపాధి హామీ పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో కేంద్ర అధికారుల వద్ద మన అధికారులు తలవంచుకోవాల్సిన పరిస్థితి! దొంగ మస్టర్లు వేసి లేబర్ కాంపోనెంట్ పెంచేందుకు చేసిన ప్రయత్నం బయటపడటంతో నిధుల విడుదలలో కేంద్రం అప్పట్లో విపరీతమైన తాత్సారం చేసేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చేందుకు కొత్త ప్రభుత్వం సిద్ధమైంది. ఒకప్పుడు దేశంలోనే ఉత్తమంగా ఉపాధి హామీ పథకం రాష్ట్రంలో

మిగతా 12వ పేజీలో...



‘గనుల’ వెంకటరెడ్డి కోసం

గాలింపు

కడప జిల్లాలో సొంతింటికి వెళ్లి సీఐడీ ఆరా

హైదరాబాద్ నివాసంలోనూ కానరాని మాజీ డైరెక్టర్

ఇళ్లకు నోటీసులు అతికించిన అధికారులు 3

వక్ఫ్ బిల్లుపై విపక్షాల కన్నెర్ర

రాజ్యాంగ వ్యతిరేకమన్న ఇండియా కూటమి 2

జేపీసీ పరిశీలనకు బిల్లు

బ్యాంకు ఖాతా లేకున్నా
యూపీఐ చెల్లింపులు!

వేరొకరి ఖాతా నుంచి చెల్లించే అవకాశం

త్వరలో అందుబాటులోకి తేనున్న ఆర్బీఐ

యూపీఐ ద్వారా ప్రస్తుతానికి రూ.లక్షగా ఉన్న పన్ను చెల్లింపు పరిమితి 5 లక్షలకు పెంపు

ఇక గంటల్లోనే చెక్కుల క్లియరెన్స్‌కు ఆదేశం

వరుసగా 9వసారీ రెపో రేటు యథాతథం

ఆర్బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు 2



సూచీలకు ఆర్‌బీఐ దెబ్బ

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు

సెన్సెక్స్ 581 పాయింట్లు పతనం

ఆటో, రియల్టీ షేర్లు డౌన్

ఏపీ బ్రాండ్ ఇమేజీకి పేటీఎం బ్యాచ్ గండి


బాబు యూట్యూబ్ అకాడమీ పోస్టుపై విషపు దాడి.. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, ఉద్యోగినులు పనిచేయలేరని అబద్ధాలు.. హైదరాబాద్‌కు వెళ్లాలని కుటిల సలహా 2

సీపీఎం సీనియర్ నేత
బుద్ధదేవ్ కన్నుమూత

2001-2011 మధ్య పశ్చిమబెంగాల్ సీఎంగా సేవలు

ఆయన హయాం అనంతరం రాష్ట్రంలో 34 ఏళ్ల వామపక్ష పాలనకు తెర 2

ప్రధాని మోదీ, ముఖ్యమంత్రులు చంద్రబాబు, మమత సహా పలువురు రాజకీయ ప్రముఖుల సంతాపం





కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్ ఎస్ పూరికి వినతిపత్రం అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

లక్ష టన్నుల కందిపప్పు ఇవ్వండి!

» కేంద్రానికి రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏపీకి లక్ష టన్నుల కందిపప్పు ఇవ్వాలని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని 60లక్షల దీపం కనెక్షన్లను పీఎంయూవై కిందకు మార్చాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీకి వచ్చిన ఆయన కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, హర్‌దీప్‌సింగ్ పూరీలను కలిశారు. సీఎం చంద్రబాబు రాసిన లేఖలను వారికి అందజేశారు. అనంతరం ఆయన ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కందిపప్పు కొరత తీవ్రంగా ఉందని, ఏపీలో కిలో రూ.150కు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి లక్ష టన్నుల కందిపప్పు కేటాయించాలని కోరారు. ధాన్యం నిల్వ, గిడ్డంగుల నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో సింహభాగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర మార్కెటింగ్ శాఖలు నిర్వహించే ప్రైస్ మానిటరింగ్ సెంటర్లను ప్రస్తుతం ఉన్న 5 నుంచి 13కు పెంచాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.1,187 కోట్ల పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు త్వరలో జారీ చేస్తామని ప్రకటించారు. రేషన్ డోర్ డెలివరీ అంటూ జగన్ ప్రభుత్వం రూ.1,800 కోట్లు వృథా చేసిందని, డోర్ డెలివరీపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టాలి?

ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని మాజీ సీఎం జగన్ కోరడంపై మనోహర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంటింటికీ రూ.4 వేల పెన్షన్ ఇచ్చినందుకా? పోలవరం పనులు మొదలు పెడుతున్నందుకా? కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సాయం తీసుకొచ్చినందుకా? ఎందుకు ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని ప్రశ్నించారు. కోటల్లో ఉండే జగన్‌కు ప్రజల కష్టాలెలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు.

ఏపీ బ్రాండ్ ఇమేజీకి పేటీఎం బ్యాచ్ గండి

» బాబు యూట్యూబ్ అకాడమీ పోస్టుపై విషపు దాడి

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా దెబ్బతిన్న బ్రాండ్ ఏపీని పునర్నిర్మించేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. బ్రాండ్‌ను శాశ్వతం చేసేలా రాష్ట్రానికి పరిశ్రమలు, ప్రసిద్ధ కంపెనీలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, వైసీపీ పేటీఎం బ్యాచ్ ఈ ప్రయత్నాలను దెబ్బతీసేందుకు పన్నాగాలు పన్నుతోంది. ఏపీబ్రాండ్‌ను నాశనం చేసేందుకు నాడు కంకణం కట్టుకున్న వైసీపీ పెద్దలు.. ఇప్పుడూ అదే తలంపుతో పేటీఎం బ్యాచ్‌ను ఉసిగొల్పుతున్నారు. యూట్యూబ్ గ్లోబల్ సీఈవో నీల్‌మోహన్, గూగుల్ ఏపీఏసీ హెడ్ సంజయ్‌గుప్తాతో చంద్రబాబు ఇటీవల ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఏపీలో యూట్యూబ్ అకాడమీ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మీడియా సిటీకి సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఆ వివరాలను సామాజిక మాధ్యమం వేదికగా పంచుకున్నారు. ఆయన పోస్టును వైసీపీ పేటీఎం బ్యాచ్ ట్యాగ్ చేస్తూ, దుష్ప్రచారం మొదలుపెట్టింది. ఏపీలో శాంతిభద్రతలు లేవని, ఇక్కడ కంపెనీ పెడితే మహిళా ఉద్యోగినులు భద్రంగా ఆఫీసులకు రాలేరని, ఏం జరిగినా ఇక్కడి పోలీసులు చూడటం తప్ప.ఏమీ చేయరంటూ విషం చిమ్మింది. అమరావతి ముంపు ప్రాంతమైనందున హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవాలంటూ కుటిల సలహాలు ఇచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా దృష్టి సారించింది. దుష్ప్రచారం చేసేవారిపై నిఘా పెట్టాలని ఆదేశాలు జారీచేసింది.

40,150 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నిక

» 631 బడుల్లో వాయిదా.. త్వరలో కొత్త షెడ్యూల్

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా పూర్తయ్యాయి. పిల్లల తల్లిదండ్రులు ఉత్సాహంగా పోలింగ్‌లో పాలుపంచుకున్నారు. 40,150 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త కమిటీలను ఎన్నుకున్నారు. 98.45శాతం పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని.. 631 స్కూళ్లలో వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదని, వాటికి కొత్త షెడ్యూల్ విడుదల చేస్తామని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో 17న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. విశాఖ జిల్లాలో ప్రభుత్వ పరిధిలోని 586 స్కూళ్లకు గాను 403 పాఠశాలల్లో ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 183 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రంలోనే ఎక్కువమంది విద్యార్థులు ఉన్న చంద్రంపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కూడా ఇందులో ఉంది. నెల్లూరు జిల్లాలో 2,622 ప్రభుత్వ స్కూళ్లు ఉండగా.. వీటిలో 2,611 బడులు ఎన్నికలకు ఎంట్రీలు నమోదు చేసుకున్నాయి. వీటిలో 1,980 పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. 604 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. విజయనగరం జిల్లాలో మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు పరోక్ష పాత్ర పోషించడంతో ఎంపిక ఉత్కంఠగా సాగింది. చైర్మన్ పదవి ఒక పార్టీకి, వైస్ చైర్మన్ పదవి మరో పార్టీకి పంచుకున్నారు.

కాకినాడ జిల్లాలో ఓటుకు రూ.5 వేలు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 8: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లోనూ వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ ఎన్నికను అధికార కూటమి పార్టీలతో పాటు వైసీపీ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. వైసీపీ తరపున పోటీ చేసిన ప్రతినిధులు తరపున విద్యార్థుల తల్లుల్లో కొందరికి బంగారు వరలక్ష్మీ రూపులు, మరికొందరికి రూ.వెయ్యి నుంచి రూ.ఐదు వేల వరకూ నగదు పంపిణీ చేశారు. విజయం మాత్రం కూటమి అభ్యర్థి దాసం వెంకటరమణనే వరించింది.

వచ్చే ఫిబ్రవరి వరకు ఐఎస్ఎస్‌లోనే సునీత విలియమ్స్!

వాషింగ్టన్, ఆగస్టు 8: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములు సునీత విలియమ్స్, బచ్ విల్మోర్ వచ్చే ఫిబ్రవరిలో భూమి మీదికి తిరిగి వస్తారని నాసా గురువారం వెల్లడించింది. అయితే, వారిని ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లిన బోయింగ్ కంపెనీ స్టార్‌లైనర్ వ్యోమనౌకలో కాకుండా.. స్పేస్ ఎక్స్ కంపెనీకి చెందిన క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, బచ్ 8 రోజులపాటు అక్కడ ఉండి తిరిగి రావాలన్నది ప్రణాళిక. కానీ, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలతో వారి తిరుగుప్రయాణం వాయిదా పడింది. సెప్టెంబరులో ఐఎస్ఎస్‌కు వెళ్లే క్రూ డ్రాగన్‌లో ఇద్దరు వ్యోమగాములను తీసుకెళ్లి, వారు ఫిబ్రవరిలో తిరిగొచ్చేటప్పుడు సునీత, బచ్‌ను తెచ్చేలా నాసా ప్రయత్నాలు చేస్తోంది.

కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం

బంగ్లా ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా యూనస్ ప్రమాణం.. సభ్యులుగా 16 మంది నియామకం

» అభినందించిన భారత ప్రధాని మోదీ
» హిందువులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి
» హింసను వీడాలి.. శాంతిని నెలకొల్పాలి
» దేశ ప్రజలనుద్దేశించి మహమ్మద్ యూనస్ వ్యాఖ్యలు

ఢాకా/న్యూఢిల్లీ, ఆగస్టు 8: విద్యార్థుల కోటా ఉద్యమంతో కల్లోలంగా మారిన బంగ్లాదేశ్‌లో నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. అధ్యక్షుడి అధికారిక నివాసం బంగభవన్ దర్బార్‌హాల్‌లో గురువారం సాయంత్రం 8.30కు జరిగిన కార్యక్రమంలో యూనస్ తోపాటు.. మరో 16 మందికి గాను.. 13 మంది తాత్కాలిక ప్రభుత్వ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తాత్కాలిక ప్రభుత్వంలో విద్యార్థి సంఘాల సమన్వయ కర్త నహీద్ ఇస్లాం, మరో నాయకుడు ఆసిఫ్ మహమూద్‌కు చోటు దక్కింది. అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. యూనస్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు(ప్రధానికి ఉండే అధికారాలతో)గా ప్రమాణం చేశారు. మరో ముగ్గురు సభ్యులు రాయ్, చక్మా, బీర్ ప్రతీక్ ఫారూఖ్-ఎ-ఆజమ్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నందున ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఈ కార్యక్రమంలో 400 మంది దాకా అతిథులు పాల్గొన్నారు. వీరిలో ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా, రాజకీయ పార్టీల నాయకులు, త్రివిధ దళాధిపతులు, దౌత్యవేత్తలు ఉన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా యూనస్‌కు అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించాలని కోరారు.

ప్రజలు సామరస్యంతో మెలగాలి: యూనస్

దేశంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడమే తమ ప్రభుత్వ తొలి కర్తవ్యమని మహమ్మద్ యూనస్ అన్నారు. "ప్రజలు దేశంలో ఎక్కడా ఎవరిపైనా దాడులు జరగకుండా చూసుకోవాలి. బంగ్లాదేశ్ పునర్నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో, తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ప్రమాణ స్వీకారం సందర్భంగా పైవ్యాఖ్యలు చేశారు. దేశంలో హింస ప్రజ్వరిల్లుతోందని, ఇది మంచిది కాదంటూ.. భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు శాంతిని పాటించాలని ఆయన దేశ ప్రజలను కోరారు. మైనారిటీలైన హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు, అహ్మదీయులపై జరుగుతున్న దాడులను ఖండించారు. "ఈ దాడులు కుట్రలో భాగమే. ప్రజలు హింస జోలికి వెళ్లొద్దు. మన దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి మన సోదరుడే. నాపై విశ్వాసం ఉంచండి. ప్రభుత్వం మీకు న్యాయం చేస్తుంది. ఒకవేళ మీరు నా మాట వినకపోతే.. నేను ఇక్కడ(ప్రభుత్వంలో) ఉండి కూడా వృథానే. ఇక్కడ నా అవసరం లేదనుకుంటే.. నాకు వీడ్కోలు పలికితే.. నా పని నేను చూసుకుంటాను" అని ఉద్వేగంగా అన్నారు. దేశ ప్రగతికి హింస, గందరగోళ పరిస్థితులే అతిపెద్ద శత్రువులని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ రోజు బంగ్లాదేశ్ కొత్త విజయదినోత్సవం. ఈ రోజు మనం మొదలు పెట్టిన నవ బంగ్లాదేశ్ నిర్మాణ ప్రయాణానికి శత్రువులైన వాటిని వీడి.. దేశంకోసం పనిచేద్దాం. విద్యార్థులు హింసను వీడి చదువుపై దృష్టి సారించాలి" అని ఆయన పేర్కొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న యూనస్ (కుడివైపు)

అవామీ లీగ్‌పై నిషేధం విధించాలి: బీఎన్‌పీ

హసీనా పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం విధించాలని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చైర్‌పర్సన్ ఖలీదా జియా సలహాదారు రుహుల్ కుద్దూస్ తాలూక్దార్ డిమాండ్ చేశారు. గురువారం నాటోర్ నగరంలోని కనాయిఖలీ చత్తర్‌లో జరిగిన బీఎన్‌పీ బహిరంగ సభలో ఆయన ఈ డిమాండ్‌ను ప్రభుత్వం ముందు పెట్టారు. కాగా, బంగ్లాదేశ్ పరిణామాలపై హసీనా కుమార్తె సైమా వజీద్ పుతుల్ తొలిసారి స్పందించారు. ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉంటూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆగ్నేయాసియా రీజనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె.. బంగ్లాదేశ్ పరిస్థితులను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "క్లిష్ట సమయంలో అమ్మ ఈ దేశం(భారత్)లోనే ఉన్నా.. ఆమెను కౌగిలించుకోలేని పరిస్థితి" అంటూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. కాగా, బంగ్లాదేశ్‌లో అనిశ్చితికి జరిగిన కుట్రకు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఆజ్యం పోసిందని హసీనా కుమారుడు సాజిబ్ వాజెద్ జాయ్ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగాక.. తన తల్లి తిరిగి దేశానికి వస్తారన్నారు. గురువారం ఆయన పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. తన తల్లికి రక్షణగా నిలిచిన భారత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవామీ లీగ్ పార్టీ భారత్‌తో సదా స్నేహపూర్వకంగా ఉంటుందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు భారత్ ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

బ్రిటన్ విదేశాంగ మంత్రికి జైశంకర్ ఫోన్

బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారని అధికారులు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరాలను వెల్లడించారు. ఇరువురూ ఫోన్‌లో బంగ్లాదేశ్ అంశంపై చర్చించారని పేర్కొన్నారు. అయితే.. హసీనా రాజకీయ ఆశ్రయంపై వీరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణ జరగాలని భారత్ కోరుకుంటోందని జైస్వాల్ వివరించారు. కాగా.. బంగ్లాదేశ్‌లో భారత వీసా జారీ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు.

దేశ ప్రజలు ప్రధాని మోదీ ఇంట్లోకీ చొరబడతారు

» మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత సజ్జన్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

భోపాల్, ఆగస్టు 8: శ్రీలంక, బంగ్లాదేశ్‌లో జరిగిన మాదిరిగా ఏదో ఒక రోజు భారతదేశ ప్రజలు ప్రధాని మోదీ ఇంట్లోకి చొరబడతారంటూ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ సజ్జన్ సింగ్ వర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ తప్పుడు విధానాల వల్ల ప్రజలు తిరగబడతారన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో మంగళవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

బంగ్లాలో హిందువులపై దాడులను అడ్డుకోవాలి

» అమెరికా చట్టసభ సభ్యులు రో ఖన్నా, రాజా కృష్ణమూర్తి

న్యూయార్క్, ఆగస్టు 8: బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై జరుగుతున్న దాడులను భారతీయ అమెరికన్ చట్టసభ (కాంగ్రెస్) సభ్యులు రో ఖన్నా, రాజా కృష్ణమూర్తి ఖండించారు. 'బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటం న్యాయసమ్మతమైనది. అయితే, హిందువులు లక్ష్యంగా ఆ దేశంలో జరుగుతున్న దాడులను ఆపాలి. తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన యూనస్ చర్యలు తీసుకోవాలి' అని ఎక్స్‌లో రో ఖన్నా పేర్కొన్నారు. హిందువుల ఇళ్లు, వ్యాపారాలు, ఆలయాలపై జరుగుతున్న దాడులను తక్షణం ఆపటానికి అధికారులు, పోలీసులు కృషి చేయాలని, దోషులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని రాజా కృష్ణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. కాగా, బంగ్లాలో హిందువులపై జరుగుతున్న దాడులను అమెరికా ప్రభుత్వం ఖండించకపోవటాన్ని పలు హిందూ అమెరికన్ సంఘాలు తప్పుబట్టాయి. దాడులను ఆపటానికి కృషి చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేర కు 'ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడం' అమెరికా రాయబారి రషద్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

లోకం తీరు



రాజ్యసభ నుంచి చైర్మన్ వాకౌట్!

» ఎగువ సభలో అనూహ్య ఘటన

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రాజ్యసభలో గురువారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. సాక్షాత్తూ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభ నుంచి వాకౌట్ చేయడం కలకలం సృష్టించింది. సాధారణంగా విపక్షాలు ప్రభుత్వంపై నిరసనతో వాకౌట్ చేస్తుంటాయి. అయితే ధన్‌ఖడ్ విపక్షాల తీరుపై అసహనంతో సభ నుంచి వెళ్లిపోవడం గమనార్హం. ఉదయం సభ ప్రారంభం కాగానే.. పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటు అంశంపై చర్చకు ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర విపక్షాల నేతలు పట్టుబట్టారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ తనను చూసి నవ్వడాన్ని చైర్మన్ ధన్‌ఖడ్ భరించలేకపోయారు. 'మీ అలవాటు నాకు తెలుసు. ఇక్కడ నన్ను కాదు.. చైర్మన్ స్థానాన్నే సవాల్ చేస్తున్నారు. అందులో కూర్చున్న నాకు విలువ లేదన్న భావనతోనే చాలెంజ్ చేస్తున్నారు' అని ఆక్షేపించారు. విపక్షాల వైపు నుంచి మళ్లీ రన్నింగ్ కామెంట్రీ రావడంతో ధన్‌ఖడ్ జైరాం వైపు చూసి స్పందించారు. తను ఈ చైర్‌లో కూర్చోవాలనిపించడం లేదంటూ లేచి నిల్చుని రెండు చేతులూ జోడించి సభ నుంచి వాకౌట్ చేసేశారు.

జపాన్‌ను వణికించిన భూకంపం

» రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదు

టోక్యో, ఆగస్టు 8: జపాన్ దక్షిణ తీరంలో గురువారం శక్తిమంతమైన భూకంపం సంభవించింది. దీంతో సునామీ హెచ్చరిక జారీ చేయాల్సి వచ్చింది. ప్రజలు తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. భూకంపం మూలంగా ముగ్గురికి గాయాలయ్యాయి. అయితే తీవ్ర స్థాయిలో నష్టం ఏమీ జరగలేదని తెలుస్తోంది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదైంది. క్యుషు ద్వీపం సమీపంలో దాదాపు 30 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైనట్టు జపాన్ వాతావరణ ఏజెన్సీ పేర్కొంది.

వినేష్ మా అందరికీ చాంపియనే!

» రజత పతక విజేతగానే ఆమెను పరిగణిస్తాం
» హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 8: పారిస్ ఒలింపిక్స్‌లో అనూహ్య రీతిలో పతకం కోల్పోయినప్పటికీ వినేష్ ఫొగట్ తమ అందరికీ చాంపియనే అని ఆమె సొంత రాష్ట్రం హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ పేర్కొన్నారు. వినేష్‌ను రజత పతక విజేతగానే పరిగణిస్తామని ప్రకటించారు. ఈ మేరకు అన్ని రివార్డులు అందజేసి ఘనంగా సన్మానిస్తామని స్పష్టం చేశారు. "హరియాణా ధీర వనిత వినేష్ అద్భుత ప్రదర్శనతో ఒలింపిక్ ఫైనల్‌కు చేరింది. కొన్ని కారణాలతో ఆమె ఫైనల్ ఆడలేకపోయింది. అయినప్పటికీ ఆమె మా అందరికీ చాంపియనే. మేమందరం నిన్ను చూసి గర్విస్తున్నాం వినేష్" అంటూ సైనీ ట్వీట్ చేశారు. కాగా, వ్యవస్థలతో పోరాడి వినేష్ అలసిపోయారంటూ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నర్మగర్భంగా మోదీ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ ట్వీట్ చేశారు. గత ఏడాది భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తప్పించాలంటూ వినేష్ సహా అగ్రశ్రేణి రెజ్లర్లు తీవ్ర స్థాయి ఆందోళనలు చేసిన సంగతి తెలిసిందే. వాటిని దృష్టిలో పెట్టుకుని థరూర్ ట్వీట్ చేయడం గమనార్హం. మరోవైపు హరియాణా అసెంబ్లీలో తమకు తగిన బలం ఉంటే వినేష్‌ను త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభకు పంపేవాళ్లమని కాంగ్రెస్‌కు చెందిన ఆ రాష్ట్ర మాజీ సీఎం భూపిందర్‌సింగ్ హుడా వ్యాఖ్యానించారు. ఆయన కుమారుడు, లోక్‌సభ సభ్యుడైన దీపేందర్ హుడా కూడా ఈ ప్రతిపాదనను సమర్థించారు. అన్ని పార్టీలు దీనిపైన ఆలోచించాలని సూచించారు. అయితే, వినేష్ పెదనాన్న మహవీర్ ఫొగట్ మాత్రం భిన్నంగా స్పందించారు. దేశానికి తన కుమార్తె ఎన్నో పతకాలు సాధించిందని.. ఆ సమయంలో రాష్ట్రంలో భూపీందర్ ప్రభుత్వమే ఉందని, ఆమెను కనీసం డీఎస్పీని కూడా చేయలేదని తప్పుబట్టారు.

వక్ఫ్ బిల్లుపై విపక్షాల కన్నెర్ర

సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు అధికారాలకు కత్తెర వేసే వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ సూత్రాలు, సమాఖ్యస్ఫూర్తిని ఉల్లంఘిస్తోందని.. మత స్వేచ్ఛకు విరుద్ధమని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ధ్వజమెత్తాయి. దీంతో ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపాలని కేంద్రం నిర్ణయించింది. మోదీ మూడోసారి ప్రభుత్వా న్ని ఏర్పరిచాక జేపీసీకి అంగీకరించడం ఇదే మొదటిసారి. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు గురువారం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్షాలు అనవసరంగా ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. 1995నాటి వక్ఫ్ సవరణ చట్టాన్ని సమీకృత వక్ఫ్ యాజమాన్య, సాధికారిక, సామర్థ్య అభివృద్ధి చట్టంగా మారుస్తున్నామని రిజిజు అన్నారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిం మహిళలు, ముస్లిమేతరులకు అవకాశం కల్పించడం, షియాలు, సున్నీలు, బోహ్రాలు, ఆగాఖానీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, బోహరాలకు, ఆగాఖానీలకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. కేంద్ర పోర్టల్, డాటా బేస్ ద్వారా వక్ఫ్ ఆస్తుల నమోదును క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. వక్ఫ్ బిల్లు ఇప్పటి వరకూ హక్కులు లేని వారికి హక్కులు కల్పిస్తుందేగానీ, ఎవరి హక్కులనూ తొలగించదన్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం కొందరు పిల్లలకు మహిళలకు వారసత్వంగా రావాల్సిన భూములను వక్ఫ్‌కు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. కొన్నిచోట్ల మునిసిపల్ భూములను కూడా వక్ఫ్ భూములుగా నిర్ణయిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. తమ పూర్వీకులు ఒకచోట నమాజ్ చేశారని చెబితే దాన్ని వక్ఫ్ భూమిగా తీర్మానిస్తున్నారని.. దీనిపై మతంరీత్యాకాక సామాజిక న్యాయంరీత్యా ఆలోచించాలని రిజిజు కోరారు. మైనారిటీల పరిస్థితిపై కాంగ్రెస్ హయాంలో నియమించిన సచార్ కమిటీ సిఫారసులను దృష్టిలో ఉంచుకున్నామన్నారు.



దేశాన్ని విభజించేలా..

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్‌తోపాటు ఇండియా కూటమికి చెందిన పార్టీలన్నీ ఈ బిల్లు దేశాన్ని విభజించేలా ఉందని విమర్శించాయి. ఎన్డీయే మిత్రపక్షాల్లో జనతాదళ్ (యూ) ఈ బిల్లును సమర్థించగా.. దాన్ని జేపీసీకి నివేదించాలని టీడీపీ ఎంపీ హరీశ్ (అమలాపురం) కోరారు. ఈ బిల్లు అమలులోకి వస్తే ముస్లిం సమాజానికి, వక్ఫ్ ఆస్తులకు నష్టం వాటిల్లుతుందని ఏపీ టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతాఉల్లాహ్.. పార్టీ ఎంపీలైన హరీశ్, కేశినేని శివనాథ్‌ను జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ప్రతినిధి వర్గంతో పార్లమెంట్‌లో కలిసి వివరించారు. వారు ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ముస్లిం సమాజానికి ఎలాంటి నష్టమూ కలగకుండా చంద్రబాబు చూస్తారని భరోసా ఇచ్చారు. కాగా మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్రం ఈ బిల్లును రూపొందించిందని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఈ బిల్లు సమాఖ్య వ్యవస్థపై దాడి చేస్తోందని దుయ్యబట్టారు. ముస్లిమేతరులను వక్ఫ్ పాలకమండలిలో సభ్యులుగా చేర్చడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. ముస్లింలపైనే కాక క్రైస్తవులు, జైనులపై దాడులు చేయడం బీజేపీ లక్ష్యమని విమర్శించారు. ఇక మైనారిటీలే తమ ఆస్తులను నిర్వహించుకునేందుకు రాజ్యాంగంలోని 30వ అధికరణ వీలు కల్పిస్తోందని, ఈ బిల్లు ఆ అధికరణకు వ్యతిరేకమని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. ఈ బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే డిమాండ్ చేశారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని 14,15,35 అధికరణలను ఉల్లంఘిస్తోందని ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. దేశాన్ని విభజించడమే తప్ప.. సమైక్యం చేయడం ఈ బిల్లు ఉద్దేశంకాదన్నారు. ముస్లింలకు ప్రభుత్వం శత్రువనే విషయాన్ని ఈ బిల్లు స్పష్టం చేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు అధికారాలను తొలగించి మొత్తం వ్యవస్థను కుప్పకూలుస్తున్నారని ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్.కె.ప్రేమచంద్రన్ చెప్పారు.ఈ బిల్లు ముస్లింలకు ఎలా వ్యతిరేకమో అర్థంకావట్లేదని జేడీయూ ఎంపీ, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ అన్నారు. కాగా వక్ఫ్ బిల్లుపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, కేంద్ర మంత్రి అమిత్‌షా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వక్ఫ్ భూములను బీజేపీ సభ్యులకు ధారాదత్తం చేసేందుకే ఈ బిల్లును రూపొందించారని అఖిలేశ్ విమర్శించారు. లోక్‌సభ స్పీకర్ అధికారాలను కూడా కబళిస్తున్నారని తనకు తెలిసిందన్నారు. దీనిపై హోంమంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందిస్తూ స్పీకర్ అధికారాలు మొత్తం సభకు చెందినవన్నారు.

బ్యాంకు ఖాతా లేకున్నా యూపీఐ చెల్లింపులు!

» వేరొకరి ఖాతా నుంచి చెల్లించే అవకాశం
» త్వరలో అందుబాటులోకి తేనున్న ఆర్బీఐ

ముంబై, ఆగస్టు 8: గూగుల్‌పే, ఫోన్‌పేలాంటి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు జరపాలంటే వాటిని మన బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయాల్సిందే! మరి బ్యాంకు ఖాతాలు లేనివారి పరిస్థితి? అలాంటివారు వేరొకరి ఖాతా నుంచి చెల్లింపులు జరిపే వీలు కల్పించేలా.. డెలిగేటెడ్ పేమెంట్స్ (ప్రాతినిధ్య చెల్లింపులు) విధానాన్ని త్వరలో అందుబాటులోకి తేనున్నట్టు భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) ప్రకటించింది. డిజిటల్ చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు, యూపీఐ వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో ప్రధానమైనది ఈ ప్రాతినిధ్య చెల్లింపుల విధానం. ఈ విధానంలో.. ఒక యూపీఐ వినియోగదారు తన బ్యాంక్ అకౌంట్ నుంచి నిర్దేశిత పరిమితి వరకూ యూపీఐ చెల్లింపులు జరిపేందుకు మరో వ్యక్తికి అధికారమిచ్చే వీలుంటుంది. బ్యాంక్ ఖాతా లేని వ్యక్తులు, మైనర్లు తమ తల్లిదండ్రులు లేదా సంబంధిత వ్యక్తుల బ్యాంక్ ఖాతాల ద్వారా యూపీఐ చెల్లింపులు జరిపేందుకు ఈ కొత్త విధానం ఉపయోగపడనుందని థర్డ్‌పార్టీ పేమెంట్ అప్లికేషన్ కివీ సహ-వ్యవస్థాపకులు మోహిత బేడీ అన్నారు. అయితే, ఈ వెసులుబాటుకు సంబంధించిన పూర్తి విధివిధానాలను ఇంకా ప్రకటించాల్సి ఉంది.

ఇక యూపీఐ పరిమితి రూ.5 లక్షలకు..

యూపీఐ ద్వారా పన్ను చెల్లింపుల పరిమితి ప్రస్తుతం రూ.లక్షగా ఉండగా.. దాన్ని రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. తద్వారా పన్ను చెల్లింపుదారులు అధిక మొత్తంలో పన్నును సైతం యూపీఐ ద్వారా సులువుగా, వేగంగా చెల్లించేందుకు వీలవుతుందని పేర్కొంది. అలాగే చెక్కుల ద్వారా చెల్లింపులను మరింత వేగవంతం చేయనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ప్రస్తుతం చెక్కు క్లియరెన్స్‌కు రెండు రోజుల దాకా పడుతుంది. ఇకపై బ్యాచ్ ప్రాసెసింగ్‌కు బదులు ఆన్ రియలైజేషన్ సెటిల్‌మెంట్ విధానంలో చెక్కులను క్లియర్ చేస్తారు. అంటే.. చెక్కు వచ్చిన కొన్ని గంటల సమయంలోనే అది క్లియర్ అవుతుంది.

అనధికారిక డిజిటల్ రుణ యాప్స్‌కు చెక్

అనధికారిక, మోసపూరిత రుణయాప్‌లకు చెక్ పెట్టేందుకు తమ నియంత్రణలోని సంస్థలు నిర్వహిస్తున్న డిజిటల్ రుణ యాప్‌లతో ఒక రిపాజిటరీని ఏర్పాటు చేయాలని ఆర్బీఐ ప్రతిపాదన చేసింది. అనధికారిక, దారుణ యాప్‌లను గుర్తించడంతోపాటు కస్టమర్లు వాటి వలలో పడకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది.

సీపీఎం దిగ్గజ నేత బుద్ధదేవ్ కన్నుమూత

కోల్‌కతా, ఆగస్టు 8: సీపీఎం దిగ్గజ నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య (80) ఇకలేరు. కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం కోల్‌కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. 2000 నవంబరు 6 నుంచి 2011 మే13దాకా పశ్చిమబెంగాల్ సీఎంగా ఉన్న ఆయన.. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశారు. బుద్ధదేవ్ కోరిక మేరకు ఆయన మృతదేహాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఆర్ఎస్ ఆస్పత్రి-వైద్యకళాశాలకు అప్పగించనున్నట్టు కుటుంబసభ్యులు వెల్లడించారు. సీఎంగా ఉన్నప్పుడు రెండు గదుల చిన్న అపార్ట్‌మెంట్‌లో ఉన్నారంటే బుద్ధదేవ్ ఎంత నిరాడంబర జీవితం గడిపారో తెలుస్తుంది. ఆయన తుదిశ్వాస విడిచింది ఆ ఇంట్లోనే. 1944 మార్చి1న ఉత్తర కోల్‌కతాలోని పండితుల కుటుంబంలో బుద్ధదేవ్ జన్మించారు. ఆయన కొన్నాళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1966లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకుని 1972లో పార్టీ రాష్ట్ర కమిటీకి ఎంపిక య్యారు. 1977లో కాశీపూర్- బెల్గాచియా నియోజకవర్గం నుంచి గెలుపొంది తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. క్యాబినెట్ మంత్రిగానూ పనిచేశారు. 1987లో జాదవ్‌పూర్ నుంచి గెలుపొందారు. అప్పటి నుంచి 2011దాకా అదే నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించారు. జ్యోతిబసు ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. బుద్ధదేవ్ నేతృత్వంలో సీపీఎం 2001, 2006 ఎన్నికల్లో ఘనవిజయాలు సాధించింది. సీఎంగా పగ్గాలు చేపట్టాక సింగూరులో టాటా మోటార్స్ నానో కార్ల తయారీ ఫ్యాక్టరీకి అనుమతులిచ్చారు. కానీ అక్కడ భూసేకరణపై చెలరేగిన వివాదాన్ని, నందిగ్రామ్‌లో నిరసనకారులపై పోలీసు కాల్పులను ఆయుధంగా మలచుకున్న మమతాబెనర్జీ 2011లో గెలిచి అధికారంలోకి వచ్చారు. అనంతరం బుద్ధదేవ్ క్రియాశీల రాజకీయాల నుంచి క్రమంగా తప్పుకొన్నారు. కాగా.. బుద్ధదేవ్ మృతి పట్ల ప్రధాని నరేంద్రమోదీ, పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ, సీపీఎం సీనియర్ నేత సీతారాం ఏచూరి సహా పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.



సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీపీఎం నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతిపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో ఉన్న బుద్ధదేవ్ అంకితభావాన్ని చంద్రబాబు ప్రశంసించారు. బుద్ధదేవ్ కుటుంబానికి, మద్దతుదారులకు గురువారం 'ఎక్స్' ద్వారా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు వద్దు

▸ ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయండి

▸ ఎవరి పని వాళ్లే చేయాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఎవరి పని వాళ్లే చేయాలి గానీ గ్రామ సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు చేయడమేంటి?' అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖపై ఆయన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేపట్టేందుకు ప్రక్రియ ప్రారంభించిందని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని ఆదేశించారు. భూములకు సంబంధించిన రికార్డులు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద ఉంటాయని, అక్కడే రిజిస్ట్రేషన్లు చేస్తేనే దానికి విలువ ఉంటుందని చెప్పారు. అధికారులు ఎంత చెప్పినా పట్టించుకోకుండా జగన్ సర్కారు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంది. పైలట్ ప్రాజెక్టు కూడా అమలు చేసి ఆ ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా అన్నీ గ్రామ సచివాలయాల్లో చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. భూముల విలువ సవరించే ప్రతిపాదనలోనూ గత ప్రభుత్వం తప్పుల తడకగా చేసిందని సీఎం పేర్కొన్నారు. ఒక నిర్దిష్ట విధానం లేకుండా భూముల విలువలను ఒక్కోరకంగా సవరించారని, దీంతో మార్కెట్ విలువ పెంపుదల గందరగోళానికి దారి తీసిందని, ఆ విధానానికి స్వస్తి పలకాలని చంద్రబాబు సూచించారు. సమగ్రంగా అధ్యయనం చేసి కొత్త మార్కెట్ రేట్ల ప్రతిపాదనను తీసుకురావాలని ఆ శాఖ అధికారులకు సీఎం సూచించినట్లు తెలిసింది.

ఈసెట్‌లో 20,969 సీట్లు భర్తీ

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఈసెట్‌లో 20,969 సీట్లు భర్తీ అయ్యాయని సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గుమ్మా గణేశ్‌కుమార్ తెలిపారు. గురువారం తుది దశ కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయింపు పూర్తయ్యిందని వెల్లడించారు.

ఈఏపీసెట్‌లో స్పెషల్ రౌండ్ కౌన్సెలింగ్ పెట్టండి

▸ విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తి

ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈఏపీసెట్‌లో స్పెషల్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లకు మరో అవకాశం ఇవ్వాలని విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు కోరుతున్నారు. ప్రతి ఏటా మూడు విడతలుగా ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, ఈ ఏడాది రెండు విడతలతోనే ముగించారు. కన్వీనర్ కోటాలో 1,39,254 సీట్లు అందుబాటులో ఉండగా 1,20, 300 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 18,951 సీట్లు మిగిలిపోయాయి. వివిధ కారణాలతో సీట్లు పొందలేని విద్యార్థులు ఈ సీట్లు తీసుకునేందుకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు వస్తున్నాయి.

ఎంబీఏ, ఎంసీఏ సీట్లు మంజూరు

▸ అడ్మిషన్లకు అనుమతిస్తూ ఉత్తర్వులు

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు అందిస్తున్న కాలేజీలకు సీట్లు మంజూరు చేస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 18 యూనివర్సిటీ కాలేజీలు, 156 ప్రైవేటు కాలేజీలకు ఎంసీఏ సీట్లు, 21 యూనివర్సిటీ కాలేజీలు, 263 ప్రైవేటు కాలేజీలకు ఎంబీఏ సీట్లు భర్తీకి అనుమతిచ్చింది. 9 ప్రైవేటు యూనివర్సిటీల్లో ప్రభుత్వ కోటా సీట్ల భర్తీకి కూడా అనుమతిచ్చింది.



లడ్డూ తిన్నా నాయనా...!

▸ తిరుమల ప్రసాదానికి.. ఆస్ట్రేలియా మగువ మైమరపు

తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి భారతదేశంలోనే కాదు..ప్రపంచ వ్యాప్తంగా భక్తకోటి ఉవ్విళ్లూరుతుంది. శ్రీవేంకటేశ్వరుని దర్శనం తరువాత... తిరుమల లడ్డూ ప్రసాదానికి కూడా అంతటి ఖ్యాతి ఉంది. దేశ, విదేశాల వారు వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని ప్రీతిపాత్రంగా స్వీకరిస్తారు. ఆస్ట్రేలియాకు చెందిన సారా అనే యువతి తన మిత్రబృందంతో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. లడ్డూ కౌంటర్ వద్దకు వెళ్లి లడ్డూలను తీసుకుంది. ఓ లడ్డూను తింటూ ఆలయం ముందు 'వావ్.. సో టేస్టీ' అంటూ మురిసిపోయింది.

-ఆంధ్రజ్యోతి, తిరుమల



'గనుల' వెంకటరెడ్డి కోసం గాలింపు

▸ కడప జిల్లాలో సొంతింటికి వెళ్లి సీఐడీ ఆరా

▸ హైదరాబాద్ నివాసంలోనూ కానరాని మాజీ డైరెక్టర్

▸ ఇళ్లకు నోటీసులు అతికించిన అధికారులు

▸ తిరుపతిలో నోటీసు తీసుకునేందుకు పెద్దకుమార్తె నిరాకరణ

▸ ఓ వైసీపీ ఎమ్మెల్యే ఒత్తిడితో రెండో కుమార్తె వద్దకు వెళ్లని వైనం

▸ ఏపీలో డిప్యుటేషన్ ముగించుకుని వెనక్కి రాలేదన్న కోస్ట్‌గార్డ్

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలు, మైనింగ్ అనుమతులు, టెండర్ల ఒప్పందాలు అన్నింటా అక్రమాలకు కేంద్ర బిందువైన గనుల శాఖ మాజీ డైరెక్టర్, ఏపీఎండీసీ మాజీ ఎండీ వెంకటరెడ్డి కోసం సీఐడీ విస్తృతంగా గాలిస్తోంది. ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించి, వేల కోట్ల రూపాయల దోపిడీలో వైసీపీ నేతలకు అన్ని విధాలా సహకరించిన ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. కడప జిల్లా రైల్వేకోడూరు దగ్గర్లోని ఓబులవారిపల్లె మండలం కొర్లకుంటలో ఆయన సొంతింటికి గురువారం సీఐడీ అధికారులు వెళ్లారు. మరో బృందం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లింది. రెండు చోట్లా ఆయన లేకపోవడంతో ఇళ్ల గోడలకు 41ఏ నోటీసు అతికించి వెళ్లారు. సొంతూర్లో ఇరుగు పొరుగును విచారించిన సీఐడీ అధికారులు కొంత సమాచారం సేకరించారు. తిరుపతిలో ఉంటున్న వెంకటరెడ్డి పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లి ఆరా తీశారు. తన తండ్రి ఇక్కడ లేరని, ఇంట్లోకి ఎవరూ రావొద్దని ఆమె అభ్యంతరం చెప్పారు. తాము సోదాలకు రాలేదని, విచారణ నిమిత్తం నోటీసు ఇచ్చేందుకు మాత్రమే వచ్చామని వారు తెలిపారు. 'కూతురుగా మీరే కదా వారసులు.. నోటీసు తీసుకోండి.. మీ నాన్నకు సమాచారం ఇచ్చి విచారణకు పంపండి..' అని కోరగా ఆమె తిరస్కరించారు. రెండో కుమార్తె ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించిన సీఐడీ అధికారులపై.. ఆమె బంధువైన ఒక వైసీపీ ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. 'వెంకటరెడ్డి కోసం మీరు వెతుక్కోండి.. ఆయన కుమార్తె నిందితురాలు కాదు కదా' అని ఆయన ఫోన్లో ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో రెండో కుమార్తె ఇంటికి వెళ్లకుండా అధికారులు వెనుదిరిగారు. హైదరాబాద్‌కు వెళ్లిన బృందాలు వెంకటరెడ్డి మాతృసంస్థ అయిన ఇండియన్ కోస్ట్ గార్డు కార్యాలయాన్ని సంప్రదించగా.. ఆయన ఏపీ నుంచి డిప్యుటేషన్ ముగించుకుని వెనక్కి రాలేదని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. మైనింగ్ అనుమతుల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రైవేటు సహాయకుడిగా ఉంటూ అరాచకాలన్నిటికీ మధ్యవర్తిగా వ్యవహరించిన శశికాంత్ కోసం కూడా సీఐడీ అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటన తర్వాత ఆయన పరారీలో ఉన్నారు. ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్‌గా ఉన్న వెంకటరెడ్డి 2019లో జగన్ సీఎం అయ్యాక రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఏపీఎండీసీలో చేరి జగన్ ప్రభుత్వంలో పెద్దల దోపిడీకి అన్ని విధాలా సహకరించారు. చంద్రబాబు ప్రభుత్వం రాగానే వెంకటరెడ్డిని సస్పెండ్ చేసి ఏసీబీ విచారణకు ఆదేశించింది. ప్రాథమిక నివేదిక ఆధారంగా సీఐడీ దర్యాప్తు చేపట్టింది.





శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ రజని

వెంకన్న సేవలో ఏపీ ఉపలోకాయుక్త

తిరుమల, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం ఏపీ ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని, పీఎం ప్రత్యేక సలహాదారు రాజేశ్వరప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

విత్తనాలు అందుబాటులో లేకపోవడం రైతులకు శాపం

▸ 4 లక్షల మంది నారు వేసుకోలేకపోయారు: షర్మిల

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నుంచి కృష్ణా డెల్టాకు జలాలు వస్తున్నాయని ఆనందించేలోగా విత్తనాలు అందుబాటులో లేకపోవడం రైతులకు శాపంగా మారిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. విత్తనాల కొరత కారణంగా నాలుగు లక్షల మంది రైతులు నారు వేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్‌కు తగినట్టుగా విత్తనాలు అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 'క్రాప్ హాలీడే నుంచి బీడు భూములను సాగులోకి తెద్దామన్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. రైతులకు నచ్చినవి కాకుండా సర్కారుకు నచ్చిన విత్తనాలు కొనుగోలు చేయాలనడం ఏమిటి? మహిళలని కూడా చూడకుండా విత్తనాల కోసం వర్షంలో నిలబెడతారా? తొక్కిసలాట జరుగుతుంటే అధికారులు చోద్యం చూస్తారా?' అని ఆమె నిలదీశారు. 48 గంటల్లోగా 15 క్వింటాళ్ల జేజీఎల్ 384 రకం విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని ప్రభుత్వాన్ని షర్మిల డిమాండ్ చేశారు.

ఎక్కడా విత్తన కొరత లేదు: మంత్రి అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా విత్తనాల కొరత లేదని, రైతుల కోసం ఎటువంటి చర్యలకైనా ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విత్తనాల కొరతపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన ట్వీట్‌పై 'ఎక్స్' వేదికగా మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. 'ఇది మీ అన్న జగన్ పాలన కాదు. సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా అడుగులు పడుతున్న రాష్ట్రంలో రైతులను అనవసర భయాలకు గురి చేయకండి. ఖరీఫ్‌లో ఇప్పటికే 5.1లక్షల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందించాం. ఇంకా విత్తన పంపిణీ కొనసాగుతోంది. పల్నాడు జిల్లాకు తెలంగాణ నుంచి ప్రైవేట్ వ్యాపారి తెచ్చి, విక్రయిస్తున్న ఒక రకం విత్తనం కోసం కొందరు రైతులు పోటీ పడ్డారు. జేజీఎల్-384 రకం కంటే మేలైన విత్తనాలు 15వేల క్వింటాళ్లను సిద్ధంగా ఉంచాం. రైతులకు ఈ అంశంపై అవగాహన కల్పించాం. అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు సీఎం చంద్రబాబు 80% రాయితీతో విత్తనాలు అందించారు' అని అచ్చెన్న తెలిపారు.

నూతన బ్రాంచిల ఏర్పాటుకు సిడ్బీ సానుకూల స్పందన

▸ ఏపీ ఛాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి వెల్లడి

విజయవాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరిన్ని నూతన బ్రాంచిలను ఏర్పాటు చేయటానికి స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బీ) ముందుకు వచ్చిందని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు తెలిపారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగ ఆర్థిక అవసరాలకు మద్దతుగా మరిన్ని శాఖలు ఏర్పాటు చేయాల్సిందిగా సిడ్బీ సీఎండీ మనోజ్ మిట్టల్‌కు లేఖ రాయగా, సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో సిడ్బీ తన శాఖలను నిర్వహిస్తోందని..., మచిలీపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు వంటి కీలక క్లస్టర్లలో కొత్త శాఖలను ప్రారంభించాలని కోరినట్టు తెలిపారు. సిడ్బీ ఈ ఏడాదిలో కొత్తగా 24 బ్రాంచిలను ఏర్పాటు చేయటానికి సిద్ధంగా ఉన్నట్టు సీఎండీ చెప్పారని, ఏపీలో పలు కొత్త బ్రాంచీలు ఏర్పాటుకానున్నాయని పొట్లూరి వెల్లడించారు.

డిగ్రీ కళాశాలలకు ఫీజుల బకాయిలు విడుదల చేయాలి: రాష్ట్ర అసోసియేషన్

నరసరావుపేట, ఆగస్టు 8: డిగ్రీ కళాశాలల ఫీజుల బకాయిలు 2023-24 విద్యా సంవత్సరానికి విడుదల చేయాలని, జీవోలు 36, 22 రద్దు చేయాలని రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రోటరీ హాల్‌లో గురువారం జరిగిన అసోషియేషన్ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేసినట్టు అసోషియేషన్ అధ్యక్షుడు కనుమర్ల గుండారెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం గత విద్యా సంవత్సరానికి ఒక విడత మాత్రమే ఫీజులు విడుదల చేసిందన్నారు. విద్యా సంవత్సరం ముగిసినా నేటికీ ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడంతో కాలేజీల నిర్వహణ భారమవుతోందన్నారు. బకాయిలతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను కళాశాలలకు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. 2022-2023 విద్యా సంవత్సరంలో కొత్త, అదనపు కోర్సులను ప్రవేశపెట్టడానికి జారీ చేసిన జీవో 36ని రద్దు చేయాలని, జీవో 22 రద్దు పరచి, కోర్సు ఫీజుల నిర్ణయం విషయంలో యూనివర్సిటీలకు అధికారం ఇవ్వాలన్నారు. పీజీ కోర్సులకు ఫీజు రియింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. విద్యా, వసతి దీవెనను నేరుగా కళాశాల ప్రిన్సిపాళ్ల ఖాతాలకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అవయవదాతల పార్థివ దేహాలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ఆ కుటుంబానికి 10 వేలు ఆర్థిక సాయం.. అంత్యక్రియల్లో జిల్లా కలెక్టర్ నేరుగా పాల్గొనాలి

ఉత్తర్వులు జారీ చేసిన స్పెషల్ సీఎస్.. అవయవదానం దినోత్సవాన మంత్రి సత్యకుమార్ హామీ

తక్షణమే ఆదేశాలు జారీ చేయించిన సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అవయవదానంతో పలువురికి జీవదాతలుగా నిలిచిన వారి పార్థివ దేహాలకు గౌరవప్రదమైన వీడ్కోలు తెలిపాలని, వారి అంతిమ యాత్రను రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులకు గురువారం ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు జారీ చేశారు. అవయవదానం చేసిన వారి కుటుంబాలకు రూ.10 వేల సహాయం అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అవయవదానం దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, అవయవ దాతల భౌతికకాయాలకు అంతిమ సంస్కారాన్ని గౌరవప్రదంగా నిర్వహించేలా సీఎంతో మాట్లాడి ఉత్తర్వులు వెలువడేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంత్రి చొరవతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. అవయవదాతల కుటుంబ సభ్యుల్ని గౌరవిస్తూ వారిని శాలువా, ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛాలతో సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం లాంఛనాలతో నిర్వహించే అంతిమ సంస్కారాలకు జిల్లా కలెక్టర్ లేదా జిల్లాస్థాయి సీనియర్ అధికారికి వెళ్లాల్సి ఉంటుంది. అవయవ సేకరణ అనంతరం ఆస్పత్రి నుంచి దాత నివాసం లేదా శ్మశాన వాటికకు భౌతికకాయాన్ని ఉచితంగా తరలించే ఏర్పాటు చేయాలి. జీవదాత భౌతిక దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ముందు ప్రభుత్వం తరఫున కార్యక్రమానికి హాజరైన ఉన్నతాధికారి, స్థానిక ప్రజాప్రతినిధి వారికి గౌరవ వందనంతో అంతిమ వీడ్కోలు పలకాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనంతరం దాతకు సంబంధించిన ఫొటోతో జిల్లా కలెక్టర్ పత్రికా ప్రకటన జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణ ప్రభుత్వమూ స్పందించాలి

అవయవదానం చేసినవారి అంత్యక్రియలు ప్రభుత్వం లాంఛనాలతో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని అఖిల భా రత శరీర అవయవదాతల సంఘం అధ్యక్షురాలు గూ డూ రు సీతామహాలక్ష్మీ కొనియాడారు. తెలంగాణలో కూడా ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఏపీ ప్రభుత్వం సత్వరమే స్పందించి అమలు చేయడం ముదావహమని, తెలంగాణ ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించి జీవోను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన

▸ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

▸ పలువురు కార్యదర్శులను వారి మాతృశాఖకు అప్పగింత

▸ క్లస్టర్ వ్యవస్థతో గ్రామీణ ప్రజలకు సేవలందించే యోచన

▸ వివిధ శాఖల అధికారులతో సీఎం సమావేశంలో చర్చలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసిన వైసీపీ సర్కారు మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో పదుల సంఖ్యలో ఉద్యోగులను నియమించడం, వారికి జాబ్‌చార్ట్ లేకపోవడం, కొందరికి పని ఒత్తిడి ఎక్కువగా ఉండటం, మరికొందరికి అసలు పని లేకపోవడంతో ఈ వ్యవస్థ ప్రక్షాళన తప్పనిసరి అని తేల్చారు. గ్రామాల్లో ఏఎన్ఎం, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి, మహిళా సంరక్షణ కార్యదర్శులను ఉంచి మిగిలిన వారిని వారి మాతృసంస్థలకు అప్పగించాలని ప్రతిపాదనలు రూపొందించారు. వారిలో ఒకరిని డీడీవోగా నియమిస్తారు. అదేవిధంగా వార్డు సచివాలయాల్లో అడ్మిన్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి, శానిటేషన్, ఏఎన్ఎం, మహిళా సంరక్షణ కార్యదర్శులను ఉంచి మిగిలిన వారినందరినీ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు అప్పగించనున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్/హార్టికల్చర్ అసిస్టెంట్‌లు, విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్, పశుసంవర్ధక సహాయకులు తదితర పోస్టులను రద్దుచేసి క్లస్టర్ విధానంలో మాతృశాఖ ఆధీనంలో ఉంచేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. అలాగే పంచాయతీ కార్యదర్శులను పంచాయతీరాజ్ కింద గ్రామ పంచాయతీలకే పరిమితం చేయనున్నారు. రాష్ట్రంలో 10,960 గ్రామ సచివాలయాలు, 4,044 వార్డు సచివాలయాల్లో సుమారు 1.26లక్షల మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు.

క్లస్టర్ వ్యవస్థకు శ్రీకారం...

టీడీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ వ్యవస్థను తీసుకురావాలని ప్రయత్నాలు చేశారు. ప్రతి 5వేల మది జనాభాకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రజలకు అన్ని రకాల సేవలు అందించాలని భావించారు. అప్పట్లో దానిపై సమగ్రమైన ప్రణాళికలు రూపొందించారు. అది కార్యరూపం దాల్చకముందే వచ్చిన వైసీపీ సర్కారు గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొచ్చింది. ఎక్కువమందికి ఉద్యోగాలు కల్పించారన్న గొప్ప తప్ప వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ఈ వ్యవస్థను ఏం చేయాలనే దానిపై కూటమి ప్రభుత్వం సుదీర్ఘ కసరత్తు చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలకు అవసరమైన ఐదారుగురు కార్యదర్శులను అక్కడే ఉంచి మిగిలినవారిని ఆయా మాతృసంస్థలకు పంపడం ద్వారా ఆయా శాఖలను బలోపేతం చేసినట్లవుతుందని చెబుతున్నారు. మినీ మండలాలు, మినీ మున్సిపాలిటీలుగా సేవలందించేలా ఈ సచివాలయాలను తీర్చిదిద్దనున్నారు. దీనిద్వారా మానవ వనరులు వృథా కాకుండా ప్రజలకు విస్తృత సేవలందించే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు.

చేనేత చీరలు కొన్నందుకు థ్యాంక్స్!

▸ చంద్రబాబుకు భువనేశ్వరి ధన్యవాదాలు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తన కోసం రెండు చేనేత చీరలు కొనుగోలు చేయడంపై ఆయన సతీమణి నారా భువనేశ్వరి 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలిపారు. అమూల్యమైన చేనేత రంగాన్ని పునరుద్ధరించి, దానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. నేతన్నల జీవనోపాధికి మద్దతునిస్తూ, మన సంప్రదాయ వస్త్రాల అద్భుత వైవిధ్యాన్ని చాటేందుకు, చేనేత వస్త్రాలు ధరించేందుకు ఎంతో ఇష్టపడతానని పేర్కొన్నారు. నేతన్నలు చీర నేయడం అనేది గ్రామీణ జీవనోపాధికి మూలంతో పాటు సంప్రదాయ వారసత్వ కళ అని భువనేశ్వరి గుర్తు చేశారు. దీనిని ఓ అద్భుతమైన ప్రక్రియగా అభివర్ణించారు.

దొరక్కుండా టూర్లు తిప్పుదాం!

▸ విశాఖ ఏజెన్సీ 'స్థానిక' ప్రజాప్రతినిధులకు జగన్ తాయిలం

▸ దక్షిణ భారత యాత్రకు పంపుతున్న వైనం

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయం ఏమంత తేలిక కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి అర్థమైపోయింది. దాని పరిధిలోని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో.. వైసీపీకి పూర్తి మెజారిటీ ఉన్నా.. పదికి పది స్థానాలను టీడీపీ కూటమి గెలుచుకోవడం మింగుడుపడడం లేదు. దీంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటర్లుగా ఉన్న వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో పడ్డారు. టీడీపీ కూటమికి వారెవరూ అందుబాటులో లేకుండా కుటుంబాలతోపాటు దక్షిణ భారత యాత్రకు పంపుతున్నారు. ఇప్పటికే అరకు, పాడేరు నియోజకవర్గాలకు చెందినవారిని బెంగళూరు తీసుకెళ్లినట్లు వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇక పెందుర్తి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తమ కుటుంబసభ్యులతో గురువారం తాడేపల్లి నివాసానికి తరలివచ్చారు. వారినుద్దేశించి జగన్ మాట్లాడుతూ.. ప్రత్యర్థి పార్టీలు ఐదు లక్షలు ఇస్తాం.. పది లక్షలు ఇస్తామని బేరసారాలు చేస్తాయని.. వాటికి లొంగిపోయి అమ్ముడుపోవద్దని సూచించారు. 2014లో వైసీపీ నుంచి గెలిచి.. టీడీపీలోకి వెళ్లిన 23 మంది ఎమ్మెల్యేలకు రూ.20 కోట్ల చొప్పున ఇస్తామని నమ్మించి.. కేవలం అడ్వాన్సు ఇచ్చి వదిలేశారని చెప్పారు. ఇప్పుడు కూడా విశాఖ జిల్లా స్థానిక ప్రజాప్రతినిధులకు అడ్వాన్సులతోనే సరిపుచ్చుతారని హెచ్చరించారు. అప్పుడు టీడీపీలోకి వెళ్లినవారు మోసపోయామని తెలిసి వెనక్కి వస్తామంటే రాజకీయ విలువల కోసం తాను రావద్దన్నానంటూ బుధవారం అరకు, పాడేరు నియోజకవర్గాల ప్రతినిధులకు చెప్పిన మాటే చెప్పారు. నాడు టీడీపీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలకు రాజకీయ భవిష్యత్ లేకుండా పోయిందన్నారు. విశాఖ స్థానిక సంస్థల్లో టీడీపీ కూటమి కంటే వైసీపీకి సుమారు 400 స్థానాలు అధికంగా ఉన్నా.. పలువురు ప్రజాప్రతినిధులు అధికార కూటమి వైపు చూస్తుండడంతో జగన్ ఆందోళన చెందుతున్నారు. ఓవైపు రాజకీయ విలువల గురించి మాట్లాడుతూ.. వారిని పది రోజులపాటు యాత్రలకు పంపుతుండడం గమనార్హం. ఆ తర్వాత విశాఖలో 'క్యాంపు' నిర్వహించనున్నారు. ఈ నెల 30న పోలింగ్ జరుగనుంది.



హైకోర్టు వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయండి

▸ హైకోర్టు వద్ద న్యాయవాద సంఘాల నిరసన

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టు వద్ద న్యాయవాదులు నిరసనకు దిగారు. గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, సివిల్ లిబర్టీస్ కమిటీ, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థల ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నూతన క్రిమినల్ చట్టాల్లో తెచ్చిన సవరణలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాట్లాడుతూ నూతన చట్టాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు వైకోటేశ్వరరావు, పాటిబండ్ల ప్రభాకరరావు, నర్రా శ్రీనివాసరావు, నంబూరి శ్రీమన్నారాయణ, యడవల్లి రమేశ్, సంపర శ్రీనివాసరావు, ఎస్.రమేశ్, ఇస్మాయిల్, భగత్‌సింగ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

▸ హైకోర్టును ఆశ్రయించిన సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు ఆధారంగా గుంటూరులోని నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా ఆయన తరఫున న్యాయవాది జీవీఎస్ కిషోర్‌కుమార్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. దీంతో శుక్రవారం విచారణ జరుపుతామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ తెలిపారు. ఈ వ్యాజ్యంలో రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్ పిటిషన్ వేశారు.

దాడి వెనుక కుట్రను తేల్చాలి!

▸ టీడీపీ ఆఫీసుపై దాడి వెనుక వైసీపీ నేతలు ఉన్నారనేందుకు ఆధారాలు ఉన్నాయి

▸ అప్పిరెడ్డి, అవినాష్, నందిగం సురేశ్ కార్యాలయం బయట కారులో ఉన్నారు

▸ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశాం

▸ పోలీసుల తరఫున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు

▸ వైసీపీ నేతల ముందస్తు బెయిల్ పిటిషన్లపై కొనసాగుతున్న వాదనలు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగే సమయంలో వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ నేత దేవినేని అవినాశ్ కార్యాలయం బయట కారులోనే కూర్చున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యుల వాంగ్మూలాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు వివరించారు. ఈ దాడి వెనుక ఉన్న కుట్రను తేల్చాల్సి ఉందని చెప్పారు. ఈ కేసులో వైసీపీ నేతలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై వాదనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం పోలీసుల తరఫున వాదనలు వినిపించిన సిద్ధార్థ్ లూథ్రా.. అప్పటి దర్యాప్తు అధికారి ఉద్దేశపూర్వకంగానే కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారని వివరించారు. 'అప్పటి దర్యాప్తు అధికారి దుష్ప్రవర్తన కారణంగా మూడేళ్లుగా కేసు దర్యాప్తులో పురోగతి లేదు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను ఆయన నిర్లక్ష్యం చేశారు. ఉద్దేశపూర్వకంగా కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారని తేలింది. దర్యాప్తు జాప్యానికి బాధ్యులైన ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశాం. నిందితుల దాడిలో టీడీపీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వారి మెడికల్ రిపోర్టులను మార్చి, గాయాలు చిన్నవిగా చూపేందుకు ప్రయత్నించారు. మరో అధికారి కేసు దర్యాప్తు ప్రారంభించిన తర్వాత టోల్ ప్లాజా వద్ద సీసీ కెమెరాల ఫుటేజ్‌ను, ఇతర ఆధారాలను సేకరించారు. దాడి జరిగిన రోజు గాయపడినవారి విషయంలో డాక్టర్లు ఇచ్చిన వాస్తవ మెడికల్ రిపోర్టులను వెలుగులోకి తీసుకొచ్చారు. కొవిడ్ సమయంలో ఒకేసారి అంతమంది అక్కడకు ఎలా చేరుకున్నారు..? ఎవరి ప్రోద్బలంతో వచ్చారో తేలాల్సి ఉంది. ఘటన జరిగిన రోజు నిందితులు ఎక్కడ ఉన్నారు? ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణించారు..? మొబైల్ లోకేషన్లకు సంబంధించి సర్వీసు ప్రొవైడర్ల నుంచి వివరాలు సేకరించాల్సి ఉంది' అని వాదనలు వినిపించారు. అయితే.. గురువారం కోర్టు సమయం ముగియడంతో సీనియర్ న్యాయవాది వాదనలు కొనసాగించేందుకు విచారణను ఆగస్టు 14కి వాయిదా వేస్తున్నట్టు న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. కాగా, టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి వ్యవహారంలో మంగళగిరి గ్రామీణ పోలీసులు నమోదుచేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, కార్యకర్తలు జి.రమేశ్, షేక్ రబ్బాని బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కమలకు సానుకూలం!

డెమోక్రటిక్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా పోటీలో ఉన్న కమలాహారిస్, ఉపాధ్యక్ష అభ్యర్థిగా మిన్నెసోటా గవర్నర్ టిమ్‌వాల్జ్‌ను ఎంచుకున్నారు. మంచిపేరున్న వాల్జ్‌ను ఎంచుకొని ఆమె ఎంతో మంచిపనిచేశారని అమెరికన్ మీడియా మెచ్చుకుంటోంది. గవర్నర్‌గా, ఫుట్‌బాల్ కోచ్‌గా, ఉపాధ్యాయుడుగా విభిన్న భూమికలు నిర్వహించిన వాల్జ్‌ను నిర్ణయించి తనకంటే చక్కగా, గట్టిగా ప్రత్యర్థిని విమర్శించగలిగే వ్యక్తిని కమల తోడుతెచ్చుకున్నారని పార్టీ అభిమానులు సంతోషిస్తున్నారు. డోనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్‌లను ఈయన విచిత్రమైన పదబంధాలతో, చమత్కారాలతో విమర్శిస్తూ ప్రజల దృష్టిని బాగా ఆకర్షించగలుగుతున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి, సైన్యంలోనూ పనిచేసి, మధ్యతరగతి మెచ్చినవాడిగా, శ్రామిక వర్గం పక్షపాతిగా పేరున్న వాల్జ్ చేరికతో విజయానికి కమల మరింత చేరువైనారని ఆమె పార్టీ నమ్ముతోంది.

పార్టీ ప్రతినిధులంతా ముక్తకంఠంతో డెమోక్రటిక్‌పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా అధికారికంగా ఖరారుచేయడంతో ఆమె ఒక కీలక దశ దాటింది. తద్వారా, అమెరికా అధ్యక్ష ఎన్నికల చరిత్రలో ఈ భారత, ఆఫ్రికన్ సంతతి మహిళ కొత్త అధ్యాయాన్ని లిఖించింది. అమెరికాలోని ఒక ప్రధాన రాజకీయపక్షంనుంచి అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని పొందిన తొలి నల్లజాతి వనిత ఆమె. ఇక, జో బైడెన్ బరిలో నిలిచి ఉన్నంతకాలం డోనాల్డ్ ట్రంప్ విజయం ఖాయమనీ, ఆయన చాలా ముందంజలో ఉన్నారని సర్వేలన్నీ తేల్చేశాయి. ఎన్నికల ప్రచారంలోనూ ట్రంప్ దూకుడుగా ఉంటూ వచ్చారు. పార్టీ ఒత్తిడిమేరకు బైడెన్ తప్పుకొని, కమలను క్రమంగా పెద్దలంతా బలపరుస్తున్న తరుణాన సర్వేలు ఆమెకే అనుకూలంగా ఉంటున్నాయి. ట్రంప్ కంటే కమల మెరుగ్గా పరిపాలించగలరని నమ్మేవారి సంఖ్య హెచ్చుతోంది. భారీగా విరాళాలు సమకూరడం, ఆమె సభలకు జనం పెద్దసంఖ్యలో వస్తూండటం స్పష్టంగా కనిపిస్తున్న మార్పు. గతనెలలో ట్రంప్‌మీద భయానకమైన హత్యాయత్నం జరిగిన తరువాత ప్రజల్లో ఆయనపట్ల సానుభూతి పెరిగినమాట నిజం. ఒక ధీరుడిగా, పోరాటవీరుడిగా, రక్షకుడిగా ఆయన కనిపించాడు. తుపాకీ గుండు ఛేదించిన చెవితో, రక్తం చిందిన మొఖంతో, భద్రతాబృందం మధ్యలోనుంచి పిడికిలెత్తి నినదిస్తున్న ఆ దృశ్యం ఓటర్ల మీద ప్రభావం చూపకపోదు. కానీ, ఆ దెబ్బతో ఘోరపరాజయం ఖాయమని డెమోక్రాట్లంతా భయపడి, అధ్యక్ష అభ్యర్థిని మార్చేయడం ఇప్పుడు సానుకూల ఫలితాన్నిస్తున్నది.

ఈ మార్పు గమనించబట్టే, కమలాహారిస్ మూలాలకు సంబంధించి డోనాల్డ్ ట్రంప్ నోట విచిత్రమైన వ్యాఖ్యలు వెలువడ్డాయి. మనమంతా బహుళ సాంస్కృతిక ప్రపంచంలో బతుకుతున్నామని, విభిన్న మతాలు, జాతుల మధ్య వివాహాలతో మానవ సమాజం పురోగమిస్తున్నదని ఆయనకు తెలియకపోదు. కానీ, ప్రత్యర్థి జాతీయతను అనుమానించడం ద్వారా తాను రాజకీయంగా లబ్ధి పొందవచ్చునని ఆయన అనుకున్నారు. ఆఫ్రో అమెరికన్ జర్నలిస్టుల వేదికనుంచి కమల భారతీయురాలే తప్ప, నల్లజాతి కాదని చెప్పదల్చుకున్నారు. ఆమె దశాబ్దాలపాటు తన భారతీయమూలాలను ప్రచారం చేసుకొని, ఇప్పుడే నల్లజాతి అస్త్రాన్ని వెలికితీసిందన్న రీతిలో ట్రంప్ విమర్శ చేశారు. కమల ప్రతిస్పందనను అటుంచితే, ఒక బ్లాక్ ఎకనమిస్టుకు, ఇండియన్ బయోలజిస్టుకు పుట్టిన ఆమె తన రెండు వారసత్వాలను ఘనంగా, గర్వంగా చెప్పుకోవచ్చునని కొందరు అంటున్నారు. బరాక్ ఒబామా, కమలా హారిస్ తండ్రులు ఇద్దరూ నల్లజాతి వారేనని గుర్తుచేస్తున్నారు. భారతీయ అమెరికన్లు, నల్లజాతి అమెరికన్లు ఆమెలో తమను చూసుకుంటారన్న భయం ట్రంప్‌కు ఉండవచ్చు. భారతీయ మూలాలున్నాయి కాబట్టి, ఆమె నల్లజాతీయురాలు కాదని ఆయన నిరూపించడానికి ప్రయత్నించినప్పటికీ, అమెరికన్ శ్వేతజాతి సమాజంలో మిగతాజాతులమీద అది పెద్దగా పనిచేయదు, నిజం ఏమిటో వారికి తెలియనిదీ కాదు. అధ్యక్ష అభ్యర్థిగా కమల ప్రవేశంతో అక్కడి రాజకీయం ఒక్కసారిగా మారింది. అమెరికన్ ప్రజలు ఆశాజీవులనీ, మార్పుకోసం తపిస్తారనీ, బరాక్ ఒబామాను రెండుసార్లు అధ్యక్షుడిని చేసినట్టుగానే, కమలా హారిస్‌నూ గద్దెనెక్కిస్తారని కొందరి నమ్మకం. రేపటి ఆమె విజయం పలురకాల వివక్షలున్న అమెరికన్ సమాజంమీద విశేషమైన ప్రభావం చూపుతుందన్న ఆ నమ్మకం నిజమైతే మంచిదే.

విప్లవానికి అడ్డుగా ఆలుగడ్డ!

మానవుల విప్లవాల గురించి అందరికీ తెలుసు. భాషాభివృద్ధి ఒక మహా విప్లవం. దీనికి సరితూగే విప్లవం ఇప్పటికీ రాలేదు! నిప్పు వినియోగం, చక్రం రూపకల్పనలూ గొప్పవే! విద్యుచ్ఛక్తి వాహనాలూ వాటి ఉన్నత దశలే! ఇక పారిశ్రామిక విప్లవ విశిష్టత తిరుగులేనిది. యంత్రశక్తి ఆధారిత ఆధునిక నాగరికతకు అదే మూలం. అంతకు ముందటి సమాజం శారీరక శ్రమపైనే ఆధారపడేది. కండరాలు కరిగిస్తేనే సంపద సృష్టి అయ్యేది. అలా కరిగించని వాళ్లంతా ఆలోచనాపరులు, వేదాంతులు, బోధకులు, పాలకులు! కండలు కరిగించేవారు సృష్టించే సంపద ఎలా పంపిణీ అవ్వాలో, అందుకు ఏ కట్టుబాట్లు కావాలో నిర్దేశించటమే వారి విధిగా ఉండేది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం వచ్చి ఆర్థిక పరిస్థితులు మారినప్పుడు నూతన భావాలు తలెత్తుతాయి. ప్రజా ప్రాతినిధ్య పాలన, వ్యాపార స్వేచ్ఛ, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పరిమిత పాత్ర లాంటి భావాలు కాస్త అటుఇటుగా పారిశ్రామిక విప్లవంతో పాటే వచ్చాయి. చరిత్ర దృష్టితో చూస్తే ఒకటి మాత్రం స్పష్టంగా కనపడుతుంది. 250 ఏళ్ల క్రితం మొదలైన పారిశ్రామిక విప్లవం ప్రపంచాన్ని సమూలంగా మార్చివేసింది. ఆ విప్లవ విస్తరణ ఇంకా సాగుతూనే ఉంది. యంత్రాలు నడవాలంటే శ్రామికులు కావాలి. వారికి కండపుష్టీ ఉండాలి. అందుకు ఆహార పంటల ఉత్పత్తి బాగా జరగాలి. ఆ పంటల్లో మనమిప్పుడు సాదాసీదాగా భావించే ఆలుగడ్డలు.. ఒకనాడు పోషించిన పాత్రను తెలుసుకుంటే విస్తుపోయే విశేషాలెన్నో వెల్లడవుతాయి. మనమిప్పుడు ఏ డాక్టరు దగ్గరకు వెళ్లినా ఆలుగడ్డల వాడకం తగ్గించాలనే చెబుతారు. కానీ ఒకప్పుడలా కాదు. ఆలుతోనే పేదలు బతికి బట్టకట్టిన కాలముంది. యూరోపు జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరగటానికి ఆలు ఒకప్పుడు విపరీతంగా తోడ్పడింది. పరిశ్రమలకు కావాల్సిన శ్రామికశక్తిని అందివ్వటానికీ దోహదపడింది. ఎక్కడో దక్షిణ అమెరికాలో వేల అడుగుల ఎత్తునున్న ఆండియన్ పీఠభూముల్లో స్థానికులు మాత్రమే వినియోగించే ఆలుగడ్డ విశ్వవ్యాప్తమై ప్రపంచ చరిత్రను మార్చివేసింది. నమ్మలేకపోయినా ఇది నిజం! ఆలు మార్చిన ప్రపంచగతిని విశ్లేషిస్తూ ప్రఖ్యాత చరిత్రకారుడు విలియం.హెచ్.మక్‌నీల్ పరిశోధనాత్మక వ్యాసాన్ని రాశారు. 'ఆక్స్‌ఫర్ ఇన్‌సైక్లోపీడియ ఆఫ్ వర్ల్డ్ హిస్టరీ'లోనూ దాని గురించి ఆసక్తికరమైన వివరాలను అందించారు. అమెరికా ఖండానికి వెళ్లిన యూరోపియన్లు తమలో నిద్రాణంగా ఉన్న సూక్ష్మక్రిములు, వైరస్‌లను స్థానికులకు అంటించి కోట్ల మరణాలకు కారణమైన సంఘటనలపై విపులంగా రాసిన చరిత్రకారుల్లో మక్‌నీల్ ముందు వరుసలో ఉంటారు.



> చరిత్రను రాజుల వీరోచిత చర్యలకూ, మతాల మహత్యాలకు పరిమితం చేస్తే ఆలూ లాంటి పంటలు సృష్టించిన ఆహార విప్లవాలు మనకు కనపడవు. అవి వివిధ వర్గాల ప్రజలపై వేసిన ప్రభావాలూ కనపడవు. మనుషులు ఎన్నో పనిముట్లను సృష్టించారు. ఎన్నో పంటలను కనిపెట్టారు. ఎన్నో శక్తులను గుప్పిటపట్టారు. విజ్ఞాన, అజ్ఞానాలనూ ఆస్వాదించారు. వాటిపై వెలుగులు ప్రసరిస్తేనే చరిత్రకు సార్థకత!

ప్రపంచ ఆహార పంటల్లో ఇప్పుడు వరి, గోధుమ, మొక్కజొన్నలు మొదటి మూడు స్థానాల్లో ఉంటే ఆలు నాలుగో స్థానంలో ఉంది. పెరూ, బలివియల్లోని పర్వత పీఠభూమిలో ప్రకృతి సహజంగా పెరిగే ఆలుగడ్డలను నాలుగువేల ఏళ్ల క్రితమే తిండి పదార్థంగా స్వీకరించి, తర్వాతి కాలంలో దాన్ని తోటల్లో పెంచటంలోనూ స్థానికులు ప్రావీణ్యం సంపాదించారు. విత్తన సాంకర్యాలతో మేలురకాలను పండించటమూ నేర్చుకున్నారు. స్పెయిన్ నావికులు, సాహసికులు దక్షిణ అమెరికాలోకి అడుగు పెట్టేనాటికి అక్కడ ఇన్కా సామ్రాజ్యం ఉండేది. స్పెయిన్ సైనికుల దాడితోనూ, స్థానిక యుద్ధాలతోనూ సతమతమై 1572 నాటికి అది పూర్తిగా కూలిపోయింది. కొత్త సూక్ష్మక్రిములు, వైరస్‌ల దాడిని తట్టుకునే రోగనిరోధక శక్తి లేని స్థానికులు పిట్టల్లా రాలిపోయారు. ఆక్రమదారులు దీన్ని తమ మతం గొప్పతనంగా భావించారు. భగవంతుడే స్థానికులను అడ్డు లేకుండా చేస్తున్నాడని నమ్మారు.

దక్షిణ అమెరికా అంతా ఆలుకు అనుకూలమైన వాతావరణం ఉండేది కాదు. 8372 చదరపు కిలోమీటర్లు విస్తరించిన ప్రఖ్యాత టిటికాక సరస్సు చుట్టు పక్కల మాత్రమే ఆలుగడ్డల పంటకు అనువైన వాతావరణం ఉండేది. చల్లని-తేమ వాతావరణంలోనే ఆలుసాగు సాధ్యమయ్యేది. ఇన్కా సామ్రాజ్యం (1438) ఏర్పడటానికి ముందున్న చిన్న రాజ్యాలకు కూడా ఆలు ప్రధానంగా ఉపయోగపడేది. రాత్రిపూట టిటికాక సరస్సు పరిసర ప్రాంతాల్లో గడ్డకట్టుకుపోయే చలి ఉండేది. నేలమాళిగల్లో ఆలుగడ్డలను భద్రపరటానికి అదెంతో తోడ్పడింది. ఏళ్ల పాటు నిల్వలను నేలమాళిగల్లో ఉంచేవారు. అవసరమైనప్పుడు బయటకు తీసేవారు. ఇప్పటి రిఫ్రిజిరేటర్లుగా నేలమాళిగలు ఉపకరించేవి. భూమిలేని కూలీలకు కూలీగా కూడా ఆలుగడ్డలనే ఇచ్చేవారు. రైతుల నుంచి ఆలుగడ్డలనే శిస్తుగా వసూలుచేసి గిడ్డంగుల్లో ఉంచే వారు. మహా కట్టడాలు, రహదారులు, ఇతర నిర్మాణాలకు అవసరమైన కూలీలకూ ఆలుగడ్డలనే ఇచ్చేవారు. మొక్కజొన్న లాంటి ఒకటి రెండు ప్రధాన పంటలున్నా రుతువులతో సంబంధం లేకుండా లభించే ఆలుగడ్డల వల్ల ఆహారానికి కొరత ఉండేది కాదు. ఆండియన్ పర్వత ప్రాంతంలో వందలేళ్లు నాగరికతలు కొనసాగటానికి నిరంతర ఆహార లభ్యత ప్రధాన కారణంగా ఉండేది.



■ రాహుల్ కుమార్

ఇన్కా సామ్రాజ్యాన్ని కూలదోసిన తర్వాత కూడా స్పెయిన్ సైనికులు, సాహసికులు కూడా ఆలుగడ్డలు, మొక్కజొన్నలపై ఆధారపడి వ్యవహారాలు నడిపారు. బలివియలోని పొటోసీలో (1545) వెండిగనిని తవ్వటానికి కూడా ప్రధానంగా ఆలుగడ్డలనే స్థానికులకు పంపిణీ చేశారు. స్పెయిన్ నుంచి వచ్చినవారికీ అవే ఇచ్చారు. పొటోసీలో తవ్విన వెండి వందేళ్లపాటు యూరప్‌ను ముంచెత్తింది. ఆ వందేళ్లలో స్పెయిన్ ఒక వెలుగు వెలిగింది. గని ఖాళీ కావటంతో స్పెయిన్ ప్రాభవం ముగిసింది. వెండి ప్రవహించిన వందేళ్లు యూరప్‌తోపాటు చైనా, భారత్‌లూ తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. వెండి విపరీతంగా లభ్యమవ్వటంతో వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ధన ప్రవాహం నైతిక విలువల్లో దిగజారుడుని తీసుకు వచ్చింది. భూస్వాముల ప్రతిష్ఠ క్షీణించింది. వెండి దండిగా ఉన్న వ్యాపారుల పరపతి పెరిగింది. చైనా, భారత్‌ల నుంచి వస్తువులు కొనుగోలు చేయటానికి పొటోసీ వెండిని విపరీతంగా వాడారు. దీంతో 17వ శతాబ్దంలో భారత్, చైనాల్లో వస్త్ర, చేనేత పరిశ్రమలు పరుగులెత్తాయి.

ఇట్లా ఆలుగడ్డ నిరంతరంగా అందించిన ఆహారం, దాన్ని ఆధారంగా వెండిగనులను కొల్లగొట్టటం, అక్కడ నుంచి అది యూరప్, ఆసియా దేశాలకు తరలివెళ్లి రాజకీయ, ఆర్థిక మార్పులు కలగచేయటం... ప్రపంచ చరిత్రపై ఆలు కలగచేసిన తొలి ప్రభావంగా చెప్పుకోవచ్చు. రెండో ప్రభావం.. ఆలుగడ్డలే యూరప్ తరలి వెళ్లి అక్కడ ఎన్నో మార్పులకు కారణం కావటం. వాటిల్లో పారిశ్రామిక విప్లవానికి తోడ్పడటం ప్రధానమైంది. స్పెయిన్ నావికులు తిరిగి స్వదేశం వచ్చేటప్పుడు నౌకల్లో ఆలుగడ్డలను, మొక్కజొన్నను నింపుకుని వచ్చేవారు. మొక్కలనూ తెచ్చేవారు. క్రమేపీ పలుచోట్లకు అవి వ్యాపించాయి. మొదట జాలర్లు, ఆ తర్వాత ఐర్లండు రైతులు ఆలు సాగును ప్రారంభించారు. 17వ శతాబ్దం చివరి నాటికి ఐర్లండులో ఆలు బాగా వ్యాపించింది. మరోవైపు స్పెయిన్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లోనూ క్రమేపీ ఆలు విస్తరించింది. ఇంగ్లండు ఆక్రమణలతో తల్లడిల్లిన ఐర్లండు రైతులు ఆలుతోనే ప్రాణాలను దక్కించుకున్నారు. గోధుమతో పోల్చితే రెండు నుంచి నాలుగు రెట్లు అధిక క్యాలరీలు ఆలు నుంచీ లభించేవి. ఎకరం పొలం, పాడి ఆవు ఉంటే ఐర్లండు కుటుంబం నిశ్చింత జీవితాన్ని గడిపేచేది. ఇక యూరపులో నిరంతరం యుద్ధాలు జరుగుతూనే ఉండేవి. ఏళ్లపాటు కొనసాగేవి. సైనిక పటాలాలు కదులుతున్న ప్రాంతాల్లో రైతుల నుంచి ధాన్యాన్ని బలవంతంగా తీసుకునేవారు. యుద్ధ కాలంలో ఆలు పంట మాత్రమే చాలా చోట్ల రైతులకు మిగిలేది. అందువల్లే ప్రతి యుద్ధం అప్పుడూ ఆలుసాగు పెరిగేది. ఆలు విస్తీర్ణం పెరిగినప్పటికీ ఆహారధాన్యాల ప్రాధాన్యం తగ్గలేదు. 1750ల నాటికి ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, రష్యాల్లోకి ఆలు విస్తరించింది. యూరపులో ప్రతి ఏటా మూడోవంతు భూమిని రైతులు ఖాళీగా పెట్టేవారు. కలుపుని నివారించటానికి ఎండకాలంలో ఆ భూమిని దున్ని ఖాళీగా వదిలేసేవారు. ఈ ఖాళీ భూముల్లోనే ఆలూ సాగు మొదలైంది. అందువల్ల ఆహారధాన్యాల ఉత్పత్తికి ఆటంకం కలగకుండానే ఆలు సాగు వ్యాపించింది. క్యాలరీస్ ఎక్కువుండే ఆలు వినియోగం.. జనాభా పెరుగుదల మీద 1750 తర్వాత బాగా ప్రభావాన్ని చూపింది. అందుకే ముఖ్యంగా ఉత్తర యూరపులో జనాభా పెరుగుదల రేటు ఆనాడు రికార్డు స్థాయికి వెళ్లింది. ఆలూని ఎక్కువగా వినియోగించే కిందిస్థాయి వర్గాల్లో సంతానవృద్ధి బాగా పెరిగింది. బ్రెడ్‌తో పోల్చితే ఉడకబెట్టిన ఆలు చాలా చౌక. రై పంట స్థానాన్ని చాలచోట్ల ఆలు ఆక్రమించింది. దీంతో పరిశ్రమలకు కావాల్సిన కార్మికులు చాలా తక్కువ వేతనాలకు లభ్యమయ్యేవారు. పెరిగిన జనాభాతో సైనికులు, నావికుల సంఖ్యను ప్రభుత్వాలు విపరీతంగా పెంచాయి. ఈ బలగాలతోనే 1750 నుంచి 1950ల వరకూ ప్రపంచంపై యూరపు ఆధిపత్యం నడిచింది. దీనికి అనేక ఇతర కారణాలు తోడైనా ఆలు పంట ప్రభావాన్ని కూడా ఒక ప్రధాన కారణంగానే భావించాలని మక్‌నీల్ వ్యాఖ్యానించారు. ఆలు లేకపోతే 1848 తర్వాత జర్మనీ పారిశ్రామిక, సైనిక శక్తిగానే ఎదిగి ఉండేది కాదు. చల్లని, తేమ వాతావరణం ఉన్న అన్ని ప్రాంతాలకూ ఆలు విస్తరించింది. 1980ల నాటికి చైనాలో ఆలు సాగుకు ఇతర ప్రధాన పంటలతో పోల్చితే అంత ప్రాధాన్యం లేదు. 2002 నాటికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆలుకు పెద్ద ఎగుమతి దేశంగా చైనా మారింది. భారత్ కూడా ఆలు ఉత్పత్తిలో ద్వితీయ స్థానానికి చేరుకుంది. చారిత్రక దృష్టితో చూస్తే ఆలూకు వచ్చిన ప్రాధాన్యం స్పష్టంగా తెలుస్తుంది. కానీ మొదట్లో భయాలు, అపోహలు కూడా ఎక్కువే. లుడ్విగ్ ఫాయర్ బాక్స్ అనే జర్మనీ తత్వవేత్త తన దేశ ప్రజల రక్తాన్ని ఆలుగడ్డ పౌరుషహీనం చేస్తోందనీ, భావ విప్లవం జాప్యం కావటానికి కారణమవుతోందని వ్యాఖ్యానించారు. చరిత్రను రాజుల వీరోచిత చర్యలకూ, మతాల మహత్యాలకు పరిమితం చేస్తే ఆలూ లాంటి పంటలు సృష్టించిన ఆహార విప్లవాలు మనకు కనపడవు. అవి వివిధ వర్గాల ప్రజలపై వేసిన ప్రభావాలూ కనపడవు. మనుషులు ఎన్నో పనిముట్లను సృష్టించారు. ఎన్నో పంటలను కనిపెట్టారు. ఎన్నో శక్తులను గుప్పిటపట్టారు. విజ్ఞాన, అజ్ఞానాలనూ ఆస్వాదించారు. వాటిపై వెలుగులు ప్రసరిస్తేనే చరిత్రకు సార్థకత!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఇంతకీ రాజ్యాంగంలో పేజీలెన్ని అధ్యక్షా?!

"రాజ్యాంగంలో ఎన్ని పేజీలు ఉన్నాయి? చెప్పండి, రాజ్యాంగంలో ఎన్ని పేజీలు ఉన్నాయి? ఎప్పుడైనా చదివితేగా తెలియడానికి? ఊరికే రాజ్యాంగం ప్రతిని చేతిలో పట్టుకు తిరిగితే సరిపోదు, కనీసం ఒక్కసారి అయినా చదివారా? చదవరు, కాని ఎప్పుడూ చేతిలో పట్టుకు ఊరూరా తిరుగుతారు"... ఈ మాటలన్నది బీజేపీకి చెందిన పార్లమెంటు సభ్యుడు అనురాగ్ ఠాకూర్. ఈ ప్రశ్న ఎవరిని ఉద్దేశించింది? పదేళ్ల తరువాత ప్రతిపక్ష నాయకుని హోదాలో పార్లమెంటులో నిల్చుని అధికార పక్షాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నది. అనురాగ్ ఈ ప్రశ్న అడుగుతుంటే రాహుల్ బిక్కచచ్చిపోయి, నిరుత్తరుడైపోయాడు. ఇది నిజంగా నిజమేనా? దాదాపు నెలరోజులుగా సామాజిక మాధ్యమాలలో ఈ వీడియో విస్తృతంగా సంచరిస్తోంది. దీన్ని పంపించిన వాళ్లే మళ్లీ మళ్లీ పంపిస్తున్నారు, అందుకున్న వాళ్లే మళ్లీ మళ్లీ అందుకుంటున్నారు. ఇంతకీ ఇది లైవ్ ఫుటేజీలో భాగమేనా? రాహుల్ బిక్కచచ్చిపోవడం, సమాధానం చెప్పలేక దిక్కులు చూడడం... నిజంగా నిజమేనా? కాదు, ఇది అర్ధ సత్యం! ఇంతకీ ఈ వీడియో అసలు స్వరూపం ఏమిటి, కొసరు దుష్ట రూపం ఏమిటీ అని కొందరు సత్యాన్వేషణాపరులు శోధించగా అనురాగ్ ఠాకూర్ ప్రశ్నలు సంధించడం నిజమే గాని, అప్పుడు సభలో రాహుల్ లేరని తేలింది.

ఇంతకీ రాజ్యాంగంలో ఎన్ని పేజీలు ఉన్నాయన్న ప్రశ్నకి ప్రాసంగికత ఏమిటి? సరే, ప్రస్తావన వచ్చింది కాబట్టి రాజ్యాంగం గురించి కాస్త చెప్పుకోవలసిందే: రాజ్యాంగం అసలు ప్రతి హీలియం నింపిన పేటికలో పార్లమెంటు గ్రంథాలయంలో భద్రంగా ఉంది. దీని పరిమాణం నిలువు 22 అంగుళాలు, వెడల్పు 16 అంగుళాలు. మొత్తం 284 మంది రాజ్యాంగ రూపకర్తలు దీనిపై సంతకాలు చేశారు. ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సుప్రసిద్ధ కాలిగ్రాఫర్ ప్రేమ్ బెహారీ నారాయణ్ రాయిజాదాను ప్రత్యేకంగా ఆహ్వానించి అన్ని వసతులు, వనరులు కల్పించి ఇంగ్లీషులో రాజ్యాంగాన్ని రాయించారు. ఈ బృహత్తర కార్యాన్ని భుజానికెత్తుకుని అద్భుతమైన అక్షరాలతో రాజ్యాంగాన్ని లిఖించినందుకు ప్రేమ్ చిల్లిగవ్వ కూడా తీసుకోలేదు. ప్రతి పుటలోనూ తన సంతకం చేసుకోవడానికి అనుమతించమని మాత్రమే ప్రేమ్ కోరారు. అందుకు నాటి ప్రధాని సంతోషంగా అంగీకరించారు. ఈ మొత్తం రాజ్యాంగాన్ని నారాయణ్ పగలనకా రాత్రనకా అకుంఠిత దీక్షతో చేతితో రాశారు. అసలు ప్రతిలో 251 పుటలు ఉన్నాయి. ఈ చరిత్రను అలా ఉంచి వర్తమానానికి వద్దాం.

అసత్యాలతో, అర్ధసత్యాలతో వీడియోలను మార్ఫింగ్ చేసి కుప్పలు తెప్పలుగా జనంలోకి పంపుతున్న వారి అంతిమ లక్ష్యం ఏమిటి? నామ్ కే వాస్తే గా అయినా ఒక ప్రశ్నించే స్వరం ఉండరాదనా? పార్లమెంటులో మాట్లాడే హక్కును పరిరక్షించడానికి కనీసం న్యాయ పరిధిలో, చట్ట పరిధిలో ఏదో ఒక నిర్మాణాత్మకమైన వ్యవస్థ అవసరమా, కాదా? ఇందులో రాజ్యాంగ పరిరక్షక పాత్ర, నిర్వహణ పాత్ర పోషించవలసిన పార్లమెంటు సభ్యుల వైఖరి ఏమిటి? రాజకీయ దురుద్దేశాలతో అసంబద్ధమైన వీడియోలు వస్తుంటే– తమకు అనుకూలమైనవి వచ్చినప్పుడు సంబరపడడం, ప్రతికూలమైనవి వచ్చినప్పుడు విరుచుకుపడడమేనా? వారి పాత్ర ఇంతవరకే పరిమితమా? దేశంలో అత్యంత ఉత్కంఠభరితమైన వాతావరణంలో ఇటీవల జరిగిన ఎన్నికలు, అనూహ్యమైన నాటకీయ ఫలితాలనిచ్చిన ఈ ఎన్నికలు ప్రజాప్రతినిధులకు అప్పగించిన బాధ్యత ఏమిటి? ప్రజలు కోరుతున్నది ఏమిటి? ప్రజా తీర్పు సారాంశం ఏమిటి? కేంద్రంలో ప్రభుత్వం మారకపోయినా, లెక్కల తారుమారైనందుకు అధికార పక్షం వైఖరిలో ఏ కాస్త అయినా సంయమనం, సమతౌల్యం కనిపిస్తుందని ఆశిస్తే అది మాత్రం లేశమైనా కనిపించడం లేదు. కాని ప్రతిపక్షం మాత్రం తమకు అధికారం రాకపోయినప్పటికీ, భారత దేశ ప్రజలు అధికార పక్షం నడ్డి విరగకొట్టి చతికిలపడేటట్టు చేసినందుకు తమకే అధికారం కట్టబెట్టినంత, కొండొకచో అంతకంటె ఎక్కువగానే సంబరపడిపోతోంది. ఇది భారత పార్లమెంటులో ఒకానొక విచిత్రమైన దృశ్యం.

> భారత ప్రజలు 234 సీట్లతో ప్రతిపక్షాన్ని పార్లమెంటులో నిలిపారు. అధికార హోదాలో ప్రతిపక్ష నాయకుడు ఉన్నారంటే అర్థం–ప్రభుత్వం చేసే మంచి పనులను మెచ్చుకుంటూనే, కాని పనులను నిలదీయమని. ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వంలో ఏమి జరుగుతున్నదో, ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఏమి చేయదలచిందో ప్రజలకు వివరించాలని. ఈ 18వ లోక్‌సభ స్ఫూర్తిని అధికారపక్ష సభ్యులు గ్రహించక నోరెత్తేవారి నోళ్లు అవమానాలతో కట్టేయాలని చూస్తే రాజ్యాంగ స్ఫూర్తిని క్షీణింపజేస్తున్నట్టే.



ఈ దృశ్యం ఎంత అధివాస్తవికంగా ఉంది! సీట్లు, ఓట్లు లెక్కల సంగతి అటుంచితే, ప్రస్తుత పార్లమెంటుకు భారత ప్రజలు ఒక దిశానిర్దేశం చేసిన విషయం విస్మరించరానిది. అదేమంటే రాజ్యాంగ పరిరక్షణ. దాన్ని అనునిత్యం విస్మరిస్తున్న విషయం కనిపిస్తూనే ఉంది కదా. తాజాగా కులగణన గురించి రాహుల్ మాట్లాడితే కులమే లేనివాడు కులగణన గురించి మాట్లాడం ఏమిటని ఈ అనురాగ్ ఠాకూరే జూలై 30 తేదీనాడు పార్లమెంటులో మళ్లీ విరుచుకుపడ్డారు. రాజ్యాంగంలో కులాలకు సంబంధించిన అధికరణాలు ఏం చెబుతున్నాయి? కుల మత ప్రాతిపదికపై ఎవరిపైనా వివక్ష చూపకూడదని, కులమతాలతో, లింగ భేదాలతో ప్రమేయం లేకుండా భారత పౌరులు అందరినీ సమానంగా చూడాలనీనూ. ఆ అర్థంలో ఒక సభ్యుడు కులగణన ఆవశ్యకత గురించి సభలో అడుగుతుంటే అసలు నీకు కులమే లేదన్న అర్థంలో హేళన చేయడం ఆ రాజ్యాంగ స్ఫూర్తిని బలహీనపరచడం కాదా?

ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు భారత ప్రజాస్వామ్యానికి ఒక కొంగ్రొత్త అర్థాన్ని ఇచ్చాయి. ఇది 16, 17 లోక్‌సభల వంటి పరిస్థితి కాదు. ప్రజలు చాలా స్పష్టంగా బ్రూట్ మెజారిటీకి కాలం చెల్లిపోయిందని తీర్పు చెప్పారు! అప్పుడంటే ప్రతిపక్ష నాయకుడే లేని నికృష్ట కాలం. ఇప్పుడు అలా కాదు, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారత ప్రజలు ఏకంగా 234 సీట్లతో ప్రతిపక్షాన్ని పార్లమెంటులో నిటారుగా నిలిపారు. అధికార హోదాలో ప్రతిపక్ష నాయకుడు ఉన్నారంటే అర్థం ప్రభుత్వం చేసే మంచి పనులను మెచ్చుకుంటూనే కాని పనులను నిలదీయమని. ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వంలో ఏమి జరుగుతున్నదో, ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఏమి చేయదలచిందో ప్రజలకు వివరించాలని. ఈ 18వ లోక్‌సభ స్ఫూర్తిని అధికారపక్ష సభ్యులు గ్రహించక నోరెత్తేవారి నోళ్లు అవమానాలతో కట్టేయాలని చూస్తే రాజ్యాంగ స్ఫూర్తిని క్షీణింపజేస్తున్నట్టే. ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిన మాట కూడా అదే కదా. వేధింపుల భయంతో పార్లమెంటు సభ్యులు తమ వాక్ స్వేచ్ఛను సరిగ్గా ఉపయోగించుకునే పరిస్థితిని కల్పించనప్పుడు అది పార్లమెంటుకు గాని, రాజ్యాంగానికి గాని ఏమి శోభ చేకూరుస్తున్నట్టు అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఆందోళనతో వ్యాఖ్యానించారు. "ఝార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి కేసు"గా ప్రాచుర్యం పొందిన కేసులో ప్రధాన న్యాయమూర్తి మరో మాట చెప్పారు. పార్లమెంటు సభ్యులు గాని, అసెంబ్లీ సభ్యులు గాని నిర్భయంగా మాట్లాడే పరిస్థితి లేకపోతే, ఏ కారణం చేతనైనా వారు భీతిల్లిపోతే, సమున్నతమైన ఈ సభలు తమ ప్రాతినిధ్య స్వభావాన్నే కోల్పోతాయి, ఆ పరిణామం అభిలషణీయం కాదని ఆయన నొక్కి చెప్పారు. రాజ్యాంగం ప్రజలకు వాక్ స్వేచ్ఛకు హామీ ఇచ్చింది, అదే ప్రజాప్రతినిధులకూ వర్తిస్తుంది. దీన్ని నిర్వీర్యం చేయరాదన్నది ఆయన మాటల సారాంశం. మరి అది ఆచరణలో జరుగుతోందా?

కాలం మారిందని గుర్తించి అధికారపక్ష సభ్యులు వ్యవహరించవలసిన సందర్భం ఇది. ప్రతిపక్షాన్ని గేలి చేయకుండా, వారితో గౌరవంగా మెలిగేటట్టు చూడవలసిన బాధ్యత స్పీకర్‌కే ఉంది. ఏవైనా కీలకమైన నిర్ణయాలు చేసేటప్పుడు ప్రతిపక్ష నాయకునితో పంచుకోవడం బ్రిటన్‌లో ఆనవాయితీగా వస్తోంది. మనం తరిమేశాం కదా అనుకోకుండా, ఈ సంప్రదాయాన్ని అలవరచుకుంటే పోయేదేం లేదు, విద్వేషాలు తప్ప! పార్లమెంటులో అధికార పక్షం కంటె ప్రతిపక్షానికే మాట్లాడే సమయం ఎక్కువ ఇవ్వాలని జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న కాలంలో స్పీకర్‌తో అనేవారట. వారి ద్వారానే కదా ప్రజల సమస్యలు ఏమిటో, వారు కాంక్షిస్తున్నది ఏమిటో తెలుసుకునేది, అధికార పక్షం సభ్యులే మాట్లాడుతూ పోతే పొగడ్తలు తప్ప మరేం ఉంటుంది అని ఆయన పార్లమెంటుకు దిశానిర్దేశం చేసేవారట. మరి వ్యక్తిగత ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండా నెహ్రూ పాటించిన ఈ ప్రజాస్వామిక పద్ధతులను కూడా అలవరచుకోవచ్చు, పోయేదేం లేదు, అహం తప్ప!

■ జగన్ (సీనియర్ జర్నలిస్ట్)

అడవి బిడ్డల పోరాటానికి సంఘీభావంగా...

మధ్య భారతదేశంలో జరుగుతున్న కార్పొరేటీకరణను ప్రశ్నిస్తున్న అడవి బిడ్డలపై ప్రభుత్వం రాజకీయ, సాంస్కృతిక నిర్బంధాలను ప్రయోగించింది. వారిని అణచివేయడానికి కాన్సన్‌ట్రేషన్ క్యాంపులు నడిపి, సాల్వాజుడుం, గ్రీన్ హంట్, సమాధాన్ ప్రహార్ వంటి మిలటరీ ఆపరేషన్లతో భౌతికంగా దాడి చేస్తోంది. ఈ ఆదివాసీలను ఒక జాతిగా కూడా లేకుండా నిర్మూలించడానికి ఈ ఏడాది జనవరి నుంచి 'ఆపరేషన్ కగార్'ను అమలు చేస్తోంది. ఈ అమానుషమైన, రాజ్యాంగ వ్యతిరేకమైన, నాగరిక సమాజం అంగీకరించని మానవ హననాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రజాస్వామిక పద్ధతులలో జరుగుతున్న ఆదివాసీల పోరాటానికి సంఘీభావం తెలుపుతున్నారు. 'ప్రపంచ ఆదివాసీ ప్రజల దినోత్సవం'గా జరుపుకునే ఆగస్టు 9 నుంచి 15వ తేదీ వరకు ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వారంగా నిర్వహిస్తున్నారు.

అడవినే నమ్ముకుని స్వయం పోషకంగా జీవిస్తున్న ఆదివాసీలకు తమదైన ఒక ప్రత్యేక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ జీవన విధానం ఉంది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆదివాసీలు కూడా పాలుపంచుకున్నారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన కొత్త రాజ్యాంగం సంతరించుకున్న ఆధునిక యుగలక్షణాల్లో భాగంగా సమానత్వాన్ని తనలో ఇముడ్చుకుంది. ఆదివాసీలకు అడవిపై ప్రత్యేక రక్షణ కల్పించి, వారి హక్కులను శాసనబద్ధం చేశారు. ఆదివాసీలు చేసిన పోరాటాల ఫలితంగా మరి కొన్ని హక్కులు కూడా సంక్రమించాయి. అయినా వీరు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా, ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారు. దీనికి తోడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, మహారాష్ట్ర, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లలో విస్తరించిన అడవిలోని ఆదివాసీలు నివసించే ప్రాంతంలో దాదాపు నలభై ఏళ్లుగా మైనింగ్ జరుగుతుండడంతో అడవులు, గుట్టలు, కొండలు, నదులు, వాగులు, వంకలు, భూమి, నీరు, గాలి కలుషితమవుతూ ధ్వంసమైపోతున్నాయి. ఆదివాసీలు తమ మాతృకకు దూరమైపోతున్నారు.



> ఆదివాసుల నైసర్గిక, ప్రాదేశిక, పరంపరాగత ప్రత్యేకతలను నాశనం చేయడం ద్వారా భారతీయ సంస్కృతిలోని గొప్పతనమైన భిన్నత్వాన్ని పాలకులు దెబ్బతీస్తున్నారు. దేశ నాగరికతా మూలాలను ధ్వంసం చేస్తున్నారు. కార్పొరేటీకరణ అనేది అడవులకు, ఆదివాసీలకు పరిమితం కాకుండా, దేశంలోని అన్ని రంగాలకు విస్తరిస్తోంది.

ప్రపంచీకరణలో భాగంగా దేశంలో మొదలైన నూతన ఆర్థిక విధానాల వల్ల కార్పొరేట్ శక్తులకు అటవీ వనరులను కొల్లగొట్టాల్సిన అవసరం వచ్చింది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అటవీ, భూసేకరణ చట్టాల్లో మార్పులు తీసుకొచ్చింది. ఫలితంగా తరతరాలుగా జీవిస్తున్న అటవీభూముల నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రయత్నాలు జరుగుతుండడంతో దేశంలో వారి జీవితం, జీవనోపాధి పూర్తిగా సంక్షోభంలో పడ్డాయి.

ఆదివాసీలపై రాజకీయంగా, సాంస్కృతికంగా నిర్బంధాలను ప్రయోగించినా ఫలితం లేకపోవడంతో ప్రభుత్వం భౌతిక దాడులకు దిగింది. బీఎస్‌ఎఫ్ దళాలను దింపి, సైనిక శిబిరాలను పెట్టింది. వేల సంఖ్యలో ఆదివాసీలను చంపేసి, లెక్కలేనంత మందిని జైళ్లపాలు చేసి, స్త్రీలపై అత్యాచారాలు జరిపింది. అటవీ ఫలసాయాన్ని సేకరించకుండా, వ్యవసాయాన్ని చేయకుండా ఆటంకాలు ఏర్పరచింది. గత ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, గత జనవరి నుంచి ఆదివాసీల నిర్మూలనే లక్ష్యంగా 'ఆపరేషన్ కగార్'ను అమలుచేస్తోంది. సరిహద్దుల్లో ఉండాల్సిన సైనిక బలగాలను ఆదివాసీ నివాస ప్రాంతాల్లో దింపి, గడిచిన ఆరునెలల్లో 140 మంది ఆదివాసీలను హతమార్చింది. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న ఆదివాసీలకు నాయకత్వం వహిస్తున్న మూలవాసీ బచావ్ మంచ్ నాయకులను అరెస్టు చేసి జైళ్లలో పెడుతోంది. ఆదివాసీలపై ప్రభుత్వం షెల్లింగ్ దాడులు చేయడం, వారి నివాసాలపై హెలికాప్టర్ల ద్వారా బాంబులు వేయడం మానవ వ్యతిరేకమైనవి.

ఆదివాసుల నైసర్గిక, ప్రాదేశిక, పరంపరాగత ప్రత్యేకతలను నాశనం చేయడం ద్వారా భారతీయ సంస్కృతిలోని గొప్పతనమైన భిన్నత్వాన్ని పాలకులు దెబ్బతీస్తున్నారు. దేశ నాగరికతా మూలాలను ధ్వంసం చేస్తున్నారు. కార్పొరేటీకరణ అనేది అడవులకు, ఆదివాసీలకు పరిమితం కాకుండా, దేశంలోని అన్ని రంగాలకు విస్తరిస్తోంది. ప్రజల రక్తమాంసాలతో తయారైన పబ్లిక్ రంగాన్ని, ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లోని అపార సహజ వనరులనూ కార్పొరేట్లకు అప్పగించడానికి దేశమంతా రాజకీయార్థిక వ్యూహం అమలవుతోంది. దీనికి వ్యతిరేకంగా దేశ ప్రజలతో పాటు మేధావులు కూడా కదులుతున్నారు. ప్రజాస్వామిక హక్కులే కాకుండా, రాజ్యాంగం కల్పించిన హక్కులకు కూడా ప్రమాదం ఏర్పడి, జీవించే హక్కుకు విపత్తుగా మారిపోయింది. ఈ హక్కుల ఉల్లంఘనను రాజ్యాంగ ప్రాతిపదికన వ్యతిరేకించాలి. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు మద్దతుగా నిలబడడమంటే మనకున్న మానవ హక్కులను కాపాడుకోవడమే. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో విడివిడిగా 'ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక'లు ఏర్పడ్డాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవమైన ఈ నెల 9 నుంచి రెండు రోజుల పాటు హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ పోరాట సంఘీభావ ప్రథమ జాతీయ సదస్సు జరగనుంది. ఈ వేదిక ఆదివాసులు చేస్తున్న పోరాటంలోని న్యాయబద్ధతను వివరించనుంది. ఆదివాసులపై జరిగే సైనిక దాడులతో పాటు, వారిపై జరిగే అన్ని రకాల హింసలను ప్రజల దృష్టికి తీసుకురానున్నది.


• రాఘవ

(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం)

ప్రత్యేక హోదాకై ప్రాణాలను వదిలిన మునికోటి

నాటి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో, నేడు తన ఆత్మబలిదానంతోనైనా రావణ కాష్టంలా తగలబడుతున్న ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రత్యేక హోదా, విభజిత అంశాల జల్లులతో శాంతింపజేస్తారని ఆశించిన రామ మునికోటికి నిరాశే ఎదురైంది. రాబోయే తరాల వారి భవిష్యత్ అయినా బాగుండాలనే ఉద్దేశంతో అతడు ప్రాణత్యాగం చేశాడు.

పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో మంచాల వీధి, టీ.నగర్ కాలనీకి చెందిన మునికోటికి తల్లిదండ్రులు లేని కారణంగా చిన్ననాటి నుండి తాతయ్య వద్ద పెరిగాడు. ఆయన సేవా, ఆధ్యాత్మిక స్ఫూర్తిని గమనిస్తూ నలుగురికీ సహాయం చేస్తూ, ప్రజా పోరాటాల్లో తన వంతుగా పోరాడేవాడు, పేద ప్రజలకు అనునిత్యం అండగా ఉండేవాడు. కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తగా తిరుపతి పుర వీధుల్లో అతడు అందరికీ సుపరిచితుడు. మరో విశేషమేమంటే సమైక్యాంధ్ర ఉద్యమంలో ప్రతి పోరాటంలో చురుగ్గా పాల్గొనేవాడు. మునికోటి పోరాటం చూస్తే నాటి 'జై ఆంధ్ర' ఉద్యమ పోరాట స్ఫూర్తి కనబడేది.



విభజనానంతరం నూతన ఆంధ్రప్రదేశ్ ఏర్పడటం, పార్లమెంట్ సాక్షిగా నాటి ప్రధాని రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజిత అంశాలను కేటాయించడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశించాడు. కానీ కేంద్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రత్యేక హోదా, విభజిత అంశాలలో రాష్ట్రానికి తీరని అన్యాయమే జరిగింది. అన్ని రకాల మానవాభివృద్ధి సూచికల్లో అట్టడుగుకు చేరింది. ఆర్థిక లోటుతో ఇబ్బందులను ఎదుర్కొంది. ఏపీకి ప్రత్యేక హోదా దక్కాల్సిందేనని, లేకపోతే ఇక్కడి ప్రజల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇంతటి కీలకమైన అంశంపై రాజకీయ పార్టీలు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉన్నా, రాజకీయాలకే పరిమితమవుతున్నాయని మునికోటి ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటు సాక్షిగా చెప్పిన తర్వాతే రాష్ట్రాన్ని విభజించారని, ఆ హామీలన్నీ నెరవేర్చకపోతే తాను ఏదో ఒక బలమైన నిర్ణయం తీసుకుంటానని మునికోటి తన స్నేహితుల వద్ద పదే పదే చెప్పేవాడు.

ప్రత్యేక హోదా ఉద్యమ కార్యక్రమాలను మునికోటి ముందుండి నడిపేవాడు. ఎక్కడికి వెళ్లినా... ఏ పని చేస్తున్నా రాష్ట్రానికి రావలిసిన హామీలపైనే అతని ధ్యాస. ఈ క్రమంలో ప్రత్యేక హోదా, హామీల కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటాలపై ప్రజా సంఘాల ఉద్యమకారులపై ప్రభుత్వం దమనకాండ, అరెస్టులను చూసి మునికోటి తట్టుకోలేకపోయాడు. ఆ ఉద్వేగంతో తన ఆత్మత్యాగం తర్వాతైనా ప్రభుత్వాలలో చలనం తీసుకురావాలని కోరుతూ ఆత్మాహుతికి యత్నించాడు. 2015 ఆగస్టు 8న తిరుపతిలో ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ 'పోరు సభ'లో వంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు మునికోటి. తమిళనాడులో చికిత్స పొందుతూ మరునాడు తుదిశ్వాస విడిచాడు. మృత్యువుతో పోరాడుతూ కూడా 'ప్రత్యేక హోదా-ఆంధ్రుల హక్కు' అంటూ నినదించాడు. ప్రాణత్యాగం చేసి అమరుడైన మునికోటి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి గుండెల్లో త్యాగానికి ప్రతి రూపంగా శాశ్వతంగా నిలిచిపోయాడు. మునికోటి ఆశయాలను సాధించాలంటే, అన్నీ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసికట్టుగా పోరాడి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించడమే అతడికి మనమిచ్చే నిజమైన నివాళి.

– డా. సాకే శైలజానాథ్,
మాజీ మంత్రివర్యులు

(ప్రత్యేక హోదా కోసం ఆత్మ బలిదానం చేసిన రామ మునికోటి వర్ధంతి నేడు)




భవానీద్వీపం వద్ద వరద ప్రవాహం

కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ఉత్తుంగతరంగమై దూసుకొస్తోంది. నాగార్జున సాగర్ నుంచి భారీ వరద పోటెత్తడంతో అటు పులిచింతల, ప్రకాశం బ్యారేజీతో పాటు ఇటు పులిగడ్డ అక్విడెక్టు వద్ద ప్రవాహం ప్రమాదకరస్థాయికి చేరింది. వరద ప్రవాహానికి పాత యడ్లంక కాజ్‌వే కొట్టుకుపోయింది. ఇక లంక గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పేదలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.


అక్కపాలెం పడమటి వాగులో వరద


ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

ఉధృతంగా..

కృష్ణానదికి భారీగా వరద నీరు

- నిండుకుండలా పులిచింతల ప్రాజెక్టు
- ప్రకాశం బ్యారేజీ వద్ద ఉరుకులు పరుగులు
- పులిగడ్డ అక్విడెక్టు వద్ద ప్రమాదకరస్థాయి..
- కొట్టుకుపోయిన పాత యడ్లంక కాజ్‌వే
- లంకగ్రామాల్లో అధికారులు అప్రమత్తం
- తీర ప్రాంతాల్లో భారీ భద్రత
- నగరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విజయవాడ/మచిలీపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : 2.54 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో డెడ్ స్టోరేజీలో ఉన్న పులిచింతల ప్రాజెక్టు నిండుగా కనిపిస్తోంది. 11 గేట్లను 2.5 మీటర్ల మేర పైకెత్తి 2లక్షల42వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం మొత్తం 45 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 35 టీఎంసీల మేరకు నీటి నిల్వలు చేరుకున్నాయి. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం వరకు నీటి నిల్వలు పెంచాలని అధికారులు భావించినప్పటికీ సీడబ్ల్యూసీ నుంచి వచ్చిన ఆదేశాలతో పది టీఎంసీల ఖాళీని ప్రాజెక్టులో కొనసాగిస్తున్నారు. ఇక.. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి 3లక్షల10వేల88 క్యూసెక్కుల నీరు వస్తోంది. పులిచింతల నుంచి 2లక్షల44వేల61 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఇదికాకుండా పాలేరు నుంచి 254 క్యూసెక్కులు, కీసర నుంచి 54,522 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీ 70 గేట్లలో 60 గేట్లను ఏడడుగుల మేర, పది గేట్లను ఎనిమిది అడుగుల మేర ఎత్తారు. బ్యారేజీ నుంచి 2లక్షల96వేల320 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కాల్వలకు 13,768 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కేఈబీకి 11,407 క్యూసెక్కులు, బందరు కాల్వకు 1,011, ఏలూరు కాల్వకు 1,302, రైవస్ కాల్వకు 4,521, కేడబ్ల్యూకు 5,527 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. మరో రెండు రోజులపాటు ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ప్రకాశం బ్యారేజీకి వరద వచ్చినప్పుడు నదీ పరివాహక ప్రాంతానికి సమీపంగా ఉన్న కృష్ణలంక, రాణిగారితోట, గీతానగర్ ప్రాంతాలు నీట మునిగేవి. ఈ ప్రాంతాలను ఆనుకుని రిటైనింగ్ వాల్ నిర్మించడంతో ఈ ముంపు తప్పింది. అయినప్పటికీ వీఎంసీ అధికారులు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు.


పులిగడ్డ అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

తీరంలో కల్లోలం

పులిగడ్డ అక్విడెక్టు వద్ద 9 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. వరద కారణంగా అవనిగడ్డ నుంచి పాతయడ్లకకు వెళ్లే కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో పాతయడ్లంక గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అవనిగడ్డ తహసీల్దార్ మురళీధర్ గ్రామస్తులను అప్రమత్తంచేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మోపిదేవి మండలంలోని ఉత్తర చిరువోలులంక, అయోధ్య గ్రామాల వద్ద కరకట్ట వెంబడి, షట్టర్లు ఉన్న ప్రాంతాల్లో, కరకట్ట కోతకు గురైనచోట్ల, లాకులు ఉన్న ప్రాంతాల్లో ఇసుక కట్టలు వేసి వరదనీరు గ్రామాల్లోకి ప్రవేశించకుండా అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. పులిగడ్డ అక్విడెక్టు వద్ద నదిలోని నీటిమట్టానికి, అక్విడెక్టుకు మధ్య నాలుగు అడుగుల మేర జాగా మాత్రమే ఉంది. అవనిగడ్డ మండల పరిధిలోని కొత్తపేట, యడ్లంక, దక్షిణ చిరువోలులంక, రేగుల్లంక, మోపిదేవి మండలం బొబ్బర్లంక, కే-కొత్తపాలెం గ్రామస్తులను అధికారులు అప్రమత్తం చేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా గాజుల్లంకకు ప్రజలు రాకపోకలు సాగించకుండా తహసీల్దార్ వి జయప్రసాద్ నేతృత్వంలో పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నారు. పెనమలూరు మండలంలోని యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు లంకభూముల్లోకి వెళ్లొద్దని రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తోట్లవల్లూరు మండలంలోని తోడేళ్లదిబ్బ, కాళింగిదిబ్బ, పాముల్లంక, కనిగిరిలంక, తదితర గ్రామాలకు సమీపంలో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు పెరుగుతోందని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు తహసీల్దార్ కుసుమకుమారి హెచ్చరికలు జారీ చేశారు.

భవానీ ద్వీపం మూసివేత



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదికి వరద పోటెత్తడంతో భవానీ ద్వీపాన్ని గురువారం మూసివేశారు. బోటింగ్ కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి. బోధిసిరి డబుల్ డెక్ క్రూయిజర్‌తో పాటు మెకనైజ్‌డ్ బోట్లు, ఫాంటూన్ బోట్లు, స్పీడ్ బోట్లను తీరంలో నిలిపేశారు. భవానీ ద్వీపాన్ని వరద చుట్టుముట్టి, జెట్టీకి కాస్త దిగువ వరకూ ప్రవాహం నడుస్తోంది. ద్వీపంలో రెస్టారెంట్‌ను ముందుగా మూసివేసి, ఆన్‌లైన్ లావాదేవీలు ఆపేశారు. ద్వీపంలోని విలువైన సామాగ్రిని సురక్షిత ప్రాంతా లకు తరలిస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు, రిసెప్షన్, గ్రౌండ్ రెస్టారెంట్లలోని సామాన్లను, గేమింగ్ జోన్‌లోని పనిముట్లను, కాటేజీల్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను జాగ్రత్త చేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగితే బెర్మ్‌పార్క్ కూడా నీటి ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. దీంతో ఏపీటీడీసీ విజయవాడ డివిజన్ అధికారులు అప్రమత్తమయ్యారు. భవానీ ఐల్యాండ్‌ను పరిశీలించిన ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య ఆ తర్వాత నాగార్జున సాగర్‌కు బయల్దేరారు. అక్కడి ఎత్తిపోతల ప్రాజెక్టు కూడా విజయవాడ డివిజన్ పరిధిలోనే ఉండటంతో పరిస్థితిని సమీక్షించేందుకు వెళ్లారు. కాగా, ద్వీపం వద్ద గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. వీరు ద్వీపంలోకి వెళ్లేందుకు ఒక బోటును సిద్ధం చేశారు. వరద ప్రవాహం నేపథ్యంలో భారీగా చెత్తతో పాటు విషసర్పాలు వచ్చే అవకాశం ఉండటంతో జాగ్రత్తగా ఉండాలని ఈతగాళ్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



దుర్గమ్మ సన్నిధిలో పీవీ సింధు

వన్‌టౌన్, ఆగస్టు 8 : ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు గురువారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ ఆలయానికి వచ్చిన ఆమెకు ఈవో రామారావు స్వాగతం పలికారు. దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

రికార్డు పార్కింగ్

- భారీగా కెనాల్ రోడ్డులో పార్కింగ్ పాట
- రూ.32 లక్షలకు పాడుకున్న కాంట్రాక్టర్
- గత ఏడాది రూ.6.10 లక్షలు మాత్రమే..
- అనూహ్యంగా పెరిగిన ఆదాయం



చిట్టినగర్, ఆగస్టు 8 : వీఎంసీ చరిత్రలో కెనాల్ రోడ్డులోని వాహనాల పార్కింగ్ రికార్డు సృష్టించింది. ఎన్నడూ చూడని ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. అత్యధికంగా రూ.32లక్షల555కు ఎం.వినయ్ దీపక్‌కుమార్ ఈ టెండర్ దక్కించుకున్నారు. ఇక బహిరంగ వేలంలో రూ.30.70 లక్షల వరకు పాట వెళ్లింది. బహిరంగ వేలం అనంతరం సీల్డ్ టెండర్ తెరవగా రూ.32లక్షల555కు దీపక్‌కు మార్ కోట్ చేశారు. ఈ పార్కింగ్ గత ఏడాది రూ.6.10 లక్షలకు టెండర్ ఇవ్వగా, ఈసారి దానికి సుమారు ఐదు రెట్లు పాట పెరగడం విశేషం. గత జూన్‌లో పార్కింగ్ సంబంధించిన కాలపరిమితి ముగియటంతో జూలై 24న పేపర్ ప్రకటన ద్వారా టెండర్ పిలిచారు. గురువారం జరిగిన బహిరంగ వేలం, సీల్డ్ టెండర్ ద్వారా చేపట్టిన పాటలో 34 మంది టెండర్ షెడ్యూలు కొనుగోలు చేసి, 27 మంది పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ నిర్లక్ష్యానికి ఇద్దరు పాదచారులు మృతి
- బీఆర్టీఎస్ రోడ్డులో ఘటన


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు ఇదే..

విజయవాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ తప్పిదం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. బ్రేకుపై కాలు వేయాల్సిన డ్రైవర్ ఎక్స్‌లేటర్ తొక్కడంతో ఇద్దరు పాదచారులు బస్సు చక్రాల కింద నలిగిపోయారు. ఈ ఘటన బీఆర్టీఎస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో ఉన్న పడవలరేవు వంతెన వద్ద గురువారం రాత్రి జరిగింది. గుణదల మధ్యకట్టకు చెందిన వంగర అప్పారావు (73), ఆయన సమీప బంధువు కోల సత్తిబాబు (55) కలిసి బీఆర్టీఎస్ రోడ్డుకు పనిమీద వెళ్లారు. అక్కడి నుంచి నడుచుకుంటూ మధ్యకట్ట ప్రాంతానికి వెళ్తున్నారు.

మిగతా 6వ పేజీలో...

సైబర్ వార్



- సైబర్ నేరాల నియంత్రణకు సరికొత్త ప్రణాళిక
- పోలీసు కమిషనరేట్‌లో పకడ్బందీ చర్యలు
- 200 మంది కమాండోల ఎంపిక
- శిక్షణ కోసం ఎస్‌సీఎస్‌డీఎఫ్‌తో ఎంవోయూ
- 16 నేరాలతో కూడిన యాప్ రూపకల్పన

'మీరు ముగ్గురికి సహాయం చేయండి. ఆ ముగ్గురిని మరో ముగ్గురికి సహాయం చేయమనండి.' ఓ చిత్రంలోని డైలాగ్ ఇది. ఇదే సూత్రాన్ని విజయవాడ పోలీసులు ఇప్పుడు అమలు చేస్తున్నారు. సైబర్ నేరాల నియంత్రణతో పాటు వాటిపై అవగాహన పెంచడానికి సైబర్ కమాండోలను ఎంపిక చేశారు. ఒక్కో కమాండో సైబర్ సోల్జర్స్‌ను తయారు చేస్తారు. ఈ సోల్జర్స్ సైబర్ సిటిజన్స్‌ను సిద్ధం చేస్తారు. ఈ చైన్‌ను నిరంతరం కొనసాగించాలని అధికారులు భావిసున్నారు. అప్పుడే సైబర్ నేరాలకు అడ్డుగోడను నిర్మించవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.


(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పోలీసు కమిషనరేట్‌లో లా అండ్ ఆర్డర్‌తో పాటు వివిధ విభాగాల్లో బీఎస్సీ కంప్యూటర్స్, బీటెక్, ఎంటెక్ విద్యార్హతలు ఉన్నవారు కానిస్టేబుళ్లుగా ఉన్నారు. వారిలో 200 మందిని సైబర్ కమాండోలుగా ఎంపిక చేశారు. వారికి సైబర్ నేరాలు జరిగే తీరు, వాటి దర్యాప్తు ఎలా సాగించాలన్న దానిపై శిక్షణ ఇప్పించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉన్న స్కూల్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ (ఎస్‌సీఎస్‌డీఎఫ్)తో ఒప్పందం చేసుకోవాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. వాటితో పాటు సైబర్ సెక్యూరిటీ, సీడీఆర్ (కాల్ డేటా రికార్డ్) తీయడం వంటి అన్ని అంశాలపైనా తర్ఫీదు ఇప్పించాలని భావిస్తున్నారు. శిక్షణ పొందిన కమాండోలు ఇతర పోలీసులకు శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుంది.

ప్రత్యేక యాప్ రూపకల్పన

అసలు సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఎలా వల విసురుతారు? ఏవిధంగా ఉచ్చులోకి దింపుతారు? ఎలా నిలువునా ముంచుతారు? అనే అంశాలను ప్రత్యక్షంగా వాస్తవికతతో విద్యార్థులకు, యువతకు, ప్రజలకు వివరించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. తరచూ ప్రజలు ఎక్కువగా మోసపోయిన నేరాల్లో 16 మోసాలను సైబర్ పోలీసులు గుర్తించారు. ఇందులో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, డిజిటల్ అరెస్టు, సెక్స్టార్షన్, జాబ్ ఫ్రాడ్స్ తదితర నేరాలను ఎంపిక చేశారు. ఈ 16 నేరాలతో కలిపి సిమ్యూలేటెడ్ ఎక్సర్‌సైజ్ పేరుతో ఒక యాప్‌ను రూపొందించారు. సైబర్ కమాండోలుగా ఎంపికైన 200 మంది పోలీసుల ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ఈ సైబర్ కమాండోలు విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. వాటి నుంచి ఆసక్తి ఉన్న వారిని సైబర్ సోల్జర్స్‌గా ఎంపిక చేస్తారు. వారికి కొత్తగా రూపొందించిన యాప్‌లో పొందుపరిచిన 16 నేరాలు జరిగే తీరును, మోసపోయే విధానాన్ని చూపిస్తారు. ఒక వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని, ఎలా డబ్బులు కోల్పోతాడో వాస్తవికతను చూపిస్తూ వివరిస్తారు. యాప్‌ను ఈనెల పదో తేదీన విజయవాడలో నిర్వహించే సైబర్ వాక్‌థాన్‌లో ఆవిష్కరించాలని అధికారులు నిర్ణయించారు.

పాడిరైతులకు రూ.13.5 కోట్ల బోనస్

- కృష్ణామిల్క్ యూనియన్ మొదటి విడత విడుదల
- చైర్మన్ చలసాని ఆంజనేయులు వెల్లడి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 8 : అత్యధిక పాలసేకరణ ధర చెల్లించడంతో పాటు ముందస్తు బోనస్‌లు చెల్లిస్తూ పాడిరైతు కుటుంబాల అభివృద్ధే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. పాడి రైతులకు

మిగతా 6వ పేజీలో...

పంద్రాగస్టు వేడుకలకు ప్రత్యేక అతిథిగా చల్లపల్లి సర్పంచ్

న్యూఢిల్లీలో జరిగే వేడుకలకు ఆహ్వానం

6లో..

పంద్రాగస్టు వేడుకలకు ప్రత్యేక అతిథిగా చల్లపల్లి సర్పంచ్

- న్యూఢిల్లీ(ఎర్రకోట)లో జరిగే వేడుకలకు ఆహ్వానం
- రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరు సర్పంచ్‌ల్లో కృష్ణకుమారి ఒకరు



చల్లపల్లి, ఆగస్టు 8 : న్యూఢిల్లీ ఎర్రకోటలో ఈనెల 15వ తేదీన జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందింది. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ సంస్థ ద్వారా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సర్పంచ్ కృష్ణకుమారి పాల్గొనను న్నారు. పంద్రాగస్టు వేడులకు రాష్ట్రం నుంచి ఐదుగురు మహిళా ప్రజాప్రతినిధులను ప్రత్యేక అతిథులుగా పంచాయతీరాజ్ శాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఉత్తర్వులు అందించారు.

రాష్ట్రం నుంచి ఐదుగురిలో కృష్ణకుమారి ఒకరు

ఎర్రకోటలో పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రం నుంచి మహిళా ప్రజాప్రతినిధుల్లో చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి, అల్లూరి సీతారామరాజు జిల్లా మినుములూరు సర్పంచ్ లంకెలి చిట్టమ్మ, అనంతపురం జిల్లా గోళ్ల సర్పంచ్ బి.కవితలను, పశ్చిమ గోదావరి జిల్లాలో వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, గుంటూరు జడ్పీచైర్‌పర్సన్ కె.హెనీ క్రిస్టీనాలు ఎంపికయ్యారు. విద్యావంతురాలైన సర్పంచ్ కృష్ణకుమారి గతంలో జడ్పీటీసీగా పనిచేశారు.

సుపరిపాలన, క్లీన్ అండ్ గ్రీన్ అంశాల ప్రాతిపదికన చల్లపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఓడీఎఫ్ ప్లస్‌గా ఉండటం, ప్రతి రోజూ చెత్త సేకరణ, పరిశుభ్రత, తాగునీటి సరఫరా తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఎంపికైన ప్రజాప్రతినిధులు భర్తతో కలిసి వేడుకల్లో పాల్గొనేందుకు పంచాయతీరాజ్‌శాఖ ఏర్పాట్లు చేసింది.

14వ తేదీన ఢిల్లీలోని జన్‌పథ్‌లో డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే 'పాజిటివ్ ఇంపాక్ట్ ఆఫ్ వుమెన్ లీడర్‌షిప్ ఇన్ పంచాయతీ' జాతీయ వర్క్‌షాపులో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొంటారు. అనంతరం తీన్‌మూర్తి మార్గ్‌లోని ప్రధాన మంత్రి సంగ్రహాలయను సందర్శిస్తారు. 15వ తేదీ ఉదయం ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు.

సాగు నీరు విడుదల చేయండి

- మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే వసంత వినతి



జి.కొండూరు, ఆగస్టు 8: నాగార్జున సాగర్ నుంచి సముద్రంలోకి మళ్లిస్తున్న సాగునీటిని ఎన్‌ఎస్‌పీ మూడో జోన్‌కు మళ్లించి మైలవరం నియోజకవర్గ పరిధిలోని చెరువులను నింపాలని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్యతో కలిసి వసంత అమరావతి సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో చాలా చెరువులు ఇప్పటికీ నిండలేదని, మెట్ట ప్రాంతానికి సాగర్ జలాల అవసరం ఎంతో ఉందని, మాగాణి సాగు ఆలస్యం కాకుండా ఉంటాలంటే సాగర్ జలాలను వృథాగా పోకుండా చెరువులకు మళ్లించుకోవడం ఉత్తమమని గుర్తు చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించార

పేద అర్చకులు దరఖాస్తు చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8 : ప్రైవేటు ఆలయాల్లో పనిచేస్తున్న పేద అర్చకులకు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని.. అర్చకులు తమ దరఖాస్తులను ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో ఉన్న దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని టీడీపీ కృష్ణాజిల్లా బ్రాహ్మణ సాధికారిక సమితి కన్వీనర్ పీవీ ఫణికుమార్ తెలిపారు. ప్రైవేటు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ఆర్థిక సాయం అందించేందుకు చంద్రబాబు ముందుకు రావడం అభినందనీయని, ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరిలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆదివాసీల దినోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పక్కన కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా తదితరులు

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

- నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 8 : గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసి సమాజంలో సమానత్వాన్ని కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ సందర్భంగా అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు గిరిజన, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను గురువారం మంత్రి సంధ్యారాణి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, ఇతర అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేస్తారని, గిరిజన నృత్యాలను తిలకించి, గిరిజన ఉత్పత్తుల స్టాల్స్‌ను పరిశీలిస్తారన్నారు. ఆదివాసీలతో మమేకమై వారి స్థితిగతులను అడిగి తెలుసుకొని గిరిజనుల అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సమక్షంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి సంధ్యారాణి తెలిపారు. మంత్రి వెంట గిరిజన సంక్షేమ కార్యదర్శి కె.కన్నబాబు, కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, ఆర్డీవో సీహెచ్ భవానీశంకర్, జిల్లా గిరిజనసంక్షేమ అధికారి జె.సునీత వున్నారు.

హెరిటేజ్ కార్యాలయానికి నారా బ్రాహ్మణి

పెనమలూరు, ఆగస్టు 8 : స్థానిక ప్రధాన రోడ్డులోని హెరిటేజ్ కార్యాలయానికి మంత్రి నారా లోకేశ్ సతీమణి, సంస్థ బాధ్యులు నారా బ్రాహ్మణి గురువారం వచ్చారు. కనీసం 3 గంటలు కార్యాలయంలో గడిపిన ఆమె సిబ్బంది, అధికారులతో సమావేశమై సంస్థ అభివృద్ధికి పలు సూచనలు చేశారు.

ప్రాణాలు తీసిన ఆర్టీసీ బస్సు

(5వ పేజీ తరువాయి)



గవర్నరుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం మధ్యాహ్నం సాంకేతికలోపంతో ఆగిపోయింది. దీన్ని బీఆర్టీఎస్ రోడ్డులో నిలుపుదల చేశారు. ఈ బస్సును గ్యారేజీకి తీసుకెళ్లడానికి ఏపీ07 జడ్ 0367 నెంబరు గల మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చింది. ఆగిపోయిన బస్సును.. వచ్చిన బస్సుకు అనుసంధానం చేయడానికి ఒక ఇనుప రాడ్డును రెండింటికీ బిగిస్తారు. ఇలా రాడ్డును బిగించడానికి డ్రైవర్ బస్సును రివర్స్ చేశాడు. బ్రేకుపై కాలు వేయడానికి బదులుగా ఎక్స్‌లేటర్ తొక్కడంతో బస్సు.. నడుచుకుంటూ వెళ్తున్న అప్పారావు, సత్తిబాబుకు మీదకు దూసుకెళ్లింది. ఇద్దరూ బస్సు చక్రాల కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు.

పాడిరైతులకు రూ.13.5 కోట్ల బోనస్

(5వ పేజీ తరువాయి)

మొదటి విడత 4 నెలల కాలానికి ముందస్తు బోనస్‌గా రూ.13.5 కోట్లు గురువారం విడుదల చేశారు. ఇందులో భాగంగా హనుమాన్‌జంక్షన్ పాల శీతలకేంద్ర పరిధిలోని పాల సొసైటీలకు కోటీ 57 లక్షలా 48 వేల 148 రూపాయల బోనస్ విడుదల చేశారు. పాడిరైతు కుటుంబాల సంక్షేమానికి కళ్యాణమస్తు లాంటి పథకాల ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ పాలసేకరణ పెంచేందుకు మేలుజాతి పశువుల ఉత్పత్తికి సబ్సిడీపై సెమన్‌ను, పశువుల సంక్షేమానికి మొబైల్ వైద్య సౌకర్యం కల్పిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ముంపు ముంగిట..

కృష్ణమ్మకు వరద పోటు..

భయం గుప్పెట్లో లంక గ్రామాల ప్రజలు

- పులిగడ్డ వద్ద తొమ్మిది అడుగులకు వరద నీరు
- శుక్రవారం నాటికి ఆక్విడెక్ట్‌ను తాకే అవకాశం
- బిక్కు బిక్కుమంటున్న ప్రజలు



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్, ఆగస్టు 8 : ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తిసామర్థ్యంతో నిండిపోవటంతో ప్రకాశం బ్యారేజీ నుంచి దాదాపు 2 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయటంతో కృష్ణానది పరవళ్లు తొక్కుతూ సాగరుడితో సంగమించేందుకు పోటెత్తింది. బుధవారం ఉదయం విడుదల చేసిన నీరు ఇప్పటికే పులిగడ్డ వద్ద రెండుగా చీలి నాగాయలంక, కోడూరు మండలాల వైపు ప్రవహిస్తుండగా, పులిగడ్డ వద్ద ఇప్పటికే నీటిమట్టం తొమ్మిది అడుగులకు చేరింది. వరద ఉధృతి కొనసాగుతుండటంతో కృష్ణానదీ గర్భంలోని లంకలపైకి నీరు చేరుతుండగా,



నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం వద్ద ఉధృతంగా..

శుక్రవారం ఉదయానికి మరింత వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, దీని కారణంగా పాత ఎడ్లంక కాజ్‌వే పైకి నీరు చేరే అవకాశాలు ఉన్నాయని ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. గురువారం విడుదల చేసిన సుమారుగా 3 లక్షల క్యూసెక్కుల నీరు శనివారం నాటికి ఈ ప్రాంతానికి చేరుకుంటుందని, శనివారం నుంచి వరద క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని డీఈ తెలిపారు. కృష్ణానదికి వచ్చిన వరదలు చూసేందుకు పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద, నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.



ఇసుకను బస్తాల్లో తరలిస్తున్న సిబ్బంది

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పులిగడ్డ ఆక్విడెక్ట్ పరిసర ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని రెవెన్యూ, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద పరిస్థితిని ఇరిగేషన్ ఈఈ గంగయ్య గురువారం సాయంత్రం పరిశీలించారు. వరద పరిస్థితిని డీఈ రావెళ్ల రవికిరణ్ ఆయనకు వివరించారు. వరద ఉధృతి పెరిగితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈఈ ఆదేశించారు. పాత ఎడ్లంక కాజ్‌వే వద్ద అవనిగడ్డ ఎస్‌ఐ శ్రీనివాస్ గురువారం సాయంత్రం వరద పరిస్థితిని పరిశీలించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నాగాయలంక : కృష్ణాకు వరద పోటెత్తుతున్న దృష్ట్యా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం నాగాయలంక వద్ద లోతట్టు ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు.

కరకట్టల పటిష్టతకు చర్యలు

మోపిదేవి : కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల్లో కరకట్టల పటిష్టతకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. మండలంలోని నాగాయితిప్ప, కోసూరువారిపాలెం, ఉత్తర చిరువోలులంక, అయోధ్య గ్రామాల వద్ద కోతకు గురైన కరకట్టలపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌సీ డీఈ భానుబాబు పర్యవేక్షణలో మోపిదేవిలోని స్టాక్ పాయింట్ నుంచి ఇసుక బస్తాలను కరకట్టలు కోతకు గురైన ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నారు.



లంక గ్రామాల్లో పడవలపై ప్రయాణం..

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలం కృష్ణా పాయలకు గురువారం వరద ఉధృతి పెరిగింది. గురువారం 3లక్షల 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్టు డిప్యూటీ తహసీల్ధార్ టి.ధనలక్ష్మి తెలిపారు. సాయంత్రం ఆర్డీవో రాజు మండలంలో పర్యటించి వరద తీవ్రతను పరిశీలించారు. రేవుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, లంక గ్రామాల ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పడవలపై లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

పడవపై తోట్లవల్లూరు వస్తున్న పాములలంక ప్రజలు

మునేరుకు వరద పోటు

వత్సవాయి : పోలంపల్లి ఆనకట్ట వద్ద ఎగువ నుంచి వస్తున్న వరదతో పరవళ్లు తొక్కుతోంది. మునేరు ఉధృతికి నదీ పరివాహక ప్రాంతాలైన ఇందుగపల్లి, కన్నెవీడు. పోచవరం, గంగవల్లి, ఆల్లూరుపాడు తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు నదీ ప్రవాహాన్ని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నదీ ప్రవాహం నిలకడగా ఉన్నట్టు మునేరు ఆయకట్టు ఏఈ నరసింహ తెలిపారు.



ఎగువనుంచి వస్తున్న వరదతో పరవళ్లు తొక్కుతున్న మునేరు

ఏనుగుల కోడు.. రైతుల గోడు!

- వరి పొలాల్లోకి చేరుతోన్న డ్రెయిన్ మురుగు
- లబోదిబోమంటున్న వల్లూరుపాలెం అన్నదాతలు
- అసంపూర్తిగా గుర్రపుడెక్క తొలగింపు పనులపై అసహనం

తోట్లవల్లూరు, ఆగస్టు 8 : ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల తీరు వల్లూరుపాలెం రైతులకు శాపంలా మారింది. ప్రభుత్వ నిధులతో కాంట్రాక్టరుతో సక్రమంగా పని చేయించలేకపోతున్నారు. పని సగంలోనే వదిలేయటంతో ఏనుగులకోడు డ్రెయిన్ మురుగు రివర్స్‌లో ఎగదన్ని వరిచేలను ముంచేస్తోంది. గురువారం వల్లూరుపాలెం రైతులు కాంట్రాక్టరు తీయకుండా వదిలేసిన గుర్రపుడెక్కను చూపుతూ మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.



వల్లూరుపాలెం వద్ద ఏనుగుల కోడు డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్కను చూపుతున్న రైతులు



పొలాల్లోకి చేరిన మురుగు

అసంపూర్తి పనులతో వరికి తీవ్ర నష్టం..

తాడిగడప నుంచి పత్తేలంక వరకు 23 కిలోమీటర్ల పొడవున ఏనుగులకోడు డ్రెయిన్ విస్తరించి ఉంది. పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల తదితర మండలల్లో వేలాది ఎకరాల్లో మురుగును బయటకు చేరవేస్తుంది. ఈ ఏడాది రూ. 14.73 లక్షల కాంట్రాక్టుతో తాడిగడప నుంచి వల్లూరుపాలెం వరకు గుర్రపుడెక్కను తొలగించారు. వల్లూరుపాలెం నుంచి దిగువకు డెక్క తొలగింపు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని వల్లూరుపాలెం రైతులు కాట్రగడ్డ సాయి, కాట్రగడ్డ రవి, జమ్మలమూడి నాగరాజు, సువర్ణగంటి శంకర్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చిన మురుగు వల్లూరుపాలెం వద్ద స్తంభించిపోవటంతో కట్ట మీదుగా వరిపొలాల్లోకి ప్రవేశిస్తోందని.. ఇప్పటికే మురుగు వల్ల రెండు సార్లు వరినాట్లు దెబ్బతిన్నాయని ఒక్కో ఎకరానికి రూ. 30 వేలు ఖర్చుపెట్టి నాట్లు వేశామన్నారు. వల్లూరుపాలెం వద్ద వందల ఎకరాలపై మురుగు ప్రభావం ఉందని చెప్పారు. తక్షణం డెక్క తొలగించకుంటే వరినాట్లు మూడోసారి కూడా దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.

మార్చి వరకు డెక్క తొలగించవచ్చు : ఏఈ మణికంఠ

జూలై 20న గుర్రపుడెక్క తొలగింపునకు అగ్రిమెంటు కుదిరిందని, 9వ కిలోమీటరు నుంచి 23వ కిలో మీటరు వరకు గడ్డిపరక లేకుండా చేశాం, వల్లూరుపాలెం వద్ద కట్ట ఎత్తుగా ఉండటంతో గుర్రపుడెక్క తీయటానికి వీలుపడలేదన్నారు. వచ్చే మార్చి వరకు పనులు చేయవచ్చు.

ఎంపెడా సభ్యునిగా ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సముద్ర ఉత్పత్తులు, ఎగుమతుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎంపెడా) సభ్యుడిగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎన్నికయ్యారు. ఈ పదవికి తొలుత ఐదుగురు ఎంపీలు పోటీపడగా ముగ్గురు వైదొలిగారు. కేంద్ర వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఎంపెడా విభాగం సభ్యునిగా ఎన్నికైన ఎంపీ వల్లభనేనిని పలువురు అభినందించారు.

అంగన్వాడీలకు సొంత భవనాలు

- ఎంపీ శివనాథ్ వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 1457 అంగన్‌వాడీల్లో 892 కేంద్రాలకు సొంత భవనాలు లేవని, వాటికి సొంత భవనాలు నిర్మించాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. గురువారం కేంద్రమంత్రిని శివనాథ్ కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

పవన్‌ను కలిసిన ఎస్పీ



గన్నవరం : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన పవన్ కళ్యాణ్‌కు ఎస్పీ మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గాన పవన్ మంగళగిరి వెళ్లారు.

కొరవడిన నిఘా!

- సరిహద్దులో పెచ్చుమీరుతున్న అసాంఘిక శక్తులు..
- యథేచ్ఛగా మద్యం, గంజాయి రవాణా



అష్టలక్ష్మి ఆలయ సమీపంలో నిఘా లేని బోర్డర్ చెక్‌పోస్టు

తిరువూరు : పట్టణ శివారుల్లోని ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టుల వద్ద, సిబ్బంది లేకపోవడంతో అసాంఘిక శక్తులు యథేశ్చగా పట్టణంలోకి ప్రవేశిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తిరువూరు, భద్రాచలం బైపాస్ రోడ్డులో, అష్టలక్ష్మి ఆలయం వద్ద, మునుకుళ్ల, అక్కపాలెం, కోకిలంపాడు, వావిలాల, నూజివీడు రోడ్డులో కాకర్ల వద్ద సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటుతో పాటు, పోలీసు నిఘా నిరంతరం కొనసాగేది. ప్రస్తుతం చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

మద్యం, గంజాయి అక్రమ రవాణా..

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసు బందోబస్తు లేకపోవడంతో తెలంగాణ ప్రాంతం నుంచి ఆకతాయిలు, మద్యం, గంజాయి పట్టణంలోకి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ శివారులో ఆర్టీఏ చెక్‌పోస్టు తొలగించడంతో, బహిరంగంగానే ఇసుక టిప్పర్లు పెద్దసంఖ్యలో తెలంగాణకు ఇసుక రవాణ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. పట్టణంలోని బైపాస్ జంక్షన్, ఒక ప్రైవేటు వెంచర్, కోకిలంపాడు జంక్షన్, మల్లమ్మచెరువు రోడ్డు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని కొందరు గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం.

గతంలో ఇంటర్ విద్యార్థి, గంజాయికి అలవాటు పడి చదువుకు దూరమవడం పాటు, ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులు ప్రట్టణంలోకి ప్రవేశించి, పలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ వైద్యశాల వద్ద వరుస బైక్ దొంగతనాలు జరిగాయి.

కట్టడి చర్యల్లో అధికారులు విఫలం..

పట్టణంలో పలు ప్రాంతాల్లో నిషేధిత మత్తుపదార్థాలు విక్రయిస్తున్నా అరికట్టడంలో, అధికారులు శ్రద్ధచూపడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సదస్సులు నిర్వహించడం మినహా, పట్టణంలో అసాంఘిక శక్తుల్ని నిలువరించడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. పట్టణ సరిహద్దులో అధికారులు నిఘా ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

- సెక్టర్-1ఎస్సై సత్యనారాయణ

బోర్డర్ చెక్‌పోస్టులతో పాటు పట్టణంలో పోలీసు నిఘా కొనసాగిస్తాం. ఎన్నికలు, ఇతర సందర్భాలలో చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉండేది. పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆక్వాటిక్‌లో యజ్ఞసాయికి మెడల్

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 8: ఒడిశా రాష్ట్రం కళింగపట్నం స్టేడియంలో జరుగుతున్న నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో జిల్లా స్విమ్మర్ సబ్ జూనియర్ విభాగంలో 800 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఎం.యజ్ఞసాయి 8:54.20 సెకన్లలో ఈది రజతంతో సత్తా చాటాడు. తొలుత 400 మీటర్లలో ఫ్రీ స్టయిల్‌లో రజతాన్ని యజ్ఞసాయి కైవసం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ మెడల్‌తో వరుసగా రెండు రజతాలను తన ఖాతాలో వేసుకున్నాడు. పాట్నా ఎమ్మెల్యే అఖిలాష్ చంద్ర, ఒడిశా ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ పాటిల్ మెడల్ అందించి అభినందించినట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ తెలిపారు.

3 కేజీల బంగారు ఆభరణాలు స్వాధీనం

పాయకాపురం, ఆగస్టు 8 : బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 3.336 కేజీల బంగారు ఆభరణాలను గురువారం నున్న రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు సహా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా నున్న రూరల్ పోలీసులు ఉదయం పాయకాపురం శివారుల్లోని ఇన్నర్‌రింగ్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో నూజివీడు నుంచి నగరంలోకి వస్తున్న ఏపీ 40 బీటీ 8282 నెంబరు గల కారులో బంగారు ఆభరణాలను గుర్తించారు. వీటికి సరైన పత్రాలు లేకపోవడంతో కారు, ఆభరణాలను స్వాధీనం చేసుకుని రవీంద్రబాబు, అంజిబాబులను అదుపులోకి తీసుకున్నారు. వీరు నూజివీడులో బంగారపు దుకాణాన్ని నిర్వహిస్తున్నారని ఆభరణాలను అక్కడి నుంచి నగరంలోని బంగారం షాపునకు తీసుకువెళ్తున్నట్టు తెలిసింది.

దోమతెరలు పంపిణీ



పాయకాపురం, ఆగస్టు 8 : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని రాజీవ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ వంశీలాల్ రాథోడ్ అన్నారు. మ్యాన్‌కైండ్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు, బాలింతలకు దోమ తెరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన 100 మంది గర్భిణులకు, బాలింతలకు దోమతెరలు అందజేశారు. రాధిక, అబ్దుల్ నజీర్ బాషా, నాగరాజు, ప్రియదర్శిని, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పటమట, ఆగస్టు 8 : రాష్ట్ర డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాల మేరకు నేర రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని డీజీపీని కోరినట్లు భవకుమార్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని బొప్పన భవకుమార్ ఆకాంక్షించారు.

నగర నయబ్ ఖాజీగా మొహ్మద్ ఫరీద్



వన్‌టౌన్, ఆగస్టు 8 : విజయవాడ సిటీ నయబ్ ఖాజీ (ఉప ఖాజీ)గా మొహ్మద్ ఫరీద్‌ను ఖాజీ సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ కిస్తీ గురువారం నియామకం చేశారు. ఈయన ఖాజీకి సహాయకారిగా ఉంటారు. వివాహాలు, ఇతర వేడుకలు, తదితర ముస్లిం ఆచార, వ్యవహారాల విధులను నిర్వర్తిస్తారు. లోకల్ ఏరి యా మహ్మదీయులు వివాహాలు, తదితర విషయాల్లో సంప్రదించవచ్చునని ఖాదిర్ కిస్తీ పేర్కొన్నారు.

నగరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, ఆగస్టు 8 : నగర సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. గురువారం తాడిగడప లోని తన నివాసంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పశ్చిమ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయా డివిజన్లలో సమస్యలను బేరీజు వేసుకుని భవిష్యత్తులో చేపట్టాల్సిన పనుల కోసం ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. డ్రెయిన్లు, రోడ్లు, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డివిజన్లలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దుతా

భవానీపురం: పశ్చిమలోని ప్రభుత్వ కళాశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది ఆంగ్లమాధ్యమం, డిజిటల్ తరగతుల నిర్వహణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సుజనా చౌదరి హామీ ఇచ్చారు. 45వ డివిజన్ కబేళా ప్రాంతంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు గురువారం ఆయన ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం డీఐఈవో సీఎస్ఎస్ఎన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ అహ్మద్, అధ్యాపకులతో ముఖాముఖి చర్చించి కళాశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, రాంబాబు, చక్రవర్తి, వివిధ డివిజన్ల జనసేన అధ్యక్షులు బొమ్ము గోవిందలక్ష్మి, తిరుపతి అనూష, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, పగడాల కృష్ణలు పాల్గొన్నారు.

ఘనంగా బుద్దా వెంకన్న పుట్టినరోజు వేడుకలు

వన్‌టౌన్, ఆగస్టు 8: పశ్చిమ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన బావిశెట్టి భాను కుటుంబ సభ్యులకు పశ్చిమ టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర రూ.5 లక్షల విరాళాన్ని వన్‌టౌన్‌లోని బుద్దా వెంకన్న కార్యాలయంలో అందజేశారు.

● మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న జన్మదిన వేడుకలు టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని వెంకన్న కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంకలపల్లి తేజ, సక్కురి మహేష్, జితేంద్ర కుమార్ జైన్, కలవకొల్లు అనిల్‌కుమార్, సోమేశ్వరరావు, కర్రి కిరణ్‌కుమార్, బావేష్ జైన్, పాయల రాజు, వెంకన్న అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● 42 డివిజన్ కార్యాలయంలో ఆ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్, టీడీపీ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు ముదిగొండ శివ ఆధ్వర్యంలో వెంకన్న పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు కామా దేవరాజ్, మహిళా నాయకురాలు ముప్పా విజయ, పశ్చిమ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు యరపాని హనుమంతరావు, మైనార్టీ నాయకులు రెహమాన్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర తదితరులు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు పేరాబత్తుల రమణ

● 40వ డివిజన్‌లో అధ్యక్షుడు పొనుగుపాటి వెంకట చిన్న సుబ్బయ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. బుద్దా వెంకన్నకు శుభాకాంక్షలు తెలిపారు. కాండ్రేగుల రవీంద్ర ముఖ్య అతిథిగా విచ్చేశారు. డివిజన్ టీడీపీ సెక్రటరీ గాడు గణేష్, మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, 42వ డివిజన్ అధ్యక్షుడు ముదిరాజ్ శివాజీ, నారాయణ, సురేష్, పాల్గొన్నారు.

● 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రావూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి టి.వి. మధుసూదనరావు ఆధ్వర్యంలో వెంకన్న పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కాండ్రేగుల రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. సయ్యద్ కరీముల్లా, సయ్యద్ ఇమ్రాన్, విజయలక్ష్మి, పీసా పాణి, భక్తవత్సలం, జయప్రకాష్, కె. హరిఈశ్వర్ సింగ్, షేక్ బాషా పాల్గొన్నారు.

చిట్టినగర్: టీడీపీ 48వ డివిజన్ అధ్యక్షుడు పేరాబత్తుల రమణ ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ జంక్షన్‌లో బుద్దా వెంకన్న జన్మదిన వేడుకలు జరిగాయి. టీడీపీ నాయకులతో కలసి పేరాబత్తుల రమణ కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్‌లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మద్దినేని చెంచయ్య, ఎస్.కె. నాగుర్, ముచ్చిపల్లి శ్రీను. ఎస్.కె.సుభాని, నెర్సీ పోలయ్య, పిళ్లా సాయి, లొల్ల కరుణాకర్, రాయన రాజా తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ కాలనీలో కమిషనర్ పర్యటన



భారతీనగర్, ఆగస్టు 8 : నగర పర్యటనలో భాగంగా నగర కమిషనర్ ధ్యానచంద్ర గురువారం నాలుగో డివిజన్‌లోని ఏపీఐఐసీ కాలనీలో పర్యటించారు. ఈ పర్యటనలో ఐలా కమిషనర్ మధు, స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో కమిషనర్ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీ వీధుల రోడ్లు జలమయం కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్న దృశ్యాలను గమనించారు. వెంటనే వర్షంనీరు పోయేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ సీఈ, సీఎంహెచ్‌వో, సీపీ, ఇతర సిబ్బంది, స్థానికులు పాతూరి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పశ్చిమలో పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

వన్‌టౌన్: పశ్చిమలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్‌గురువారం నగర కమిషనర్ ధ్యానచంద్రను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందచేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో శివశర్మ, బెవరకొండ చక్రవర్తి, కొమ్మూరి బసవరాజు, తారిక్ హజీజ్, తుడుము అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో రక్తదాన శిబిరం

కృష్ణలంక, ఆగస్టు 8 : ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో విజయవాడ సెంట్రల్ జీఎస్టీ వారు ఉచిత రక్తదాన శిబిరాన్ని కళాశాలలో గురువారం నిర్వహించారని ఎన్ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు జీఎస్టీ ఆఫీస్ సిబ్బంది సుమారు 30 మంది రక్తదానం చేశారు. మృత్యువుతో పోరాడుతున్న తలసేమియా వ్యాధిగ్రస్తులైన చిన్నారుల ఆయురారోగ్యాన్ని పెంచడం కోసం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ జీఎస్టీ బీఎస్‌కే రాయలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ శైలజ, జీఎస్టీ సూపరింటెండెంట్లు ప్రసాదరావు, బీసీ వెంకట కిషోర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గోపీచంద్, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 8 : సెంట్రింగ్ తొలగింపు పనులు చేస్తూ ప్రమాదవశాత్తు ఐదవ అంతస్తు నుంచి కింద పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం దావుబుచ్చయ్య కాలనీలో జరిగింది. వివరాల ప్రకారం చిట్టినగర్ ప్రాంతానికి తమ్మిన ఆనంద్(39) వారం రోజులుగా దావుబుచ్చయ్య కాలనీలో ఓ భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. బుధవారం ఉదయం భవనంలోని ఐదవ ఫ్లోర్‌లో సెంట్రింగ్ తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యాడు. ప్రమాదవశాత్తు భవనం ఐదవ అంతస్థు నుంచి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికుడి సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న మృతుడి కుటుంబ సభ్యులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 8 : ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరిపేట వెళ్లే రోడ్డులో ఈనెల 6న ఓ గుర్తు తెలియని వ్యక్తి వర్షంలో తడుస్తూ రోడ్డుపై పడి ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు అతన్ని 108లో నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

హైదరాబాద్‌లో పారిశ్రామిక టీ హబ్ సందర్శన



టి హబ్ పారిశ్రామిక సందర్శనకు వెళ్లిన పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు

వన్‌టౌన్, ఆగస్టు 8 : హైదరాబాద్‌లో పారిశ్రామిక టీ హబ్‌ను పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీ డేటా సైన్స్ విభాగం విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక నిపుణుడు, టీ హబ్ వైస్ ప్రెసిడెంట్ తరుక శ్రీనివాస్ టీ హబ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సాంకేతికతలను విద్యార్థులకు తెలియజేశారు. గూడి బ్యాగ్ వ్యవస్థాపకుడు అభిషేక్ అగర్వాల్, నిపుణుడు సొహైల్ ఖాన్, ప్రణయ్ తదితరులు టీ హబ్‌లో ఆపరేషన్స్ పార్టనర్ షిప్ మేనేజ్‌మెంట్, తదితరాలను వివరించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర సుధీర్ మాట్లాడుతూ ఇటువంటి పారిశ్రామిక సందర్శనల వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర, ట్రెజరర్ రాఘవయ్య, జాయింట్ సెక్రటరీ పవన్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. పతంజలి శాస్త్రి, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ షేక్ అక్బర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

విస్మయ షైలి ఫ్యాషన్స్ నూతన షోరూం ప్రారంభం

పటమట, ఆగస్టు 8 : విస్మయ షైలి ఫ్యాషన్స్ మహిళల నూతన షోరూంను గురువారం పటమట పంట కాల్వ రోడ్డు ఆర్టీసీ కాలనీలో మూడో రోడ్డులో హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ ఫౌండర్ చైర్మన్ వేములపల్లి లక్ష్మి చౌదరి ప్రారంభించారు. తమ వద్ద యువతకు లేటెస్ట్ మోడల్స్ గ్రాస్ లెహంగాస్, నైట్‌వేర్స్‌తో పాటు మహిళలకు అవసరమైన విస్తృత శ్రేణి చీరలు అందుబాటులో ఉంటాయని ప్రొప్రయిటర్ ఎన్.ఆలేశ్వరి తెలిపారు.



షోరూమ్‌లోకి వస్తున్న ప్రొప్రయిటర్ ఆలేశ్వరి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లబ్బీపేట, ఆగస్టు 8: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కెవి ఎస్‌విఎస్ ఫీడర్ రోడ్డు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. రాఘవనగర్, సీతారామనగర్, చెన్నుపాటి రామకోటయ్య వీధి, ఎయిర్‌టెల్ హెచ్‌టీ సర్వీస్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర అక్రమాలపై ఫిర్యాదు

వన్‌టౌన్, ఆగస్టు 8 : 39వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర అవినీతి అక్రమాలపై ఆ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు గురువారం పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరికి ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్‌గా కొనసాగుతూ అక్రమాలను ప్రోత్సహించాడని, పొదుపు సంఘాల పేరిట అనేక అవినీతి అక్రమాలు చేశారని పేర్కొన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు తదితర అంశాల్లో కూడా అవినీతి చోటు చేసుకుందన్నారు. టీడీపీ వారిపై అక్రమ కేసులు పెట్టించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన నరేంద్ర పై చర్యలు తీసుకోవాలన్నారు.

ద్విచక్ర వాహనం సహా నగదు చోరీ

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 8 : ద్విచక్రవాహనం సహా నగదు చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం భరతమాత మందిరం రోడ్డు ప్రాంతానికి చెందిన వివాహిత అదే ప్రాంతంలో బ్యూటీ పార్లర్ నడుపుతుంది. బుధవారం మధ్యాహ్నం రూ. 1.48 లక్షల నగదు తన ద్విచక్రవాహనంలోని డిక్కీలో ఉంచి పార్లర్‌కు వచ్చింది. ద్విచక్రవాహనం పార్క్ చేసి లోపలికి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో ద్విచక్రవాహనంతో పాటు నగదు కూడా చోరీకి గురైనట్లు వివాహిత అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి పెద్దకర్మకు ఉమ్మడి సాయం



వన్‌టౌన్, ఆగస్టు 8 : 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు ఓ వృద్ధురాలు మరణానంతరం నిర్వహించిన పెద్ద కర్మకు భోజన సదు పాయం కలుగజేశారు. బ్రాహ్మణ వీధి, చదును మహాలక్ష్మీ గుడివద్ద వృద్ధురాలు నాగమణి వారం క్రితం మరణించారు. ఆమె కుటుంబ సభ్యులు కార్పొరేటర్ వద్దకు వచ్చి పెద్ద కర్మ నిర్వహణకు సాయం చేయాలని కోరారు. దీంతో గురువారం నిర్వహించిన పెద్ద ఖర్మకు 100 మందికి కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు భోజన సదుపాయం కల్పించారు. ఆయనే స్వయంగా అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. బొర్రా వెంకటేశ్వరరావు, బెవర శ్రీను, కళ్యాణ్, బండారు బాబూరావు, రాఘవ, శంకర్, నరేంద్ర పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేయడానికి సవరణ బిల్లు

నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీమ్

లబ్బీపేట, ఆగస్టు 8: వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేయడానికి వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్నారని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీమ్ ఆరోపించారు. లబ్బీపేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, దానిని కాపాడుకోవడానికి మరిన్ని అధికారాలు ఇవ్వాల్సింది పోయి వక్ఫ్‌బోర్డు అధికారాలను కుదించే విధంగా బిల్లు ప్రవేశ పెట్టడం వక్ఫ్ ఆస్తులను కాజేయాలనే దురుద్దేశంతోనేనని అన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లింమేతరులకు కూడా చోటు కల్పించాలని బిల్లులో ప్రస్తావించడం ముమ్మాటికి మతపరమైన అంశాల్లో జోక్యం చేసుకోవడమేనన్నారు. ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆ బిల్లును అన్ని పార్టీలు వ్యతిరేకించాలని కోరారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

వన్‌టౌన్, ఆగస్టు 8 : సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు కళాశాలకు వెళ్లిన తన కుమార్తె కనిపించడం లేదని ఓ తల్లి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం బ్యాంక్ సెంటర్‌లో ఓ మహిళ ఇద్దరు కుమార్తెలతో ఉంటోంది. ఆమె రెండో కుమార్తె బుధవారం ఉదయం స్నేహితురాలితో కలిసి సర్టిఫికెట్లు తెచ్చుకుంటానని తల్లికి చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు ఆమె ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంక్ సెంటర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం అనే యువకుడిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 9 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

ఒకప్పుడు అడవులను రక్షించే పాత్రల్లో హీరోలు ఇప్పుడు అటవీ సంపద దోచుకోవడమే హీరోయిజం



- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- అల్లు అర్జున్‌ను ఉద్దేశించేనా?

ఒకప్పుడు అడవులను రక్షించే కథాంశాలతో వచ్చిన సినిమాలలో హీరోలు నటించేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇందుకు ఉదాహరణగా కన్నడ సినిమా 'గంధదగుడి' చిత్రాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ ఈనాడు అటవీ సంపదను దోచుకోవడమే హీరోయిజంగా సినిమాలు వస్తున్నాయని ఆయన విచారం వ్యక్తంచేశారు. రీల్‌కు, రియాలిటీకి తేడా ఉంటుందన్నారు. పుష్ప సినిమాలో అడవుల్లోని ఎర్రచందనం కొల్లగొట్టే పాత్రలో హీరో అల్లు అర్జున్ నటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను ఉద్దేశించే పవన్‌కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మానవత్వం చూపాల్సిన తరుణం ఇది

ఇటీవల కురిసిన భారీ వర్షాలు కేరళలోని వయనాడ్‌లో విషాదాన్ని మిగిల్చాయి. కొండ చరియలు విరిగి పడడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం కేరళ వెళ్లి నేరుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలసి విరాళం చెక్కును అందజేశారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మానవత్వం చూపాల్సిన తరుణం ఇది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతుగా కేరళకు సాయం అందించాలి. ఈ దుర్ఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి' అని కోరారు.





నాగచైతన్య శోభిత నిశ్చితార్థం

టాలీవుడ్ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. కొన్నాళ్లుగా వినిపిస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ కథానాయిక శోభితా దూళిపాళ్లతో ఆయన ఏడడుగులు వేయనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గురువారం ఉదయం హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇరువైపులా కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం ఫొటోలను నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసి, కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరారు. 'ఈ రోజు ఉదయం మా అబ్బాయి నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. ఈ మధుర క్షణాలను మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. చాలా సంతోషంగా శోభితను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. మీ ఇద్దరూ ప్రేమ, సంతోషంతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాను' అని నాగార్జున పేర్కొన్నారు. నిశ్చితార్థ వేడుకలో శోభిత ఉప్పాడ పట్టు చీర ధరించగా, నాగచైతన్య పంచెకట్టు, పైన కండువా ధరించి సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. పలువురు సినీ ప్రముఖులు నాగచైతన్య, శోభితకు అభినందనలు తెలిపారు. మరికొద్ది రోజుల్లో వీరి వివాహం జరగనుంది. సమంతతో విడాకులు తీసుకున్నాక నాగచైతన్య శోభితతో ప్రేమలో పడ్డారనీ, ఇద్దరూ తరచూ కలుసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. పలు సందర్భాల్లో నాగచైతన్య, శోభితా జంటగా కనిపించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. కానీ నిశ్చితార్థం వరకూ వారు ఎక్కడా దీనిపై స్పందించలేదు. నాగచైతన్య, శోభిత కలసి ఒక్క సినిమా కూడా చేయలేదు. స్నేహితుల ద్వారా ఇద్దరికీ పరిచయం అయ్యి అది ప్రేమగా మారిందని సమాచారం. చూసేందుకు ఇంటర్నేషనల్ మోడల్‌లా కనిపించే శోభిత తెలుగమ్మాయే. తెనాలిలో జన్మించారు. కొన్నాళ్లు కుటుంబంతో విశాఖలో ఉన్నారు. ముంబైలో ఉన్నత విద్యను అభ్యసించారు. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 2013 ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ గెలుచుకున్నారు. 2016లో వచ్చిన బాలీవుడ్ చిత్రం 'రామన్ రాఘవన్'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో 'గూఢచారి, మేజర్' చిత్రాల్లో నటించారు.

నాడు ప్రేమ ప్రకటన

'ఏ మాయ చేశావే' చిత్రంలో జంటగా నటించిన నాగచైతన్య, సమంత ఏడేళ్ల డేటింగ్ తర్వాత 2017లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2021లో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 8న నాగచైతన్యకు తన ప్రేమ ప్రతిపాదన చేశానని సమంత ఓ సందర్భంలో చెప్పారనీ, ఇప్పుడు అదే తేదీన నాగచైతన్య శోభితల నిశ్చితార్థం జరగడం కాకతాళీయమేనా, కావాలనే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. శోభిత హిందీలో 'సితార' చిత్రం చేస్తున్నారు.

ముందస్తు బెయిల్



నటుడు రాజ్‌తరుణ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ ఫిర్యాదుపై అతనిపై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాజ్‌తరుణ్ రెండు వారాల్లో నార్సింగ్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలని, రూ.20 వేల బాండు, రెండు పూచీకత్తులు ఇవ్వాలని జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం ఆదేశించింది. 8 వారాల పాటు ప్రతి శనివారం పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. మరోవైపు రాజ్‌తరుణ్ స్నేహితుడు శేఖర్ బాషాతో తనకు ప్రాణహాని ఉందని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెట్స్‌లోకి...



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆఖరి దశ షూటింగ్‌లో ఉన్న ఈ సినిమా సెట్స్‌లోకి బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానిస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "పవన్, అనుపమ్ ఖేర్ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా ఉండనున్నాయి. అభిమానులకి జీవితాంతం గుర్తుండిపోయే సినిమా ఇది" అని మేకర్స్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

షెకావత్ సాబ్



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప 2' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో హీరోతో పాటు కీలక పాత్రలు పోషిస్తున్న ఆర్టిస్టులు పాల్గొనగా పతాక సన్నివేశాలు తీస్తున్నారు. బన్వర్‌సింగ్ షెకావత్‌గా నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ లుక్ పోస్టర్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా గురువారం విడుదల చేశారు. గళ్ల లుంగీ, ఒక చేతిలో గన్, మరో చేతిలో గొడ్డలితో ఫహాద్ కనిపిస్తున్నారు. డిసెంబర్ 6న 'పుష్ప 2' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మిస్తున్నారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది



'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక కొణిదెల నిర్మాతగా మారారు. యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిహారిక మీడియాతో ముచ్చటించారు. "కథ విన్న వెంటనే ఈ సినిమాలో భాగం అవ్వాలనుకున్నాను. ఒక ఊరిలో జాతర నేపథ్యంలో మూడు తరాలకు చెందిన కథగా దర్శకుడు తెరకెక్కించారు. అందరికీ సినిమా విపరీతంగా నచ్చుతుంది. ఇందులో ఎన్నో క్యారెక్టర్లు ఉన్నా.. ప్రతీ పాత్రకూ విలువ ఉంటుంది. ప్రేక్షకులు ఏదో ఒక పాత్రతో కచ్చితంగా ట్రావెల్ అవుతారు. ఒక నిర్మాతగా ఈ సినిమా నాకెంతో సంతృప్తినిచ్చింది" అని చెప్పారు.

రజత నీరాజనం



కోట్లాది మంది భారతీయులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూసిన ఘట్టం ముగిసింది. ఇప్పటిదాకా పారిస్ గేమ్స్‌లో భారత్‌కు దక్కని స్వర్ణ పతకాన్ని ఖాయం చేస్తాడనుకున్న నీరజ్ చోప్రా రజతంతో సరిపెట్టాడు. ఈసారి అతడి బల్లెం వేగం కాస్త నెమ్మదించింది. రెండో ప్రయత్నంలో 89.45మీ. దూరం విసరడంతో రెండో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. అటు అతడి ఆరు ప్రయత్నాల్లో ఐదు ఫౌల్స్ కావడం అభిమానులను నిరాశపర్చింది. అయితే ఎవరూ ఊహించని విధంగా నీరజ్ ప్రధాన ప్రత్యర్థి నదీమ్ అర్షద్ 92.97మీ. దూరంతో ఒలింపిక్ రికార్డు నెలకొల్పడంతో స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

భారత త్రోయర్ చోప్రాకు టైటిల్ మిస్
ఒలింపిక్ రికార్డుతో పాక్ ఆటగాడు నదీమ్‌కు స్వర్ణం

పారిస్: భారత పతకాల పట్టికలో తొలిసారిగా రజతం చేరింది. గురువారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో ఫైనల్లో స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. క్వాలిఫయింగ్‌లో టాప్ షోతో స్వర్ణంపై అంచనాలు పెంచినా.. కీలక పోరులో కాస్త వెనుకబడ్డాడు. మొత్తం ఆరు ప్రయత్నాల్లో కేవలం ఒక్క దాన్ని మాత్రమే సరిగ్గా వినియోగించుకున్నాడు. అయితే రెండో ప్రయత్నంలో 89.45మీ. దూరం విసిరి రజతం అందుకున్నాడు. భారత్ ఖాతాలో ఇది ఐదో పతకం. పాక్ త్రోయర్ నదీమ్ అర్షద్ 92.97మీ.తో స్వర్ణం, ఆండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) 88.54 మీ. దూరంతో కాంస్యం దక్కించుకున్నారు.

అర్షద్ అదుర్స్.. నీరజ్ సెకండ్: క్వాలిఫికేషన్‌లో అందరికన్నా బెస్ట్‌గా నీరజ్ చోప్రా 89.34మీ. దూరం జావెలిన్ విసిరాడు. దీంతో క్రీడాభిమానులంతా నీరజ్‌పై మరింత అంచనాలు పెంచేసుకున్నారు. అయితే చోప్రాకు పాక్ నుంచి అర్షద్ నదీమ్, జాకూబ్ వాలెచ్ (చెక్), వెబెర్ (జర్మనీ), ఆండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) నుంచి గట్టి పోటీ ఎదురవుతుందనే అంచనాలు నెలకొన్నాయి. దీంతో నీరజ్ స్వర్ణంపై అందరికీ ఉత్కంఠ కొనసాగింది. ఫైనల్లో 12 మంది పోటీపడగా చోప్రా తన మూడు ప్రయత్నాల్లో తొలిదాన్ని ఫౌల్‌గా మలిచాడు. అయితే రెండోసారి మాత్రం 89.45మీ.తో తన క్వాలిఫికేషన్ దూరాన్ని సైతం అధిగమించి ఫ్యాన్స్‌ను ఖుషీ చేశాడు. అలాగే అతడికిది సీజన్ బెస్ట్. అయితే నీరజ్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న నదీమ్ అర్షద్ కూడా తొలి ప్రయత్నం ఫౌల్‌గా ముగిసింది. కానీ రెండోసారి బల్లెం చేతపట్టిన తను నమ్మశక్యంకాని రీతిలో ఏకంగా 92.97మీ. దూరం విసిరి ఒలింపిక్ రికార్డుతో అదరగొట్టాడు. ఈ ఫీట్‌తో 2008లో 90.57మీ. దూరంతో ఆండ్రీస్ (డెన్మార్క్) నెలకొల్పిన రికార్డు గల్లంతైంది. దీంతో ఈసారి స్వర్ణ విజేత ఎవరో అందరికీ అర్థమైపోయింది. అర్షద్ మొత్తంగా రెండుసార్లు 90 మీటర్లకుపైగా విసరడం విశేషం.

చివరి 8లోనూ..: తొలి మూడు ప్రయత్నాల తర్వాత పోటీల నుంచి నలుగురు ఎలిమినేట్ కాగా మెడల్ కోసం ఎనిమిది మంది మిగిలారు. ఇక ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య తిరిగి జావెలిన్ తీసుకున్న నీరజ్ ఈసారి కూడా ఆత్మవిశ్వాసంతో కనిపించలేదు. దీంతో చివరి మూడు త్రోలను కూడా ఫౌల్‌గా వేసి నిరుత్సాహపరిచాడు.



ఎందుకిలా ?

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఈసారి ఒలింపిక్స్‌లో మనకు పక్కా పతకం..అది కూడా స్వర్ణం అని భారతీయులంతా నొక్కిచెప్పిన ఒకే ఒక ఈవెంట్ పురుషుల జావెలిన్‌త్రో. కానీ అనూహ్యంగా స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా విఫలమయ్యాడు. క్వాలిఫికేషన్‌లో అదరగొట్టిన నీరజ్..అసలుసిసలు సమరంలో తడబాటుకు లోనయ్యాడు. దాంతో రజత పతకంతోనే అతడు సంతృప్తి చెందాల్సి వచ్చింది. ఈసారి ఒలింపిక్స్‌లో పసిడి పతకం కోసం కోట్లాదిమంది భారతీయులు ఆశగా ఎదురుచూస్తున్న వేళ నీరజ్ ఫైనల్ బరిలో దిగాడు. పెద్ద సంఖ్యలో హాజరైన ఫ్యాన్స్ చప్పట్లతో ఉత్సాహపరుస్తుండగా..బల్లెం చేపట్టిన నీరజ్ తొలి యత్నంలో ఫౌల్ చేయడంతో అంతా నిరుత్సాహపడ్డారు. అయితే గత కొన్ని సీజన్లుగా అంతర్జాతీయ వేదికలపై అమోఘంగా రాణిస్తుండడంతో మిగిలిన ఐదు త్రోలలో నీరజ్ అద్భుతం చేస్తాడని ఆశించారు. ఇక రెండో యత్నంలో 89.45 మీ. దూరం జావెలిన్‌ను విసిరిన నీరజ్ మళ్లీ రేసులోకి వచ్చినట్టే కనిపించాడు. కానీ ఆపై అతడి ఫామ్ మరింత దిగజారింది. సరైన రనప్ అందుకోవడంలో విఫలమైన అతడు మిగిలిన ఐదు ప్రయత్నాలలో ఫౌల్స్ చేశాడు. దాంతో భారతీయులంతా నిరాశలో మునిగారు. అయితే నాలుగు కాంస్యాలకే పరిమితమైన భారత్‌ను రజతంతో పట్టికలో ఒకింత మెరుగైన స్థితిలో నిలిపాడు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో కేవలం ఒక్కటంటే ఒక్కటే త్రోలో ఏకంగా 89.34 మీ. దూరం బల్లెం విసిరిన నీరజ్ ఫైనల్‌కు చేరాడు. ఫైనల్‌కు చేరేందుకు జావెలిన్‌ను విసరాల్సిన కనీస దూరం 84 మీటర్లే కావడం గమనార్హం. ఫైనల్లో తలపడే మేటి 12 మంది జావెలిన్ త్రోయర్లకు అందనంత దూరంలో చోప్రా నిలవడం విశేషం. ఈ నేపథ్యంలో ఫైనల్లోనూ అంతకంటే మెరుగైన ప్రదర్శనతో స్వర్ణ పతకంతో నీరజ్ మరోసారి చరిత్ర లిఖిస్తాడని అంచనా వేశారు. కానీ ఫైనల్ అందుకు పూర్తి విరుద్ధంగా సాగింది. రెజ్లర్ వినేశ్ ఫొగట్ డిస్‌క్వాలిఫికేషన్ వివాదం పారిస్‌లో తలపడుతున్న భారత అథ్లెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. అది సర్దుమణగకముందే అంతిమ్ పంగల్ వివాదం తెరపైకి వచ్చింది. ఈ రెండు ఘటనలు నీరజ్ చోప్రా ప్రదర్శనపై ప్రభావం చూపినట్టు కనిపిస్తోంది.



హాకీ వీరులు మురిపించారు. 44 ఏళ్ల తర్వాత ఫైనల్ పోరుకు అర్హత సాధించే అవకాశం కాస్తలో చేజార్చుకున్నా.. కోట్లాది మంది భారతీయుల మదిని పులకిస్తూ కాంస్య పతకాన్ని నిలబెట్టుకున్నారు. 52 ఏళ్ల తర్వాత జట్టు వరుసగా రెండు పతకాలను సాధించి తమ నిలకడను కూడా చాటుకుంది.

అంతేనా.. వినేశ్ ఫొగట్ వ్యవహారంతో బరువెక్కిన భారత హృదయాలకు ఈ గెలుపుతో కాస్త సాంత్వన చేకూర్చినట్టయ్యింది. భారత హాకీకి గ్రేట్ వాల్‌గా నిలిచిన కీపర్ శ్రీజేశ్ తన చివరి మ్యాచ్‌లోనూ ఆపద్బాంధవ పాత్ర పోషించగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ సూపర్ ఫామ్‌తో అదుర్స్ అనిపించుకున్నాడు.

హాకీకి.. పతక హారతి

హాకీ అంటే ఆట మాత్రమే కాదు.. అదో భావోద్వేగం. అందుకే గతంలో ఏకంగా ఎనిమిదిసార్లు భారత్‌కు ఒలింపిక్ పసిడి పతకాలు అందించిన హాకీ దిగ్గజాలను మనమంతా ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. వాళ్ల జ్ఞాపకాలను మదిలో దాచుకున్నాం. ఆ తర్వాత నాలుగు దశాబ్దాలుగా ఒలింపిక్స్‌లో ఒక్క పతకమూ రాకపోవడంతో ఎంతో ఆవేదనకు గురయ్యాం. ఇంకెన్నాళ్లీ మనోవ్యథ అనుకుంటున్న తరుణంలో.. మూడేళ్ల క్రితం టోక్యోలో మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలోని జట్టు కాంస్య పతకంతో చరిత్ర సృష్టించి చిద్విలాసం చేసింది. హాకీ అభిమానులకు అంతులేని ఆనందాన్ని అందించింది. ఇదిలో మళ్లీ వెంటనే పారిస్‌లోనూ ఆ తరహా ప్రదర్శనను పునరావృతం చేసి ఆ సంతోషాన్ని రెట్టింపు చేసింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో జట్టు అద్భుతంగా ఆడి వరుసగా రెండోసారి ఒలింపిక్ పతకంతో పూర్వవైభవానికి గట్టి పునాదులు వేసింది. ఒకప్పుడు గొప్పగా వెలిగి ఆపై మసకబారిన టీమిండియాకు ఇకనుంచి అన్నీ మంచి శకునములే!

ఒలింపిక్స్‌లో వరుసగా రెండోసారి పతకంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల హాకీ జట్టు ఈసారి సమష్టిగా పోరాడి ఫలితాన్ని రాబట్టింది. అనుభవజ్ఞులు, యువకులతో సమతూకమైన జట్టుగా బరిలోకి దిగిన భారత్ టోర్నమెంట్ ఆద్యంతం పోరాటతత్వాన్ని ప్రదర్శిస్తూ ముందుకెళ్లింది. కఠినమైన ప్రత్యర్థులు ఎదురైనా ఏమాత్రం వెరవని హర్మన్‌సేన.. ప్రతి మ్యాచ్‌లోనూ చావోరేవో అన్నట్టుగా పోరాడింది. ఆరంభ పోరులో న్యూజిలాండ్‌ను ఓడించి పారిస్ క్రీడలను ఘనంగా ప్రారంభించిన టీమిండియా.. రెండోమ్యాచ్‌ను అర్జెంటీనాతో డ్రాగా ముగించింది. ఆ తర్వాత ఐర్లాండ్‌పై గెలిచి, డిఫెండింగ్ చాంపియన్ బెల్జియంతో ఓడినా.. ప్రీ క్వార్టర్స్‌లో టోక్యో ఒలింపిక్స్ రన్నరప్ ఆస్ట్రేలియాను చిత్తుచేసిన తీరు అమోఘం. విశ్వక్రీడల్లో 52 ఏళ్ల తర్వాత కంగారూలపై తొలి విజయాన్ని నమోదుచేసిన భారత్.. అదే జోరులో క్వార్టర్స్‌లో గ్రేట్ బ్రిటన్‌పై మరపురాని ప్రదర్శనతో అభిమానులను అలరించింది. స్కోర్లు సమమైనా, పెనాల్టీ షూటౌట్‌లో ఫలితాన్ని రాబట్టిన తీరును మరచిపోగలమా! సెమీఫైనల్లో జర్మనీ చేతిలో పరాజయం ఎదురైనా, కాంస్య పోరులో స్పెయిన్‌పై విజృంభించి పతకం దక్కించుకుంది. ప్రధానంగా సారథి హర్మన్‌ప్రీత్, గోల్‌కీపర్ శ్రీజేష్ జట్టును ముందుండి నడిపించిన తీరు సర్వదా ప్రశంసనీయం. సహచరుల్లో స్ఫూర్తి నింపుతూ, పోరాటమే ఆయుధంగా ముందుకు సాగుతూ, జట్టు ను విజయాల బాట నడిపించాడు హర్మన్‌ప్రీత్. టోక్యోలో పతకం సాధించడంలోనూ కీలకపాత్ర పోషించిన 28 ఏళ్ల హర్మన్.. పారిస్‌లో అంతకుమించిన ఆటతీరుతో చెలరేగాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ డ్రాగ్‌ఫ్లికర్లలో ఒకడిగా పేరుగాంచిన హర్మన్.. జట్టు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ గోల్ చేశాడు. ఓవరాల్‌గా టోర్నీలో పది గోల్స్‌తో విజృంభించి జట్టు పతకం దక్కించుకోవడంలో కీలక భాగస్వామయ్యాడు. ఇక, గోల్‌కీపర్ శ్రీజేష్ గతేడాది ప్రపంచకప్ క్వార్టర్స్‌లో న్యూజిలాండ్ చేతిలో పెనాల్టీ షూటౌట్‌లో ఓడిన టీమిండియా.. ఆ తర్వాత కొత్త కోచ్ క్రెగ్ ఫుల్టన్ శిక్షణలో క్రమంగా మెరుగుపడింది. ఆసియా క్రీడల ఫైనల్లో జపాన్‌పై ఆరంభంలో ప్రశాంతంగా ఆడి ఆపై దూకుడు పెంచి పైచేయి సాధించింది. ఇటీవలికాలంలో ఆటలో డిఫెన్స్ వరంగానూ మెరుగుపడింది. పారిస్‌లో ఒత్తిడిని దాటుకొని వరుసగా రెండో పతకాన్ని ముద్దాడింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒలింపిక్స్ హాకీలో భారత్

1928	స్వర్ణం
1932	స్వర్ణం
1936	స్వర్ణం
1948	స్వర్ణం
1952	స్వర్ణం
1956	స్వర్ణం
1960	రజతం
1964	స్వర్ణం
1968	కాంస్యం
1972	కాంస్యం
1980	స్వర్ణం
2020	కాంస్యం
2024	కాంస్యం



హాకీ వీరుల గర్జన

స్పెయిన్‌పై 2-1తో విజయం

అదరగొట్టిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ • ఫేర్‌వెల్ మ్యాచ్‌లోనూ కీపర్ శ్రీజేశ్ సూపర్ షో

పారిస్: భారత హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకంతో మెరిసింది. గురువారం స్పెయిన్‌తో ఆఖరి సెకను వరకు ఉత్కంఠభరితంగా సాగిన కాంస్య పతక పోరులో భారత్ 2-1 తేడాతో గెలిచింది. తాజా ఒలింపిక్స్‌లో దేశానికిది నాలుగో పతకం. అయితే ప్రత్యర్థికే తొలి ఆధిక్యం దక్కినా.. బెదిరిపోకుండా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 30, 33వ నిమిషాల్లో చేసిన రెండు గోల్స్ జట్టుకు విజయాన్నందించాయి. స్పెయిన్‌కు 18వ నిమిషంలోనే మార్క్ మిరల్లెస్ గోల్ అందించాడు. స్పెయిన్‌కు ఏకంగా 9 పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా భారత్ అడ్డుకోగలిగింది. అటు మన జట్టు మాత్రం ఆరింట్లో రెండింటిని సఫలం చేసుకుంది. గతంలో భారత హాకీ జట్టు 1968, 1972 ఒలింపిక్స్‌లోనూ కాంస్యాలు సాధించింది.

వెనుకబడినా.. పుంజుకుని

తొలి క్వార్టర్‌లో భారత్-స్పెయిన్‌ల నుంచి గోల్స్ నమోదు కాలేదు. కానీ రెండో క్వార్టర్ ఆరంభంలో 18వ నిమిషంలో స్పెయిన్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీన్ని మిరల్లెస్ టాప్ లెఫ్ట్ కార్నర్‌లో గోల్ పోస్టులోకి పంపడంతో భారత్ షాక్‌లో మునిగింది. ఆ తర్వాత 25వ నిమిషంలో స్పెయిన్‌కు వెనువెంటనే రెండు పెనాల్టీ కార్నర్‌లు లభించినా భారత డిఫెన్స్ వమ్ము చేసింది. 29వ నిమిషంలో భారత్‌కు తొలి పీసీ లభించినా వినియోగించుకోలేకపోయింది. అయితే రెండో క్వార్టర్ ఆఖరి సెకన్లలో లభించిన రెండో పీసీని హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచడంతో ప్రథమార్ధం 1-1తో ముగిసింది. ఇక మూడో క్వార్టర్ ఆరంభమైన కాసేపటికే వీడియో రిఫరల్ ద్వారా లభించిన పీసీని హర్మన్ మరో గోల్‌గా మలిచాడు. దీంతో 2-1తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. తదనంతరం ఇరు జట్లు గోల్స్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. అలాగే 40వ నిమిషంలో స్పెయిన్‌కు గోల్ ప్రకటించినా.. భారత్ రిఫరల్‌కు వెళ్లింది. దీంట్లో బంతి నెట్‌లోకి వెళ్లకముందే స్పెయిన్ ప్లేయర్ బాడీని తాకినట్టు తేలింది. అటు గోల్ కోసం స్పెయిన్ మరింత కసిగా ఎదురుదాడికి దిగడంతో ఆఖర్లో హైడ్రామా నెలకొంది. 59, 60వ నిమిషాల్లోనే కాకుండా మ్యాచ్ మరో 44 సెకన్లలో ముగుస్తుందనగా స్పెయిన్‌కు పీసీ లభించడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. అయితే కీపర్ శ్రీజేశ్‌తో సూపర్‌మ్యాన్ తరహాలో వీటన్నింటిని నుంచి జట్టును కాపాడడంతో భారత్ కాంస్య సంబరాల్లో మునిగింది.



ఏ జట్టునైనా జయించగలం

'వరుసగా రెండు కాంస్య పతకాలు సాధించడం గొప్ప విషయం. ప్రపంచ హాకీలో భారత్ పురోగతికి ఈ విజయం నిదర్శనం. ఏ జట్టునైనా ఓడించగలమని నిరూపించాం. ఇది జట్టుకు దేశానికి ఎంతో గొప్ప విషయం'
- కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్

మీ పట్టుదల అమోఘం. ఈ విజయం తరతరాలు గుర్తుండిపోతుంది. ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకం సాధించిన సందర్భం ఎంతో ప్రత్యేకం. హాకీ జట్టుకు శుభాకాంక్షలు.
-ప్రధాని మోదీ

స్పెయిన్‌పై విజయం మన హాకీ జట్టు నిబద్ధతకు తార్కాణం. అత్యుత్తమ ప్రదర్శనతో దేశానికి గర్వ కారణంగా నిలిచారు.
-క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య

సెమీఫైనల్ ఓటమిని జీర్ణించుకోవడం ఆషామాషీ కాదు. అయినా చాంపియన్లవలే పుంజుకొని కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఈ విజయానికి మీరు పూర్తిగా అర్హులు.
-సచిన్ టెండూల్కర్

హాకీ ఇండియా నజరానా

కాంస్య పతకం సాధించిన హర్మన్‌ప్రీత్ సేనకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ఒక్కో సభ్యుడికి రూ. 15 లక్షలు, సహాయ సిబ్బందిలో ఒక్కొక్కరికీ రూ. 7.5 లక్షల రూపాయల ప్రైజ్‌మనీని అందజేయనున్నట్టు తెలిపింది. కాగా ఒలింపిక్ క్రీడల చరిత్రలో భారత్‌కిది 13వ పతకం.

ది గ్రేట్ వాల్

భారత హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్ పతకం సాధించడంలో గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌ది ప్రత్యేకమైన పాత్ర. పరాజయానికి, పతకానికి మధ్య అడ్డుగోడలా నిలబడి భారత హాకీ జట్టుకు ఎన్నోసార్లు ఆనందాన్ని పంచిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ ఆఖరి మ్యాచ్‌లోనూ తనదైన మార్క్ చూపించాడు. టోక్యో క్రీడల తరహాలోనే పారిస్‌లోనూ తనదైన ముద్ర వేచి ఆఖరి మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు.

కేరళలోని ఎర్నాకులం జిల్లా కిజక్కంబలం గ్రామానికి చెందిన 36 ఏళ్ల శ్రీజేష్.. మొదట రన్నింగ్, లాంగ్ జంప్, వాలీబాల్ క్రీడలు ఆడాడు. పన్నెండేళ్ల వయసులో తన పాఠశాల పీఈటీ సూచనతో హాకీని ఎంచుకున్నాడు. పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన శ్రీజేష్‌కు మొదట్లో గోల్‌కీపింగ్ కిట్‌ను కొనేందుకు కూడా డబ్బులు లేవు. తన తండ్రి ఆవును అమ్మి సమకూర్చిన డబ్బులతో కిట్‌ను కొనుకున్నాడు. 2006లో తొలిసారి సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్న శ్రీజేష్.. 2011 నుంచి జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగాడు. శ్రీజేష్ వచ్చేనాటికి గోల్‌కీపర్లుగా అడ్రియన్ డిసౌజా, భరత్ ఛెత్రి జట్టులో పాతుకుపోయి ఉన్నారు. దీంతో అప్పుడప్పుడు మాత్రమే జట్టులో చోటు దక్కించుకున్న శ్రీజేష్.. 2011లో చైనా వేదికగా జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ రూపంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగిన ఆ తుదిపోరులో రెండు పెనాల్టీ స్ట్రోక్‌లను నిలువరించి జట్టును గెలిపించడంతో అందరి దృష్టి శ్రీజేష్‌పై పడింది. అతని గోల్‌కీపింగ్ నైపుణ్యాన్ని చూసి దిగ్గజ ఆటగాళ్లు సైతం అబ్బురపడ్డారు. అప్పటినుంచి వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాని శ్రీజేష్.. తర్వాత ప్రతి మ్యాచ్‌లోనూ భారత జట్టుకు ప్రాధాన్య గోల్‌కీపర్‌గా మారాడు. తనదైన ప్రతిభతో ప్రపంచ హాకీ అత్యుత్తమ గోల్‌కీపర్లలో ఒకడిగా తన పేరు సార్థకం చేసుకున్నాడు. శ్రీజేష్.. తన 18 ఏళ్ల కెరీర్‌లో 336 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి నాలుగు ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. రెండు ఒలింపిక్ కాంస్యాలు, చాంపియన్స్ ట్రోఫీలో రెండు రజతాలు.. ఆసియా కప్‌లో రజతం.. ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు ఓ కాంస్యం, కామన్వెల్త్ క్రీడల్లో రెండు రజతాలు గెలుచుకున్న జట్టులో సభ్యుడైన శ్రీజేష్.. భారత హాకీ చరిత్రలో 'ది గ్రేట్ వాల్'గా చిరస్థాయిగా నిలిచిపోతాడు. 2017లో పద్మశ్రీ అందుకున్న శ్రీజేష్.. 2021లో ఖేల్‌రత్న పురస్కారాన్ని దక్కించుకున్నాడు. 2022లో వరల్డ్ గేమ్స్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



పర్‌ఫెక్ట్ ఫేర్‌వెల్

విజయానంతరం భారత ఆటగాళ్లు శ్రీజేష్‌కు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. తమ భుజాలపై ఎత్తుకొని గోల్‌పోస్ట్‌పై కూర్చోబెట్టారు. హాకీ స్టిక్‌తో జేజేలు పలికి ఘనమైన వీడ్కోలు పలికారు.

హాకీ విజేత నెదర్లాండ్స్



పురుషుల హాకీ ఒలింపిక్ చాంపియన్‌గా నెదర్లాండ్స్ అవతరించింది. గురువారం రాత్రి జరిగిన ఫైనల్లో నెదర్లాండ్స్ షూటౌట్‌లో 3-1తో పటిష్ఠ జర్మనీపై విజయం సాధించి స్వర్ణ పతకం అందుకుంది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. దీంతో అనివార్యమైన షూటౌట్‌లో నెదర్లాండ్స్ జట్టు పురుషుల ఒలింపిక్ టైటిల్‌ను గెలవడం 2000 తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం.

లైల్స్‌కు షాక్

200 మీ. చాంపియన్ టెబోగో



పారిస్: 200 మీటర్ల రేసులో అతడు తిరుగులేని రన్నర్. టోక్యో ఒలింపిక్స్ ఫైనల్ తర్వాత జరిగిన రేసుల్లో అతడికి ఓటమన్నదే లేదు. పైగా..పారిస్ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల స్ప్రింట్‌లో పసిడి పతకం గెలుపొందాడు. ఆపై 200 మీటర్ల రేసుతో అరుదైన 'డబుల్'పై కన్నేశాడు. కానీ హాట్‌ఫేవరెట్‌గా 200 మీటర్ల బరిలో దిగిన అమెరికా స్టార్ నోవా లైల్స్‌కు ఊహించని షాక్ తగిలింది. గురువారం అర్ధరాత్రి జరిగిన పురుషుల 200 మీటర్ల స్ప్రింట్ ఫైనల్లో బోట్స్‌వానాకు చెందిన లెసిల్ టెబోగో..ప్రపంచ చాంపియన్ లైల్స్ టైటిల్ ఆశలకు గండికొట్టి సంచలనం సృష్టించాడు. 19.46 సెకన్ల సీజన్ అత్యుత్తమ సమయంతో గమ్యం చేరిన టెబోగో స్వర్ణ పతకం ఎగరేసుకుపోయాడు. 19.62 సెకన్ల టైమింగ్‌తో అమెరికాకు చెందిన బెడ్నెరెక్ రజతం దక్కించుకోగా.. 19.72 సెకన్లతో లైల్స్ కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. గత టోక్యో విశ్వక్రీడల్లోనూ లైల్స్ కాంస్య పతకానికే పరిమితమైన సంగతి తెలిసిందే.



పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)



పారిస్‌లో నేటి భారతం



గోల్ఫ్: మహిళల వ్యక్తిగత విభాగం (అదితీ అశోక్, దీక్షా డాగర్) - మ.12.30 గం.
అథ్లెటిక్స్: మహిళల 4x400 మీ. రిలే రౌండ్-1 (భారత జట్టు)- మ.2.10 గం.; పురుషుల 4x400మీ. రిలే రౌండ్ 1 (భారత జట్టు) - మ.2.35 గం.
రెజ్లింగ్: పురుషుల 57కి. ఫ్రీస్టయిల్ కాంస్య పతకపోరు (అమన్ సెహ్రావత్X డారియన్) - రాత్రి 9.45 గం.

ఇతర పతకాంశాలు


టేబుల్ టెన్నిస్: పురుషుల టీమ్ కాంస్య పోరు (ఫ్రాన్స్ X జపాన్) -మ.1.30 గం.; స్వర్ణ పతక మ్యాచ్ (చైనాXస్వీడన్)-సా.6.30 గం.
హాకీ: మహిళల కాంస్య పోరు (అర్జెంటీనాXబెల్జియం) - సా.5.30 గం.; స్వర్ణ పోరు: (నెదర్లాండ్స్ X చైనా) - రా.11.30 గం.
ఫుట్‌బాల్: పురుషుల స్వర్ణ పోరు (ఫ్రాన్స్Xస్పెయిన్) - రా.9.30 గం.
అథ్లెటిక్స్: మహిళల, పురుషుల 4x100 రిలే ఫైనల్స్-రాత్రి 11 గం; 11.17 గం.లకు; మహిళల షాట్‌పుట్ ఫైనల్ - రా. 11.07 గం.; మహిళల 400 మీ. ఫైనల్ - 11.30 గం.; పురుషుల ట్రిపుల్ జంప్ ఫైనల్-రాత్రి 11.43 గం.

సెమీస్‌లో ఓడిన అమన్

నేడు కాంస్యపోరుకు సై

పురుషుల 57 కిలోల కేటగిరీలో అమన్ సెహ్రావత్ ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. సెమీస్‌లో అమన్ 0-10తో రిహిగూచి (జపాన్) చేతిలో చిత్తయ్యాడు. దీంతో శుక్రవారం జరిగే కాంస్య పోరులో డారియన్ క్రూజ్ (ప్యూర్టోరికో)తో తలపడనున్నాడు. క్వార్టర్స్‌లో మాజీ వరల్డ్ చాంపియన్ జెలింఖాన్ అబ్‌అకరోవ్ (అల్బేనియా)పై 12-0తో గెలిచాడు. మహిళల 57 కిలోల బౌట్ ప్రీక్వార్టర్స్‌లో అన్షు మాలిక్ 2-7తో హెలెన్ లూయిస్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది.





అమ్మా.. నన్ను క్షమించు

నాకిక పోరాడే శక్తిలేదు

కెరీర్‌కు రెజ్లర్ వినేశ్ ఫొగట్ వీడ్కోలు



పారిస్: విధి ఆడిన క్రూరమైన ఆటలో.. ఘోరంగా ఓడిన రెజ్లర్ వినేశ్ ఫొగట్ (29).. ఏకంగా తన కెరీర్‌కే వీడ్కోలు పలికింది. ఒలింపిక్ పతకం సాధించాలనే జీవితకాలపు కల కల్లలవడంతో.. అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నట్టు గురువారం సోషల్ మీడియాలో ప్రకటించింది. 50 కిలోల విభాగంలో ఫైనల్ చేరి పతకం ఖాయం చేసుకొన్న వినేశ్‌కు బుధవారం జరగాల్సిన బౌట్ ముందు భారీ షాక్ తగిలింది. నిర్దేశించిన బరువుకన్నా 100 గ్రాములు ఎక్కువగా ఉందనే కారణంతో ఆమెపై అనర్హత వేటు పడింది. వంద గ్రాముల కింద.. తన రెండు దశాబ్దాల స్వప్నం శిథిలం కావడంతో తీవ్ర నిర్వేదానికి గురైన ఫొగట్.. కెరీర్‌ను వీడాలనే కఠిన నిర్ణయం తీసుకొంది. ఈ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచిన అందరినీ క్షమాపణలు కోరింది. తన తల్లి ప్రేమలతను తలచుకొని ఎంతో భావోద్వేగానికి గురైంది. 'అమ్మా.. రెజ్లింగ్ గెలిచింది.. నేను ఓడిపోయా. దయచేసి నన్ను క్షమించు. నీ కల.. నా ధైర్యం, అన్నీ సర్వనాశనమయ్యాయి. ఇక నాకు పోరాడే శక్తి లేదు. గుడ్‌బై రెజ్లింగ్ 2001-2024. మీ అందరికీ ఎంతో రుణపడి ఉంటా' అని పోస్టు చేసింది. బరువు తగ్గించుకోవడం కోసం కనీసం నీటిని కూడా తీసుకోకుండా తీవ్రంగా కసరత్తులు చేయడంతో నీరసపడిన వినేశ్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉంది.



వినేశ్‌ను కలిసిన అభినవ్ బింద్రా

ఎప్పటికీ విజేతవే..

ఫొగట్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. 'నువ్వెప్పుడూ విజేతవే. నువ్వు ఓడలేదు.. కానీ ఓడిపోయావు' అని టోక్యో పతక రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా ఎక్స్‌లో పోస్టు చేశాడు. అయితే, ఆమె శ్రేయోభిలాషులు, బంధువులు మాత్రం రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 2028 లాస్ ఏంజెల్స్ క్రీడలపై దృష్టిపెట్టాలని ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్ ఫొగట్ కోరాడు. ఆవేశంగా నిర్ణయాలు తీసుకోవద్దని హితవు పలికాడు. మాజీ షూటర్ రాజ్యవర్ధన్ రాథోడ్ కూడా సవాళ్లను ఎదుర్కొని ధైర్యంగా నిలబడమని సూచించాడు. సినీనటులు ధర్మేంద్ర, ఆలియా భట్, కరీనా కపూర్ కూడా ఫొగట్‌కు మద్దతుగా ఎక్స్‌లో పోస్టులు చేశారు.

భారమైన జ్ఞాపకాలు


విశ్వక్రీడలు అనగానే ఏ అథ్లెట్ జీవితంలోనైనా గొప్ప మైలురాళ్లు కనిపిస్తాయి. కానీ, వినేశ్ కెరీర్‌లో మాత్రం అత్యంత బాధాకరమైన జ్ఞాపకాలు. 2016లో తొలిసారి రియో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగగా.. క్వార్టర్స్‌లో కాలి లిగమెంట్ గాయంతో విలవిల్లాడుతూ స్ట్రెచర్‌పై నిష్క్రమించింది. అప్పుడు ఆమె వయసు 21 ఏళ్లే కావడంతో కోలుకొని మళ్లీ మ్యాట్‌పైకి అడుగుపెట్టింది. టోక్యో క్రీడలను కొవిడ్ వెంటాడడంతో సరైన సన్నాహకాలు లేకుండా బరిలోకి దిగి.. క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. అయితే, పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొడానికి ఓ యుద్ధమే చేసింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఏడాదిపైగా ధర్నాలు, నిరసనలు చేసిన ఫొగట్.. విశ్వక్రీడల బెర్త్ కోసం తన వెయిట్ కేటగిరీని కూడా తగ్గించుకొంది. అలుపెరుగని పోరాటం చేసినా.. చివరకు గుండె కోతే మిగిలింది.

స్టేడియంలోనే పెళ్లి ప్రతిపాదన



పారిస్: ఫ్రెంచ్ రన్నర్ అలిస్ ఫింటో స్టేడియంలోనే తన బాయ్ ఫ్రెండ్‌కు రొమాంటిక్‌గా ప్రపోజ్ చేసి ఆశ్చర్యపర్చింది. తన స్టీపుల్ చేజ్ రేస్ ముగిసిన తర్వాత 'లవ్ ఇన్ పారిస్' పిన్‌ను అతడి టీషర్ట్‌కు గుచ్చింది. 'నా లక్కీ నెంబర్ 9. ఇద్దరం తొమ్మిదేళ్లుగా సహజీవనం చేస్తున్నాం. రేస్‌ను 9 నిమిషాలలోపు పూర్తి చేస్తే పెళ్లి ప్రపోజల్ చేయాలని ముందుగానే నిర్ణయించుకొన్నా'నని 33 ఏళ్ల ఫింటో చెప్పింది. అలిస్ రేస్‌ను 8 నిమిషాల 58.67 సెకన్ల టైమింగ్‌తో ముగించింది. ఆ వెంటనే స్టాండ్స్‌లో ఉన్న తన ప్రేమికుడు, స్పెయిన్ ట్రై అథ్లెట్ బ్రూనో మార్టినెజ్ దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్లి.. మోకాళ్లపై కూర్చొని పెళ్లాడమని కోరింది. మార్టినెజ్ సిగ్గుపడుతూనే అందుకు అంగీకరించాడు.

రెజ్లర్ అంతిమ్‌పై నిషేధం తప్పదా?




పారిస్: భారత యువ రెజ్లర్ అంతిమ్ ఒలింపిక్స్ క్రీడా గ్రామంలోకి తన సోదరిని పంపి వివాదంలో ఇరుక్కుంది. దీంతో క్రమశిక్షణా చర్యల కింద ఆమెపై మూడేళ్ల నిషేధం విధించే యోచనలో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఉన్నట్టు సమాచారం. అసలేం జరిగిందంటే.. మహిళల 53 కిలోల తొలి రౌండ్‌లో ఓడాక అంతిమ్ తన సోదరి ఉంటున్న హోటల్‌కు వెళ్లింది. ఆ తర్వాత క్రీడా గ్రామంలో ఉన్న తన వస్తువులను తేవాల్సిందిగా అక్రెడిటేషన్ కార్డును ఇచ్చి సోదరిని పంపింది. కానీ అక్కడి సెక్యూరిటీ స్టాఫ్ గుర్తించి అంతిమ్ సోదరిని విచారణ కోసం పోలీసులకు అప్పగించారు. అనంతరం అంతిమ్ అక్రెడిటేషన్‌ను రద్దు చేశారు. 'అందరినీ ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టిన అంతిమ్‌పై ఐఓఏ అధికారులు ఇప్పటికే చర్చించారు. ఇందులో భాగస్వామ్యమైన కోచ్‌లతో పాటు అంతిమ్‌పై మూడేళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది. తను భారత్‌కు వచ్చాక నిర్ణయం తీసుకుంటాం' అని ఐఓఏ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఈ వివాదంలో తన తప్పేమీలేదని అంతిమ్ విడుదల చేసిన ఓ వీడియోలో పేర్కొంది. తన సోదరి క్రీడా గ్రామంలోకి ప్రవేశించలేదని, ఆ అక్రిడిటేషన్ కార్డు తనదికాదని చెప్పి, లోపలికి వెళ్లేందుకు అక్కడి సెక్యూరిటీ వారిని అనుమతి మాత్రమే కోరిందని తెలిపింది. వారు వినకుండా ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లారని చెప్పింది.

నిరాశపర్చిన జ్యోతి



పారిస్: తెలుగు అథ్లెట్ జ్యోతి యర్రాజి 100 మీటర్ల హర్డిల్స్ సెమీస్‌కు చేరుకోలేకపోయింది. గురువారం జరిగిన రెపిచేజ్ రౌండ్‌లో హీట్-1లో జ్యోతి 13.17 సెకన్ల టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. టాప్-2లో నిలిచిన వారికే సెమీస్ అవకాశాలు. జ్యోతి జాతీయ రికార్డు 12.78 సెకన్లు కాగా.. రెపిచేజ్‌లో దాని కంటే ఘోరమైన టైమింగ్‌ను నమోదు చేసింది.



కుటుంబ వ్యాపారాల్లో అంబానీ టాప్

రూ.25.75 లక్షల కోట్లతో అగ్రస్థానం

జాబితాలో 9 తెలుగు వ్యాపార కుటుంబాలు

హురున్ ఇండియా బార్‌క్లేస్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ కుటుంబ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. ఈ ఏడాది మార్చి 20 నాటికి రిలయన్స్ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల ఈక్విటీల్లో అంబానీ కుటుంబ వ్యాపారాల విలువ రూ.25.75 లక్షల కోట్లకు చేరింది. దేశంలో మరే కుటుంబం వ్యాపారాల విలువ ఈ స్థాయిలో లేదని గురువారం విడుదలైన 'బార్‌క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూవబుల్ ఫ్యామిలీ బిజినెస్ నివేదిక' తెలిపింది. అంబానీ కుటుంబం వ్యాపారాల విలువ ప్రస్తుతం భారత జీడీపీలో పదో వంతు ఉంటుందని అంచనా వేసింది. అంబానీల తర్వాత రూ.7.13 లక్షల కోట్లతో బజాజ్ కుటుంబం, రూ.5.39 కోట్లతో బిర్లా కుటుంబం 2,3స్థానాల్లో నిలిచాయి.

అదానీ కుటుంబం

అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ కుటుంబ వ్యాపారాల విలువ రూ.15.44 లక్షల కోట్ల వరకు ఉన్నా తొలి తరం పారిశ్రామికవేత్త కావడంతో హురున్ ఇండియా జాబితాలో చోటు దక్కలేదు. అయితే తొలి తరానికి చెందిన అత్యంత సంపన్న పారిశ్రామిక కుటుంబాల జాబితాలో మాత్రం అదానీలకు చోటు దక్కింది. అదానీల తర్వాత రూ.2.37 లక్షల కోట్లతో సీరమ్ ఇనిస్టిట్యూట్ అధినేత అధర్ పూనావాలా కుటుంబం తొలి తరం సంపన్న పారిశ్రామిక కుటుంబాల జాబితాలో చోటు సంపాదించింది. ఈ ఏడాది మార్చి 20 నాటికి వీరి ప్రైవేట్ పెట్టుబడులు, చరాస్తులను మినహాయించి, కుటుంబ వ్యాపారాల విలువ కనీసం రూ.2,700 కోట్లు ఉన్న కుటుంబాలను మాత్రమే ఈ ఏడాది హురున్ ఇండియా సంపన్న కుటుంబాల జాబితాలోకి తీసుకున్నారు.

ముగ్గురి కుటుంబాల ఆస్తి విలువ సింగపూర్ జీడీపీకి సమానం

ఈ జాబితాలో తొలి మూడు స్థానాల్లో ఉన్న ముకేశ్ అంబానీ, బజాజ్ కుటుంబం, కుమార్ మంగళం బిర్లా ఉమ్మడి ఆస్తి విలువ46,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.38.27 లక్షల కోట్లు)గా ఉందని, ఇది దాదాపు సింగపూర్ జీడీపీకి సమానమని హురున్ ఇండియా నివేదిక వెల్లడించింది.

బార్‌క్లేస్ హురున్ ఇండియా తాజా జాబితాలో తొమ్మిది తెలుగు పారిశ్రామికవేత్తల కుటుంబాలకూ చోటు దక్కింది. ఇందులో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చెందిన జీవీ ప్రసాద్ కుటుంబం రూ.1,01,800 కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇక


తెలుగు వ్యాపార కుటుంబాల జోరు

తెలుగు రాష్ట్రాలకు చెందిన అవంతి ఫీడ్స్, నవ లిమిటెడ్ కంపెనీల షేర్లు జెట్ స్పీడ్‌లో దూసుకుపోవడంతో ఆయా కంపెనీల ప్రమోటర్ల కుటుంబాల వ్యాపారాల విలువ ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. ఇందులో 1998లో రూ.2 వద్ద కోట్ అయిన నవ లిమిటెడ్ కంపెనీ షేరు ధర.. ఈ ఏడాది మార్చి 20 నాటికి 285 శాతం లాభంతో రూ.470 వద్ద, 2010లో రూ.2 వద్ద ట్రేడైన అవంతి ఫీడ్స్ కంపెనీ షేర్లు ఈ ఏడాది మార్చి 20కి 302 శాతం లాభంతో రూ.492 వద్ద ట్రేడయ్యాయి.

పారిశ్రామికవేత్త కుటుంబం	కంపెనీ పేరు	ఆస్తుల విలువ (రూ.కోట్లలో)
జీవీ ప్రసాద్	డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్	1,01,800
దివి మురళి	దివీస్ ల్యాబ్స్	91,200
ప్రతాప్ సీ రెడ్డి	అపోలో హాస్పిటల్స్	88,800
పీపీ రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	75.100
జీఎం రావు	జీఎంఆర్ గ్రూప్	47,800
బీ పార్థసారథి రెడ్డి	హెటిరో ల్యాబ్స్	22,300
బీవీఆర్ మోహన్ రెడ్డి	సైయెంట్	22,200
జే రామేశ్వర రావు	మై హోమ్ ఇండస్ట్రీస్	20,400
మహిమ దాట్ల	బయోలాజికల్స్ ఈ	15,900

బిజినెస్

వడ్డీ రేట్లు యథాతథం



- వరుసగా తొమ్మిదో సారీ అవే రేట్లు
- జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాల్లోనూ మార్పు లేదు..
- ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ

ముంబై: మార్కెట్ వర్గాల అంచనాలకు అనుగుణంగానే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వరుసగా తొమ్మిదోసారీ కీలక వడ్డీ (రెపో) రేట్లను యథాతథంగా కొనసాగించింది. దాంతో రెపో రేటు 6.50 శాతంగా కొనసాగనుంది. అయితే, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షత వహించే ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లో నలుగురు మాత్రమే రేట్ల యథాతథ స్థితికి అనుకూలంగా ఓటు వేశారు. మిగతా ఇద్దరు సభ్యులు రేట్ల తగ్గింపునకు మొగ్గు చూపడం గమనార్హం. కాగా, ద్రవ్యోల్బణాన్ని లక్ష్యానికి అనుగుణంగా 4 శాతానికి కట్టడి చేసేందుకు వడ్డీ రేట్లపై సర్దుబాటు ధోరణిని క్రమంగా ఉపసంహరించుకునే వైఖరినే కొనసాగించాలని కమిటీ నిర్ణయించింది. ఎందుకంటే, ఆహార ధరలు గణనీయంగా పెరగడంతో జూన్ నెల ద్రవ్యోల్బణం 5.08 శాతానికి ఎగబాకింది. ఆహార ధరలు ఎంతకూ దిగిరావట్లేదని.. ధరల్లో స్థిరత్వం సాధించలేకపోతే గరిష్ఠ వృద్ధిని నిలకడగా కొనసాగించలేమని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి వరకు రెపో రేటును వరుసగా ఆరుసార్లు పెంచిన ఆర్‌బీఐ.. ఆ తర్వాత నుంచి యథాతథంగా కొనసాగిస్తూ వస్తోంది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25) 7.2% జీడీపీ వృద్ధి, 4.5% ద్రవ్యోల్బణ అంచనాలను సైతం యథాతథంగా కొనసాగిస్తున్నట్లు సమీక్షలో ఆర్‌బీఐ వెల్లడించింది.

అక్టోబరు లేదా డిసెంబరులో తగ్గింపు!?

ఈసారి ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపోరేటును అంచనాలకు అనుగుణంగానే యథాతథంగా కొనసాగించిందని ఆర్థిక విశ్లేషకులు పేర్కొన్నారు. ఆహార ధరల్లో అస్థిరతే ఇందుకు కారణమని వారన్నారు. ద్రవ్యోల్బణం 4% దిగువకు తగ్గేవరకు ఆర్‌బీఐ వేచి చూడవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది చివరి త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో ఆర్‌బీఐ రెపో రేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చని భావిస్తున్నారు. అక్టోబరు లేదా డిసెంబరు సమీక్షలో తొలితగ్గింపు ఉండవచ్చంటున్నారు.

టాప్‌అప్ లోన్స్ సమస్య కొన్ని బ్యాంక్‌లకే

కొన్ని బ్యాంక్‌లు తమ కస్టమర్లకు ఊహాజనిత ఉపయోగాల కోసం తనఖా రుణాలపై టాప్-అప్ లోన్స్ ఆఫర్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ అన్నారు. అయితే, ఇది వ్యవస్థాగత సమస్య కాదన్నారు. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోని ఆర్థిక సంస్థలతో మేము పర్యవేక్షక స్థాయిలో ద్వైపాక్షికంగా వ్యవహరిస్తామని దాస్ స్పష్టం చేశారు.

కుటుంబ పొదుపు సాధారణ స్థాయికి..

కుటుంబాల పొదుపు తీరు మళ్లీ సాధారణ స్థాయికి చేరుకుంటోందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకేల్ పాత్ర అన్నారు. ఈక్విటీల్లో కుటుంబ పొదుపు వాటా క్రమంగా తగ్గుతోందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కుటుంబ పొదుపు రేటు నాలుగు దశాబ్దాలకు పైగా కనిష్ఠ స్థాయి 5.3 శాతానికి పడిపోయింది.

డిపాజిట్ల వృద్ధిపై దాస్ ఆందోళన

కుటుంబ పొదుపు ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల్లోకి మళ్లుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన దాస్.. బ్యాంక్‌లు వినూత్న ఆర్థిక పథకాలు, సేవల ద్వారా డిపాజిట్ల సమీకరణను పెంచుకోవాలని సూచించారు. ఇందుకోసం తమ శాఖలను విస్తృతంగా వినియోగించుకోవాలన్నారు.

ఇండో-బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్‌కు అత్యుత్తమ పెయిన్ మేనేజ్‌మెంట్ అవార్డు



హైదరాబాద్: ప్రముఖ పెయిన్ మేనేజ్‌మెంట్ క్లినిక్ ఇండో-బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్.. జాతీయ స్థాయిలో అత్యుత్తమ పెయిన్ మేనేజ్‌మెంట్ అవార్డును గెలుచుకుంది. పెయిన్ మెడిసిన్ విభాగం లో ఇండో-బ్రిటిష్ క్లినిక్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ ఈ అవార్డును అందించింది. ఈ సందర్భంగా ఇండో-బ్రిటిష్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ విజయ భాస్కర్ బండికట్ల మాట్లాడుతూ.. దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్న వారికి సమగ్రమైన, అత్యాధునిక చికిత్సను అందించటంలో చేసిన కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించటం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఇంటర్వెన్షనల్ ప్రొసీజర్స్, మెడికేషన్ మేనేజ్‌మెంట్, ఫిజికల్ థెరపీ, సైకలాజికల్ కౌన్సిలింగ్ సహా వినూత్న చికిత్సా విధానాలతో నొప్పిని నివారించటంలో తమ క్లినిక్ చాలా కీలకంగా ఉందని ఆయన తెలిపారు.

నవ లిమిటెడ్ లాభం 446 కోట్లు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి నవ లిమిటెడ్ రూ.445.9 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన రూ.342.7 కోట్ల లాభంతో పోలిస్తే 30.1% వృద్ధి కనబరిచింది. భారత్, జాంబియాలోని ఎనర్జీ వ్యాపార విభాగం బలమైన పనితీరు కనబర్చడంతో పాటు ఎఫ్‌ఏపీ, మైనింగ్ వ్యాపారాలు ఆదాయాల్లో పెరుగుదల ఇందుకు దోహదపడ్డాయని పేర్కొంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయం వార్షిక ప్రాతిపదికన 16.7% వృద్ధితో రూ.1,258.4 కోట్లకు ఎగబాకింది. కంపెనీకి ఇప్పటివరకిదే అత్యధిక త్రైమాసికాదాయం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,170 ▼	63,410 ▼	86,500 ▼
ముంబై	69,205 ▲	63,392 ▲	78,880 ▼

ఏపీ, తెలంగాణల్లో ఫెడరల్ బ్యాంక్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్నట్లు ప్రైవేట్ రంగంలోని ఫెడరల్ బ్యాంక్ ప్రకటించింది. హైదరాబాద్‌లో బ్యాంక్ తొలి శాఖను ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్యాంక్ ఎండీ, సీఈఓ శ్యామ్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సంలో తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 10 నుంచి 12 శాఖలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో కొత్త శాఖలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణల్లో బ్యాంక్ మొత్తం 78 శాఖలను నిర్వహిస్తోంది. కాగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కోసం హైదరాబాద్‌లో పూర్తి స్థాయి జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే కస్టమర్ సపోర్ట్ కోసం విశాఖపట్నంలో 1,000 సీట్లతో ఒక కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు.

ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ


క్యూ1 లాభం 10,461 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ రూ.10,461 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.9,544 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం వృద్ధి కనబరిచింది. ఈ క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,10,910 కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో ఇదే సమయానికి రాబడి రూ.1,88,749 కోట్లుగా నమోదైంది. ఈ ఏప్రిల్-జూన్ కాలానికి కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) వార్షిక ప్రాతిపదికన 16.22 శాతం వృద్ధి చెంది రూ.53,58,781 కోట్లకు చేరుకుందని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు. మొత్తం ప్రీమియం ఆదాయం 16 శాతం పెరిగి రూ.1,13,770 కోట్లుగా నమోదైంది. సాల్వెన్సీ మార్జిన్ 1.99 శాతానికి పుంజుకుంది. ఆరోగ్య బీమా విభాగంలోకీ ప్రవేశించే ఆలోచనలో ఉన్నట్లు ఆర్థిక ఫలితాల విడుదల సమావేశంలో మొహంతి తెలిపారు. ఇందుకోసం ఏదైనా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో మెజారిటీ వాటా కొనుగోలు చేయాలని యోచిస్తున్నట్లు మీడియాతో ఆయన చెప్పారు.

సూచీలకు ఆర్‌బీఐ దెబ్బ

ముంబై: దేశీయ ఈక్విటీ సూచీలు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. గురువారం ఆర్‌బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచటం మార్కెట్ వర్గాలను పూర్తిగా నిరాశపరిచింది. దీంతో రోజంతా మార్కెట్లు ఆటుపోట్లలో సాగాయి. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 581.79 పాయింట్లు నష్టపోయి 78,886.22 పాయింట్ల వద్ద క్లోజైంది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 180.05 పాయింట్లు నష్టంతో 24,117 పాయింట్ల వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	430
వరంగల్	397	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	83
కర్నూలు	80	నెల్లూరు	83
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

సహజయోగ

భక్తి-విశ్వాసం



భక్తి అంటే భగవంతుని మీద ప్రేమ, నమ్మకం. పుట్టిన ప్రతి బిడ్డ తల్లిని, తండ్రిని నమ్మినట్టే... సృష్టికర్త ఒకరున్నారని చాలా మంది నమ్ముతారు. ఈ మొత్తం విశ్వాన్ని ఏదో శక్తి నడిపిస్తోందని దాదాపు ప్రతి ఒక్కరూ నమ్ముతారు. భూమి వేగం పెరిగినా, గ్రహాల స్థితిగతులు మారినా అవాంఛనీయ పరిణామాలు జరుగుతాయి. అలాంటిది జరగకుండా... సృష్టి మొత్తం సవ్యంగా సాగిపోతోందంటే... దీన్ని ఏదో అదృశ్యశక్తి కాపాడుతోంది. 'ఆ శక్తే దైవం' అని ఎంతో మంది శాస్త్రవేత్తలు సైతం విశ్వసిస్తారు. ఆ దైవశక్తి స్వరూప స్వభావాలను,గుణగణాలను ప్రాచీన భారతీయ మహర్షులు తపస్సు చేసి తెలుసుకున్నారు. బుద్ధిని ఉపయోగించి దైవశక్తిని అర్థం చేసుకొనే ప్రయత్నం కన్నా... హృదయపూర్వకమైన భక్తి విశ్వాసాలతో చేరుకోవడం సులభం. దానికోసం భగవంతుడి శక్తి మీద అనన్యమైన భక్తి, అచంచలమైన విశ్వాసం ఉండాలని సహజయోగ వ్యవస్థాపకురాలు శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రసంగాలలో ఎన్నో ఉదాహరణలు చెప్పారు.



భక్తి, విశ్వాసం... మానవుడికి, భగవంతుడికి మధ్య కంటికి కనిపించని వారధి లాంటివి. అవి మానవుణ్ణి భగవంతుడికి దగ్గర చేస్తాయి. మన పురాణాలలో ద్రౌపదికి శ్రీకృష్ణునిపై ఉన్న అనన్య భక్తి, అచంచల విశ్వాసమే... ఆమె మాన సంరక్షణ కోసం శ్రీకృష్ణుడు ద్వారక వదిలి హస్తినకు ఆఘమేఘాల మీద వచ్చేలా చేసింది. ఆ సమయంలో తన చీరను ఆమె తన పళ్ళ మధ్య ఉంచి... దుశ్శాసనుడితో ఆమె పెనుగులాడుతోంది. 'కృష్ణా' అనే పదంలో 'కృ' అని మాత్రమే అనగలిగింది. 'ష్ణా' అనడానికి నోరు తెరిస్తే... చీర జారిపోతుందేమోనని భయం. అలా చాలా సమయం పెనుగులాడిన తరువాత... శ్రీకృష్ణుడిని సంపూర్ణ శరణాగతి కోరుతూ... 'ష్ణా' అంది. ఆ శబ్దం బయటకు వచ్చి, ఆమె చీర తొలగిపోకముందే... శ్రీకృష్ణుడు మెరుపువేగంతో వచ్చి ఆమెను మాన సంరక్షణ చేశాడు. భగవంతుడి మీద భక్తుడికి అనన్యమైన భక్తి, అచంచలమైన విశ్వాసం ఉంటే... భగవంతుడు పరుగున వచ్చి భక్తుణ్ణి రక్షిస్తాడు.

ఛత్రపతి శివాజీకి ఆధ్యాత్మిక గురువైన శ్రీ సమర్థ రామదాసు ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తి. ఒక రోజు ఆయన తన శిష్యులను పరీక్షించాలనుకున్నాడు. జబ్బు పడినట్టుగా మంచం మీద పడుకున్నాడు. శిష్యులు వచ్చి కంగారుగా ఏమయిందని ప్రశ్నించారు. ఆయన తన కాలును చూపించారు. దానికి కట్టు కట్టి ఉంది. తన కాలుకు గాయమై చీము పట్టిందనీ, ఆ బాధ భరించలేకపోతున్నాననీ సమర్థ రామదాసు చెప్పాడు. "అదెలా తగ్గుతుంది?" అని శిష్యులు ప్రశ్నించారు. ఆ చీమును నోటితో పీల్చి బయటకు లాగితే తగ్గుతుందని ఆయన అన్నాడు. అది వినగానే, అసహ్యం, జుగుప్సతో శిష్యులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. శివాజీ ముందుకు వచ్చి... ఆ చీమును పీల్చడానికి సిద్ధపడ్డాడు. అతను పీల్చగానే నోటిలోకి మామిడి పండు రసం వచ్చింది. అది గురువు పెట్టిన పరీక్ష అని అందరికీ అర్థమయింది. శిష్యుడికి గురువుపై ఉండే భక్తి విశ్వాసాలే... గురుకృపకు పాత్రుణ్ణి చేస్తాయి. ప్రహ్లాదుడు, ధ్రువుడు, శబరి, అలాగే నారదమహర్షి మాటలపై విశ్వాసంతో దొంగతనాలు విడిచిపెట్టి, రామభక్తుడై, మహాకవిగా మారి... రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి ఇలా ఎందరో తమ భక్తి, విశ్వాసాలతో భగవంతుడి కటాక్షాన్ని పొందారు.


డాక్టర్ పి. రాకేష్
8988982200
పరమ పూజ్యశ్రీ మాతాజీ
నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్, తెలంగాణ

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Jf6M0Nyలో చదవండి.



సకల సంపత్కరం

వర్ష ఋతువులో తొలి మాసం శ్రావణం. పున్నమి రోజున శ్రవణం నక్షత్రం ఉన్న నెలను 'శ్రావణ మాసం' అంటారు. ఇంటింటా ఆడపడుచులకు ఆనందాన్ని పండించే నోములు, వ్రతాల పవిత్ర మాసం ఇది. మంగళవారాల్లో గౌరీదేవిని, శుక్రవారాల్లో లక్ష్మీదేవిని ప్రత్యేకంగా ఆరాధించినా... ఇది దేవతలందరికీ ప్రియమైన మాసం. అందుకే దీన్ని 'నభోమాసం' అంటారు. 'నభం' అంటే ఆకాశం. వర్ష ఋతువులో ఆకాశం కురిపించే వర్షాలతో భూమి సస్యశ్యామలమవుతుంది. ఆకాశంలో అంటే ఊర్ధ్వలోకాలలో కొలువైన దేవతలను ఆరాధిస్తే... వరాల వర్షం కురుస్తుందనేది పెద్దలమాట.

ఈ నెలలో ప్రతిరోజూ ఒక పర్వదినమే. మంగళగౌరి, వరలక్ష్మీ పూజలతో పాటు ఏకాదశి రోజుల్లో శైవ, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయి. నాగచతుర్థి, గరుడ పంచమి రోజున నాగేంద్రునికి పూజలు చేస్తారు, శ్రావణ పౌర్ణమి రోజున విఖనస జయంతి, హయగ్రీవ జయంతి, బహుళాష్టమి నాడు శ్రీ కృష్ణాష్టమి పర్వదినాలను వైష్ణవ సంప్రదాయంలో ఘనంగా జరుపుకొంటారు. శ్రావణ అమావాస్యను 'పోలాల అమావాస్య' అంటారు. ఆ రోజున ప్రధానంగా శక్తిని పూజిస్తారు. ముత్తయిదువలు పూజా మంటపం మీద పోలాంబకు ప్రతీకగా కందమొక్కను ప్రతిష్ఠించి, పూజిస్తారు. తోరాలను కట్టి, వాటినీ అమ్మవారికి అర్పించి, తాము, ఇంట్లోని ఆడపిల్లలు కట్టుకుంటారు. పోలాంబను పూజించడం వల్ల కుటుంబ సౌఖ్యం, సిరిసంపదలు, సౌభాగ్యం లభిస్తాయని విశ్వాసం. నందీశ్వరుడు జన్మించిన రోజు ఇదేనని పురాణాలు చెబుతున్నాయి. కనుక ఈ రోజున గో, వృషభ పూజను కూడా నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో మహిళలు, అవివాహితలు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. ప్రధానంగా నూతన వధువులతో పుట్టింటివారు ఈ వ్రతం చేయిస్తారు. ఈ వ్రతాన్ని అయిదేళ్ళపాటు ఆచరించడం సంప్రదాయం. దానికి అనుగుణంగా ఆడబిడ్డల పుట్టింటివారు ఆషాఢపట్టిని సంప్రదాయానుసారం వారి మెట్టినింటివారికి కానుకగా ఇచ్చి... తమ కుమార్తెలను పుట్టింటికి తీసుకువస్తారు. వారితో మంగళ గౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం చేయిస్తారు. శ్రావణ మాసం పూర్తవగానే మెట్టినింటివారు శ్రావణ పట్టి పేరిట వియ్యాలవారికి కానుకలిచ్చి, తమ కోడలిని తీసుకువెళ్తారు. ఇది తెలుగునాట అనాదిగా వస్తున్న ఆనవాయితీ. అలాగే శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు... మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం చేస్తారు. కోరిన వరాలను ఇచ్చే కల్పవల్లి శ్రీ వరలక్ష్మిని ప్రసన్నం చేసుకోవడానికి ఉద్దేశించిన ఈ వ్రతాన్ని కులాలకూ, వర్గాలకూ అతీతంగా... వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ ఆచరించవచ్చు. శ్రీ వరలక్ష్మీ దేవి ఆరాధనతో అభీష్టాలు సిద్ధిస్తాయనీ, సర్వ శ్రేయస్సులూ కలుగుతాయనీ, ఆరోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయనీ వ్రత గాథలు చెబుతున్నాయి. అలాగే ఈ నెలలో అత్యంత విశిష్టమైన రోజు... పౌర్ణమి. దీన్ని 'రాఖీ పౌర్ణమి' లేదా 'రక్షాబంధన దినోత్సవం'గా దేశమంతటా నిర్వహిస్తారు. రక్షాబంధనం సోదరీ సోదరుల ఆత్మీయానుబంధానికి చిహ్నం. సోదరికి సోదరుడు రక్షకట్టి, ఆమెకు ఎల్లవేళలా రక్షణగా ఉంటానని వాగ్దానం చేసే ఈ రోజు... సోదరీ సోదరుల మధ్య పరస్పర ప్రేమ, ఆప్యాయత, బాధ్యత, త్యాగం, రక్షణలకు ప్రతీక. అలాగే ఇది ఉపనయనం అయిన వారి ఉపాకర్మ సంస్కారాలకూ, వేదాధ్యయనానికీ అనువైన రోజుగా... 'జంధ్యాల పౌర్ణమి'గా దీన్ని జరుపుకొంటారు. ఈ విధంగా... సకల సంపత్కరమైన, శుభదాయకమైన మాసంగా శ్రావణానికి ఎనలేని ప్రత్యేకత ఉంది.

గీతాసారం

రంగుటద్దాలను తొలగించుకుందాం



మనం కొన్ని పనులు చేస్తాం, నిర్ణయాలు తీసుకుంటాం. ఇతరులు కూడా అలాగే చేస్తారు. ఆ పనుల్లో కొన్నిటికి మంచివి అనీ, మరికొన్నిటికి చెడ్డవి అని పేర్లు పెట్టడం చుట్టూ మన జీవితాలు అల్లుకొని ఉంటాయి. "సమత్వ బుద్ధి కలిగినవాడు పాప పుణ్యాలు రెండిటినీ ఈ లోకంలోనే త్యజిస్తాడు" అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అంటే మనం ఈ సమత్వ యోగాన్ని చేరుకున్నట్టయితే... ఆ తరువాత 'అవి మంచివి, ఇవి చెడ్డవి' అని పేర్లు పెట్టడం మానేస్తాం. అనవసరమైన అభిప్రాయాలకు చోటివ్వం. మన మనస్సు అనేక రంగుటద్దాలతో కప్పి ఉంటుంది. ఎదిగే సమయంలో మన తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు వెల్లడించే అభిప్రాయాలు, భావాల నియంత్రణలో ఉంటాం. అలాగే మనం జీవిస్తున్న దేశంలోని చట్టాల ద్వారా కూడా. ఇవన్నీ మన మనసుల్లో ముద్రవేసుకొని ఉంటాయి. మనం ఈ రంగుటద్దాల ద్వారానే అన్ని విషయాల్నీ, పనుల్నీ చూస్తూ ఉంటాం. వాటిని మంచివనీ, చెడ్డవనీ ముద్ర వేస్తాం. యోగ స్థితి... ఈ రంగులన్నీ వాటంతట అవే కరిగిపోయేలా, మనం అన్ని విషయాలనూ స్పష్టంగా చూడగలిగేలా చేస్తుంది. ఇది రెమ్మలకు బదులు మూలాలను నాశనం చేయడం లాంటిది. అంటే ప్రతి దానికీ మన సొంత రంగును (అభిప్రాయాన్ని) జోడించడానికి ప్రయత్నించకుండా... పరిస్థితులను ఉన్నవి ఉన్నట్టుగా అంగీకరించడం.

జీవితంలో ఈ రంగుటద్దాలు మనల్ని ముడుచుకుపోయేలా చేస్తాయి. తద్వారా నిర్ణయం తీసుకోడానికి అవసరమైన కీలక సమాచారాన్ని కోల్పోతాం. సరైనదికాని లేదా తప్పుగా అన్వయించిన సమాచారం ఆధారంగా తీసుకున్న నిర్ణయాలు, పనులు అనివార్యంగా విఫలమవుతాయి. తటస్థంగా ఉండడం అంటే ఒక సమస్యకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఏకకాలంలో వాదించాల్సిన పరిస్థితి లాంటిది. న్యాయమూర్తి నిర్ణయాలు తీసుకొనే ముందు ఇరు పక్షాల వాదలను వినడం లాంటిది. అన్ని జీవులలో తనను, అన్ని జీవులను తనలోనూ చూడడం లాంటిది. అంతిమంగా అంతా శ్రీకృష్ణమయమే. ఒక పరిస్థితిలో మనం కూరుకుపోకుండా.. మనల్ని మనం వేరు చేసుకొని.. ఆ పరిస్థితిలోని ఇరు పార్శ్వాలనూ అర్థం చేసుకొనే సామర్థ్యం ఇది. ఈ సామర్థ్యం వికసించాక... మనల్ని మనం కేంద్రీకరించుకోవడం మొదలుపెడతాం. ఎవరైనా క్షణికమైన యోగ స్థితిని (సమతుల్యతను) పొందినప్పుడు కూడా... ఆ సమయంలో వారి ద్వారా జరిగే పని సమంజసంగా ఉంటుంది. సాధనతో ఆ స్థితి శాశ్వతమవుతుంది.


కె. శివప్రసాద్
ఐఏఎస్

3 ఉచిత సిలిండర్ల హామీపై కసరత్తు!

- ఏటా ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం రూ.4,035 కోట్లు
- 'దీపం' కనెక్షన్లను పీఎంయూవైలో కలపాలని కేంద్రానికి ప్రతిపాదన
- చర్చించేందుకు ఢిల్లీకి వెళ్లిన మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ అమలుకు కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. దీనికి ఎన్ని నిధులు అవసరమవుతాయి? వాటిని ఏవిధంగా సమకూర్చుకోవాలనే దానిపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఇప్పటికే అంచనాలు రూపొందించింది. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న 59,16,290 కుటుంబాలకు 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 'దీపం' పథకం కింద ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేసింది. ట్రైబల్ ఎల్పీజీ ప్యాకేజీ కింద మరో 73,936 గ్యాస్ కనెక్షన్లను గిరిజన కుటుంబాలకు ఇచ్చింది. ఇవికాకుండా కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన(పీఎంయూవై) పథకం కింద రాష్ట్రంలోని 9,65,361 పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేయగా.. సీఎస్ఆర్ కింద మరో 6,23,831 కనెక్షన్లు ఉన్నాయి. వీరిలోనూ కొంతమంది బీపీఎల్ పరిధిలోకి వస్తారు. ఇంకా 80,78,788 మంది గ్యాస్ వినియోగదారులు జనరల్ విభాగం కింద ఉన్నారు. మొత్తంగా ప్రస్తుతం రాష్ట్రంలో 1,55,84,270 మంది ఎల్పీజీ వినియోగదారులు ఉన్నారు. ప్రస్తుతం 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.876 ఉంది. ఈ లెక్కన ఆ కుటుంబాలకు ఒక్క సిలిండరు చొప్పున రూ.1,365 కోట్లకుపైగా నిధులు అవసరం. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలంటే ఏకంగా రూ.4,095 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న 59,16,290 'దీపం' కనెక్షన్లను.. పీఎంయూవై పథకం కింద మార్చాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. 'దీపం' లబ్ధిదారులందరూ పీఎంయూవై పథకానికి అర్హులేనని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. ప్రధానంగా ఈ అంశంపై కేంద్రంతో చర్చించడానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఢిల్లీ వెళ్లినట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం ఆమోదిస్తే.. రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్న రూ.4,035 కోట్ల భారంలో దాదాపు రూ.1,535 కోట్లకుపైగా తగ్గిపోతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోతే మొత్తం భారం రాష్ట్ర ప్రభుత్వంపైనే పడనుంది.

'అన్నదాత సుఖీభవ'కు మార్గదర్శకాలు

- పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందాలి
- రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ పార్క్: సీఎం

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకం మార్గదర్శకాలను సిద్ధం చేసి, విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్కెటింగ్ శాఖలపై సీఎం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ పార్క్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేయాలి. కేంద్ర పౌర విమానయాన శాఖతో సంప్రదించి డ్రోన్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు కూడా కృషి చేయాలి. రాష్ట్రంలో ఎక్కడా రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాలి. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఆర్థిక శాఖ రూ.36 కోట్లు విడుదల చేయాలి. ఈ-క్రాప్ నూరు శాతం నమోదు చేయాలి. రైతులకు సాగు ఖర్చులు తగ్గి, నికరాదాయం లభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. సాగులో ఉత్తమ విధానాలు అవలంబించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగేందుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలి. నేలలో తేమను గుర్తించేందుకు శాటిలైట్ సేవల్ని వినియోగించుకోవాలి. ఉద్యాన పంటల్లో దేశంలోనే రాష్ట్రం ముందుండేలా కార్యాచరణ చేపట్టాలి. వచ్చే మూడేళ్లలో ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెరిగేలా చూడాలి. ఇందుకు 2014-19 నాటి విధానాలను అనుసరించాలి. 15% జీఎస్డీపీ సాధించేలా చర్యలు తీసుకోవాలి. మౌలిక వసతులు, మార్కెటింగ్, లాజిస్టిక్స్, కోల్డ్‌స్టోరేజీలు, తక్కువ ఖర్చుతో రవాణా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఫుడ్‌ప్రాసెసింగ్‌లో ఉత్తమ విధానాన్ని తెచ్చేందుకు నివేదిక సిద్ధం చేయాలి' అని నిర్దేశించారు. కొత్త జిల్లాల్లో డీసీసీబీలు ఏర్పాటు చేయాల్సి ఉందని సహకార శాఖ అధికారి అహ్మద్‌బాబు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రత్యేక సీఎస్ రాజశేఖర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ!

జిల్లా యూనిట్‌గా

అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, బీజేపీలకు 31 సీట్లు ఇచ్చాం. దీనివల్ల ఆ నియోజకవర్గాల పార్టీ నేతలు పోటీచేసే అవకాశం కోల్పోయారు. నామినేటెడ్ పదవుల పంపిణీలో మొదట వారి విషయం చూస్తాం. మిగిలిన వారికి విడతలవారీగా అవకాశాలొస్తాయి.

ఇసుకతో వ్యాపారం చేయరాదన్నది మన విధానం. ఎవరికి ఇసుక అవసరమో వారికి తక్కువ ధరకే అందాలి. వ్యాపారం చేసేవారు అందులో కాలు పెడితే రేట్లు పెరుగుతాయి.

- సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు చేస్తే ఎవరికీ సమస్యలు ఉండవని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. దీని ప్రకారం ఏ జిల్లాలో ఏ ఉప కులం జనాభా ఎంత ఉంటే అంత దామాషాలో వారికి రిజర్వేషన్లు లభిస్తాయి. ఈ నిర్ణయానికి పొలిట్‌బ్యూరో ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో పాల్గొన్న రెండు దళిత ఉప కులాల నేతలెవరూ దీనిపై ఏ వ్యాఖ్య చేయలేదు. ఇక రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి నిధుల కొరత తీవ్రంగా ఉన్నందున రాష్ట్ర రహదారులను కూడా జాతీయ రహదారుల నమూనాలో అభివృద్ధి చేసే విషయం పరిశీలిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. టెండర్ పొందిన కంపెనీ తన పెట్టుబడితో జాతీయ రహదారి నిర్మించి తర్వాత టోల్ ఫీజుల ద్వారా తన ఖర్చును రాబట్టుకుంటోంది. రాష్ట్ర రహదారులను కూడా ఇదే పద్ధతిలో నిర్మించే ఆలోచన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రతిపాదనకు ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తాయేమోనని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సందేహం వ్యక్తం చేశారు. 'మనం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు వంటివాటికి టోల్ వసూలు చేయం. కార్లు, లారీలు, బస్సులకు మాత్రమే వసూలు చేయాలనుకుంటున్నాం. రోడ్లు బాగుంటే పెద్ద వాహనాలకు లాభం. వాళ్లు టోల్ ఫీజు కట్టడానికి వెనకాడరు' అని ముఖ్యమంత్రి బదులిచ్చారు. బాగా పెద్ద రోడ్లకు మాత్రమే ఈ విధానం అమల్లోకి తేవాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రాజెక్టుల కింద సాగునీటి కాల్వల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే బాగుంటుందన్న ప్రతిపాదన కూడా వచ్చిందని, దానిపై పార్టీ నేతలు తమ ఆలోచనలు చెప్పాలని కోరారు. బాగానే ఉందని ఒకరిద్దరు నేతలు చెప్పారు.

సీట్లు కోల్పోయినవారికే పెద్దపీట

మిత్రపక్షాలకు సీట్లు త్యాగం చేసిన వారికి నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. 'అసెంబ్లీ అభ్యర్థుల ఖరారుకు మనం ఒక విధానం పెట్టుకుని పనిచేశాం. ఎవరి సిఫారసులూ తీసుకోలేదు. ఇప్పుడు నామినేటెడ్ పదవుల భర్తీలోనూ అదే అవలంబిస్తున్నాం. ఎవరి సిఫారసులూ ఉండవు. ఎన్నికల్లో ఎవరు బాగా పనిచేశారో సమాచారం తెప్పించుకుని విశ్లేషించి వివిధ సమీకరణల ఆధారంగా భర్తీ చేస్తాం' అని వివరించారు. కొద్ది రోజుల్లోనే నామినేటెడ్ పోస్టుల తొలి జాబితా విడుదల అవుతుందన్నారు. మిత్రపక్షాలకు పదవులు ఇంత శాతమని అనుకోకుండా.. ఎవరు బాగా పనిచేస్తే వారికి అవకాశాలివ్వడం బాగుంటుందని ఒక నేత సూచించారు. ఎన్నికలకు ముందే ఎన్డీయేలో చేరడం బాగా ఉపయోగపడిందని, ఇంకా జాగ్రత్తగా పనిచేస్తే వైసీపీ గెలిచిన 11 సీట్లలో నాలుగైనా గెలవగలిగేవారమని సీఎం వ్యాఖ్యానించారు. విశాఖ జిల్లా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిని త్వరలో ఖరారు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు పార్టీ నుంచి మార్గదర్శకత్వం ఉండాలని సూచించారు. 'మద్యంపై ఒక విధానం అనుకుంటున్నాం. ఆ శాఖ మంత్రి కొందరు పార్టీ నేతలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. అవసరమైతే ఆ విధానంపై జిల్లాల్లో సమావేశాలు పెట్టి అక్కడి నేతల సలహాలు కూడా తీసుకుంటారు. అలాగే ఉచిత ఇసుక విధానం మరింత మెరుగ్గా ఎలా ఉండాలన్నదానిపైనా పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకుంటాం. విధానపరమైన నిర్ణయాల్లో పార్టీ వాణి ప్రముఖంగా ఉండాలన్నది నా ఆలోచన' అని చెప్పారు. ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసేవారు స్టాక్ పాయింట్ల నుంచి కాకుండా నేరుగా నదుల నుంచి తీసుకునే అవకాశం కల్పించాలని, దీనివల్ల అనేక మందికి ఉపాధి లభిస్తుందని కొందరు నేతలు సూచించారు. కానీ చంద్రబాబు అంగీకరించలేదు.

10% మంది ద్వారా 20% మంది అభివృద్ధి

సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న పది శాతం మంది ద్వారా అట్టడుగున ఉన్న ఇరవై శాతం మందిని పైకి తేవాలన్నది తమ ఆలోచనగా చంద్రబాబు తెలిపారు. దీనినెలా అమలు చేయాలన్నదానిపై కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ రెండు వర్గాల మధ్య అనుసంధానానికి వలంటీర్లను వినియోగిస్తే బాగుంటుందని, వారికిప్పుడు పెద్దగా పని కూడా లేదని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు సూచించారు. ఈ ఆలోచన బాగుందని, తమ కసరత్తులో దీనిపై కూడా దృష్టి పెడతామని సీఎం చెప్పారు.

సోమశిల, కండలేరు ఎప్పటికి నిండేనో..!

తమ జిల్లాలో సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో నీటి మట్టం అట్టడుగుకు పడిపోయిందని, ఇప్పుడు ఏడు వేల క్యూసెక్కుల నీరు మాత్రం వస్తోందని... ఈ లెక్కన అవి ఎప్పటికి నిండుతాయో అర్థం కావడం లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమావేశంలో అన్నారు. 'పోతిరెడ్డిపాడు నుంచి 40 వేల క్యూసెక్కుల నీటిని తీసుకుని అన్ని కాల్వలకు పంచితే మీకంత వస్తున్నాయి. అక్కడి నుంచి అంతకంటే ఎక్కువ తీసుకోవడం కుదరడం లేదు. అందుకే నదుల అనుసంధానంపై దృష్టి పెట్టాం. ప్రధాని కూడా సుముఖంగా ఉన్నారు. అది జరిగితే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో సాగునీటి సమస్య చాలావరకూ పరిష్కారం అవుతుంది' అని ముఖ్యమంత్రి చెప్పారు.

తెలంగాణ స్థానిక ఎన్నికల బరిలో టీడీపీ!

తెలంగాణలోనూ తిరిగి టీడీపీని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తామని చంద్రబాబు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీని సన్నద్ధం చేసే ఆలోచన ఉందని తెలిపారు.


టీడీపీ కార్యకర్తలు దుర్గాదేవి, నాగరాజు యాదవ్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఇద్దరు కార్యకర్తలకు అరుదైన గౌరవం

సచివాలయానికి పిలిపించుకున్న చంద్రబాబు

ఇద్దరు సామాన్య టీడీపీ కార్యకర్తలకు అరుదైన గౌరవం లభించింది. చంద్రబాబు గురువారం వారిద్దరినీ అమరావతి సచివాలయానికి ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గానికి చెందిన మహిళా కార్యకర్త దుర్గాదేవి, పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గానికి చెందిన నాగరాజు యాదవ్‌లకు ఈ అవకాశం లభించింది. ఈ ఇద్దరూ పార్టీకి వీరాభిమానులు. ఆర్థికంగా సాధారణ స్థితిలో ఉన్నవారు. చంద్రబాబు ఏ కార్యక్రమం నిర్వహించినా ఠంచనుగా హాజరవుతారు. దుర్గాదేవికి ఒక స్కూటీ ఉంది. చంద్రబాబు ఎక్కడ పర్యటించినా.. ఏ కార్యక్రమం చేపట్టినా ఆమె తన స్కూటీపై ఎంత దూరమైనా వెళ్లి పాల్గొనేవారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఆమె మంగళగిరి పార్టీ కార్యాలయం ముందు జాతీయ రహదారిపై ఆయన్ను పోలీసులు తీసుకొస్తున్న వాహనానికి అడ్డుపడే ప్రయత్నం చేశారు. పోలీసులు నెట్టివేసి కొట్టినా ఆగలేదు. నాగరాజు మరీ సామాన్య కార్యకర్త. పార్టీ కార్యాలయానికి చంద్రబాబు వస్తున్నారంటే బస్సెక్కి వచ్చేస్తాడు. ఆయన రాష్ట్రంలో ఎక్కడ పర్యటనకు వెళ్లినా హాజరవుతాడు. అమాయకంగా ఉండే నాగరాజును పార్టీ కేంద్ర కార్యాలయంలో నేతలు ఆప్యాయంగా పలకరిస్తుంటారు. చంద్రబాబు అరెస్టు సమయంలో వీరిద్దరూ రాజమహేంద్రవరం జైలు వద్దే కొన్ని రోజులు ఉండి ఆయన ఎప్పుడు బయటకు వస్తారా అని ఎదురు చూశారు. తనపై అంతులేని అభిమానం ఉన్న ఈ ఇద్దరినీ చంద్రబాబు గుర్తుపెట్టుకుని తన వ్యక్తిగత సిబ్బంది ద్వారా గురువారం సెక్రటేరియట్‌కు పిలిపించుకున్నారు. ఆప్యాయంగా పలుకరించి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారితో ఫొటోలు దిగారు. తమ అధినేత ఆదరణకు వారిద్దరూ ఉబ్బితబ్బిబ్బయ్యారు.



జన్మభూమి-2తో అభివృద్ధి, సంక్షేమం!

పీ4 విధానంతో సంపద సృష్టికి కృషి: పల్లా, కాల్వ

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ జన్మభూమి కార్యక్రమం చేపట్టాలని టీడీపీ పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. పేదరిక నిర్మూలనకు పీ4 విధానాలను అమలు చేయాలని నిశ్చయించిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. పొలిట్‌బ్యూరో సమావేశం వివరాలను వీరిద్దరూ మీడియాకు తెలియజేశారు. ప్రజారాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, నదుల అనుసంధానం, వెనుకబడిన 8 జిల్లాలకు కేంద్ర సహకారం, నామినేటెడ్ పోస్టుల భర్తీ.. ఆగస్టు 15న అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం, ఉపాధి, నీరుచెట్టు బిల్లుల విడుదల, ప్రజావేదిక, ప్రజాదర్బారులో అందిన అర్జీల పరిష్కారానికి యంత్రాంగం ఏర్పాటు తదితర అంశాలపై చర్చించినట్లు చెప్పారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. ఇప్పుడు జన్మభూమి-2 కింద ప్రజలందరి సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తాం. రూ.100కు పార్టీ సభ్యత్వం, పార్టీ సభ్యులకు ఇచ్చే ప్రమాదబీమాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ పొలిట్‌బ్యూరో నిర్ణయం తీసుకుంది. నిబద్ధతతో కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమిస్తామని చంద్రబాబు చెప్పారు. 'గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాలు, దోపిడీ, భూకబ్జాలపై కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఏడు శ్వేతపత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. కూటమి అధికారంలోకి రాగానే పింఛన్లు రూ.4 వేలకు పెంపు, 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన హామీల అమలును ప్రారంభించాం. ఒక్క రోజులోనే 98% పింఛన్లు పంపిణీ చేశాం. పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనకు, సంపద సృష్టికి కృషి చేస్తాం.. ఇటీవలి వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు' అని పల్లా, కాల్వ వెల్లడించారు.

ఇదీ 'జన్మభూమి'


చంద్రబాబు 1995లో తొలిసారి సీఎం అయిన తర్వాత పాలనలో వినూత్నమైన విధానాలను అమలు చేశారు. అందులో... 'జన్మభూమి' కార్యక్రమం ఒకటి! ఇలాంటి కార్యక్రమం అప్పటికే వివిధ రాష్ట్రాల్లో, వేర్వేరు పేర్లతో అమలులో ఉంది. దీనిని చంద్రబాబు మరింత మెరుగు పరిచి అమలు చేశారు. ప్రజలు, ప్రభుత్వం, అధికార యంత్రాంగాన్ని కలుపుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా మార్చారు. ఇందులో ప్రవాసాంధ్రులనూ భాగస్వాములను చేశారు. ఒక ఊరిని లేదా ఒక ప్రాంతాన్ని దత్తత తీసుకుని అభివృద్ధికి సహకరించేలా చూశారు. మహిళా జన్మభూమి, రైతు జన్మభూమి, కార్మికుల జన్మభూమి... ఇలా ప్రత్యేకంగా అంశాల వారీగా కూడా ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. జన్మభూమిలో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చేవారు. కలెక్టర్లకు ఈ బాధ్యత అప్పగించారు.

28మంది డీఎస్పీల బదిలీ

- 18 సబ్ డివిజన్లలో లూప్‌లైన్ అధికారులు
- వైసీపీ చట్టం అమలుకు నిరాకరించి మిగతావారిలో ఏడుగురు హెడ్‌క్వార్టర్స్‌కు.. ముగ్గురు సీబీసీఐడీకి బదిలీ

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వారిలో ఎక్కువమంది క్రమశిక్షణ కలిగిన యూనిఫామ్ సర్వీసులో ఇరవై, పాతికేళ్లు పనిచేశారు. వైసీపీ చట్టాన్ని అమలు చేసేందుకు ససేమిరా అని, ఐపీసీ వైపు మొగ్గు చూపారు. అంతే.. ఐదేళ్లూ లూప్‌లైన్‌లోనే ఉండిపోయారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఎట్టకేలకు సగౌరవంగా యూనిఫామ్ వేసుకుని శాంతి భద్రతల ఉద్యోగం చేసే అవకాశం ఇప్పుడిప్పుడే లభిస్తోంది. ఇటీవల జరిగిన 96మంది డీఎస్పీల బదిలీల్లో 22 సబ్ డివిజన్లను భర్తీచేసిన పోలీసు శాఖ తాజాగా 28 మందిని బదిలీ చేసింది. అందులో 18 మంది డీఎస్పీలు వైసీపీ ప్రభుత్వంలో అనామక పోస్టింగుల్లో ఉండిపోయారు. వారికి సబ్ డివిజన్లలో పోస్టింగ్ ఇచ్చి ఐదేళ్ల ఆవేదనకు చంద్రబాబు ప్రభుత్వం తెరదించింది. సబ్ డివిజన్ పోస్టింగ్ దక్కినవారిలో ఎం.వెంకటేశ్వర రావు (పోలవరం), సీహెచ్. శ్రీనివాసరావు (గన్నవరం), కేవీ మహేశ్(హిందూపురం), జి. రామాంజినేయులు(బాపట్ల), రాయపాటి శ్రీనివాసరావు(ఒంగోలు), జి.చెంచుబాబు(నాయుడు పేట), కె. విజయ్ శేఖర్(తిరుమల), జె. వెంకట నారాయణ(తిరుపతి), ఎం. వెంకటాద్రి(రేణిగుంట), భవ్య కిశోర్ (రాజమండ్రి దక్షిణ), పి.రవిబాబు (కల్యాణదుర్గం), డి. సోమణ్ణ (ఆదోని), యుగంధర్ బాబు(నంద్యాల), జి. రవికుమార్(పుత్తూరు), జి.రాజేంద్ర ప్రసాద్(మైదుకూరు), జి. దేవకుమార్(కొవ్వూరు), వీవీ రమణ కుమార్(గూడూరు), కె.వేణుగోపాల్(ఆత్మకూరు, నెల్లూరు) ఉన్నారు. అమలాపురం, పోలవరం, చిత్తూరు, అనంతపురం రూరల్, ఆదోని, పత్తికొండ, ఆత్మకూరు(ఎస్) డీఎస్పీలను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావుకు సీఐడీలో పోస్టింగ్ లభించింది.

ఎస్పీఎఫ్‌కు పోలీసు లోగో



అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సాయుధ పోలీసు బలగాల యూనిఫామ్ ప్యాటర్న్ మారుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్)కు కూడా ఆ మేరకు అనుమతిచ్చింది. ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీఎస్పీ లాంటి విభాగాల్లోనూ విజిల్ కార్డ్, బెల్ట్ లాంటి వాటి రంగులు మార్చి పోలీసు కానిస్టేబుల్‌తో సమానంగా కనిపించేలా మార్పు చేయాలన్న వినతికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇదే సమయంలో ఎస్పీఎఫ్ సిబ్బంది గౌరవాన్ని పెంచేలా పోలీసు లోగో ఇవ్వాలంటూ ఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమ్ వర్మ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సమ్మతిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై తలపై బ్యారెట్ క్యాప్ బదులు పీక్ క్యాప్, నడుముకు బ్రౌన్ బెల్ట్ స్థానంలో బ్లాక్ బెల్ట్‌తోపాటు భుజంపై లోగో మార్పునకు అనుమతిచ్చింది. ప్రస్తుతం ఎస్పీఎఫ్ లోగోలో.. ప్రొటెక్షన్ ఫర్ ప్రోగ్రెస్ అంటూ మూడు సింహాల కింద కలశం బొమ్మ ఉంది. కొత్త దాంట్లో మూడు సింహాల కింద ఏపీ పోలీస్ గద్ద బొమ్మతోపాటు ఎస్పీఎఫ్ అని ఉంటుంది. 'ఆల్వేస్ డిఫెండింగ్' అంటూ లోగోలో కొత్తగా ట్యాగ్‌లైన్ రాబోతోంది.

ప్రపంచ బ్యాంకు సాయంతో ఏపీలో గ్రీన్ హైవే

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ప్రపంచ బ్యాంకు సహకారంతో భారత ప్రభుత్వం ఎకో ఫ్రెండ్లీ హైవేలను నిర్మించనుంది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు నాలుగు రాష్ట్రాల్లో 781 కిలోమీటర్ల మేర పర్యావరణ హితమైన గ్రీన్ హైవేలను నిర్మించనుంది. కర్బన ఉద్గారాలను తగ్గించడం, రహదారి భద్రతను మెరుగుపర్చడం, ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. గ్రీన్ నేషనల్ హైవే కారిడార్ ప్రాజెక్టు (జీఎన్‌హెచ్‌సీపీ) పేరిట చేపడుతున్న దీని కోసం ప్రపంచ బ్యాంకుతో భారత ప్రభుత్వం చేతులు కలిపింది. ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో 781 కిలోమీటర్ల మేర ఈ పర్యావరణ అనుకూల రహదారులను నిర్మించనుంది. మొత్తం రూ.7,662.47 కోట్ల వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు సుమారు రూ.3,775 కోట్లు రుణంగా ఇవ్వనుంది.

రాష్ట్రానికి కన్నడ కుంకి ఏనుగులు

- సరిహద్దు గ్రామాల్లో ఏనుగుల బెడదకు విరుగుడు
- ఇరు రాష్ట్రాల మధ్య ఏడు ఒప్పందాలు
- బెంగళూరులో పవన్‌కల్యాణ్ పర్యటన
- సీఎం సిద్దరామయ్యతో భేటీ
- కర్ణాటక అటవీశాఖ మంత్రితో చర్చలు

బెంగళూరు, అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక-ఏపీ మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కలిసి పనిచేస్తే చాలా సమస్యలు తీరుతాయని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. గురువారం బెంగళూరు వెళ్లిన పవన్.. కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బీ ఖండ్రే, అటవీ అధికారులతో భేటీ అయ్యారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. "ఏడు అంశాలపై చర్చించాం. వాటిపై ఒప్పందాలు చేసుకున్నాం. కర్ణాటక సరిహద్దులోని ఆంధ్రా గ్రామాల్లో ఏనుగుల సమస్య అధికంగా ఉంది. దీనిని పరిష్కరించేందుకు కర్ణాటక ప్రభుత్వం ఎనిమిది కుంకి ఏనుగులను అందించేందుకు అంగీకరించింది. ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడిపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి నిర్ణయం తీసుకుంటాయి. అటవీ సంపద రక్షణకు సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపైనా చర్చించాం. వన్యప్రాణులను చంపి, స్మగ్లింగ్ చేసే వారిని కట్టడి చేసేలా రెండు రాష్ట్రాలు సమష్టిగా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. తిరుమల, శ్రీశైలం దేవస్థానాలకు వచ్చే కర్ణాటక భక్తుల కోసం యాత్రీసదన్‌ల నిర్మాణానికి భూములు కేటాయించాలని కర్ణాటక ప్రభుత్వం కోరింది. ఎకో టూరిజం అభివృద్ధిపై ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్లాలని నిర్ణయించాం" అని పవన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రూ.140 కోట్ల విలువైన ఎర్రచందనాన్ని కర్ణాటక అటవీ అధికారులు స్వాధీనం చేసుకోవడం అభినందనీయమన్నారు. అంతకుముందు.. పవన్ విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరుకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రేతో చర్చల కోసం విధానసౌధకు వచ్చారు. చర్చల అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడారు. మంత్రి ఈశ్వర్‌ఖండ్రే


కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

మాట్లాడుతూ... ఎర్రచందన అక్రమ రవాణా, వన్యప్రాణుల సంరక్షణ, వాటి పర్యవేక్షణ, ఎకో టూరిజం, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ, రెండు రాష్ట్రాల మధ్య నాలెడ్జ్ బదిలీ, ఏనుగుల నుంచి మనుషుల రక్షణ వంటి అంశాలపై చర్చలు జరిపామని తెలిపారు.

'రోడ్డు' ఎక్కుతున్న ఉపాధి!

(మొదటి పేజీ తరువాయి)

అమలైంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పుడు కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులను తెచ్చుకునేందుకు కనిపిస్తున్న ఆశాదీపంలా ఈ పథకమే కనిపిస్తోంది. ఏటా రూ.10 వేల కోట్లకు పైగా రాష్ట్రానికి కేంద్ర వనరులు తీసుకొచ్చే అవకాశముంది. గతంలో చంద్రబాబు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెటీరియల్ నిధులతో శాశ్వత నిర్మాణాలు చేపట్టగలిగారు. సిమెంట్‌రోడ్లు, గ్రామీణ ప్రాంతాల్లో పార్కులు, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, రైతులకు ఉచితంగా ఉద్యానవన పంటల ప్రోత్సాహం, కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, చెక్ డ్యాంలు, ఊటకుంటలు తదితర భూగర్భ జలాల పరిరక్షణ పనులతో పాటు వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు చెందిన వందల సంఖ్యలో పనులు నాడు చేపట్టారు. వైసీపీ వచ్చిన తర్వాత అడ్డగోలు వ్యవహారాలకు అడ్డాగా అది మిగిలిపోయింది. కొన్నిచోట్ల గ్రామ సచివాలయ భవనాలు తలపెట్టగా, అవి అసంపూర్తిగా మిగిలిపోవడంతో ఉపాధి నిధులు సద్వినియోగం కాలేదు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈ శాఖను పవన్ కల్యాణ్‌కు అప్పగించింది. మరోవైపు పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం రాష్ట్రానికి బాగా కలిసివచ్చింది.

అధికారంలోకి రాగానే నిధుల విడుదల

ఉపాధి హామీ పథకం కూలీలు గత మూడు నెలలుగా వేతనాల బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రంతో దీనిపై పవన్ కల్యాణ్ సంప్రదించి, పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలు రూ.2300 కోట్ల నిధులను రాష్ట్రానికి అందేలా చూశారు. అవి బుధవారం విడుదలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఉపాధి పథకం ద్వారా విడుదల చేసే మెటీరియల్ నిధులను ప్రధానంగా సిమెంట్ రోడ్లకు వినియోగించుకోవాలని యోచిస్తున్నట్టు సమాచారం. కూలీల వేతనాల పనులు 60 శాతం చేస్తే దానికి అనుగుణంగా మెటీరియల్ నిధులు 40శాతం కేంద్రం విడుదల చేస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కూలీల ద్వారా సుమారు రూ.5180 కోట్ల విలువైన వేతనాల రూపంలో పనులు చేపట్టారు. దానికి అనుగుణంగా సుమారు రూ.2 వేల కోట్లకు పైగా మెటీరియల్ నిధులను కేంద్రం విడుదల చేయనుంది. వాటికి అదనంగా మరికొన్ని నిధులు రాబట్టి సిమెంట్ రోడ్లు నిర్మించాలని భావిస్తోంది. గత ఐదేళ్లలో పాడైన రోడ్లను పునర్నిర్మించాలని, అందుకు ఉపాధి హామీ మెటీరియల్ నిధులు వాడుకోవాలని కూటమి సర్కారు యోచిస్తోంది.



విజిలెన్స్ వేధింపులకు స్వస్తి

గత ప్రభుత్వం అంతకుముందు టీడీపీ హయాంలో వేసిన సిమెంట్‌రోడ్లపై పగబట్టింది. అప్పట్లో సిమెంట్ రోడ్లు పనులు చేపట్టిన ఇంజనీర్లపై కక్షతో విజిలెన్స్ విచారణ చేయించింది. కేసులు పెట్టి ఇబ్బంది పెట్టింది. ఈ ఇంజనీర్లపై ఉన్న విజిలెన్స్ కేసులను పునఃసమీక్షించాలని కొత్త ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందుతున్నాయి. గత ప్రభుత్వం పెట్టిన తప్పుడు విజిలెన్స్ కేసులను తొలగిస్తే తప్ప ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ సిమెంట్‌రోడ్లు నిర్మించే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

కన్వర్జెన్స్ పనులపై దృష్టి...

పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత ఆస్తులను అభివృద్ధి చేసేందుకు ఉపాధి నిధులను వినియోగించాలని భావించినట్లు తెలిసింది. అందులోభాగంగా అన్ని జిల్లాల్లో మినీ గోకులాలు నిర్మించాలంటూ ఇప్పటికే పశుసంవర్ధక శాఖ ఆదేశాలు ఇచ్చింది. ఉపాధి పథకంలో గతంలో ఏ పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారో ఆ పనులన్నీ మళ్లీ ప్రారంభించనున్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఈ పథకం రాష్ట్రంలో అమలవుతున్న తీరును అధ్యయనం చేస్తున్నారు. ఏ విధంగా చేస్తే పథకాన్ని సద్వినియోగమై ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనేది అధికారులతో చర్చిస్తున్నారు. దీనిపై ఇప్పటికే సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ పథకంలో పనిచేసే ఉద్యోగులతో చర్చించి వారి ఇబ్బందులపై ఆరా తీశారు.


మంగళగిరిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిరీష రాణి

ఏపీ శాట్ కార్యాలయంలో ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

- డైరెక్టర్ జగదీశ్ కుమార్ వేధింపులే కారణమని ఆరోపణ
- ఆయన వైసీపీ ఎమ్మెల్సీకి బావమరిది అని వెల్లడి

మంగళగిరి సిటీ, ఆగస్టు 8: ప్రభుత్వ కార్యాలయంలోనే ఓ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన ఎ.శిరీష రాణి మంగళగిరిలోని రాష్ట్ర సామాజిక తనిఖీ కేంద్రం(ఏపీ శాట్)లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏపీ శాట్ డైరెక్టర్ జగదీశ్ కుమార్ నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని, తరచుగా సెక్షన్లు మారుస్తూ, మెమోలు జారీ చేస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆమె ఆరోపించారు. బుధవారం మరోమారు కిందస్థాయి ఉద్యోగులకు మెమో జారీ చేశారని తాను వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా సహచర ఉద్యోగుల ముందు దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కార్యాలయంలోని మెడికల్ కిట్ నుంచి హానికరమైన మాత్రలను మింగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన తోటి ఉద్యోగులు ఆమెను మంగళగిరిలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ బావమరిది అయిన జగదీశ్ కుమార్ పదవీకాలం గత నెల 12నే ముగిసినప్పటికీ తన పలుకుబడిని ఉపయోగించుకుని మూడు నెలలు పొడిగించుకున్నారని, అప్పటి నుంచి కిందిస్థాయి ఉద్యోగులపై వేధింపులు మరింత అధికమయ్యాయని ఉద్యోగులు సైతం వాపోయారు. జగదీశ్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని, ఆయన నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని శిరీష అన్నారు.


విద్యుద్దీపాల వెలుగులలో ప్రకాశం బ్యారేజీ

సాగర్ గేట్లన్నీ తెరచుకున్నాయ్

- 26 గేట్లు ఎత్తి 2.74 లక్షల క్యూసెక్కులు విడుదల
- పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి పోటెత్తుతున్న వరద

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి), తాడేపల్లి టౌన్, కొల్లూరు, ఆగస్టు 8: వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకూ జలాశయాలన్నీ నిండుకుండలా మారాయి. శ్రీశైలం నుంచి భారీగా వరద కొనసాగుతుండడంతో గురువారం నాగార్జునసాగర్ జలాశయం అన్ని గేట్లూ తెరుచుకున్నాయి. డ్యాం 26 క్రస్ట్ గేట్లను తెరచి 2,74,065 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.40 అడుగలకు చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు 295.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాగర్ గేట్లన్నీ ఎత్తడంతో పై నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు పర్యాటకులు పోటెత్తారు.

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. సాగర్ నుంచి పులిచింతలకు వచ్చిన నీటిని దిగువకు వదులుతున్నారు. గురువారం పులిచింతల నుంచి 2.56 లక్షల క్యూసెక్కులు, కీసర వాగు నుంచి 54 వేల క్యూసెక్కు వరద ప్రకాశం బ్యారేజీకి చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ దినేశ్ తెలిపారు. బ్యారేజీలో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 7 అడుగులు, 10 గేట్లను 8 అడుగుల మేర ఎత్తి దిగువకు 2.96లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 13వేల 800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

లంక గ్రామాల్లో పంటలు మునక

కృష్ణానదికి వరద పోటెత్తింది. దీంతో ప్రకాశం బ్యారేజీ నుంచి సుమారు 2.96 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని అరవింద వారధి, గాజుల్లంక, పోతార్లంక, జువ్వలపాలెం పుష్కర ఘాట్‌లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చిన్నరేవులో వరద మెల్ల మెల్లగా పెరుగుతోంది. దీంతో గ్రామ పరిధిలోని పల్లపు ప్రాంతాల్లో వాణిజ్య పంటలు, ఇటుక బట్టీలు నీట మునిగాయి. ఈ ప్రవాహం దోనేపూడి కరకట్ట దిగువన ఉన్న పోతార్లంక లోలెవల్ చప్టాపై నుంచి వెళ్లే అవకాశాలు ఉండటంతో ఆ రహదారిపై రాకపోకలు నిలిపి వేయనున్నారు. గాజుల్లంక, పోతార్లంక మధ్యన కృష్ణానది అంచులు బలహీనంగా ఉండటంతో వరద నీరు పంట పొలాలను ముంచెత్తుతోంది. వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కులకు పైగా పెరిగితే రహదారులపై కూడా వరద నీరు ప్రవహించే సూచనలు కనిపిస్తున్నాయి. దీని వల్ల పలు లంక గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయి.

చురుగ్గా రుతుపవనాలు

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. అరేబియా సముద్రం, బంగాళాఖాతం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తుండడంతో గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. అనేకచోట్ల మేఘాలు ఆవరించడంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న నాలుగైదు రోజుల్లో వర్షాలు కురిసే వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది.

పోలవరం వద్ద పెరిగిన గోదావరి

పోలవరం, ఆగస్టు 8: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం గురువారం నాటికి కొద్దిగా పెరిగింది. ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,43,222 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు.


ఆహ్లాదభరితంగా ఎత్తిపోతల జలపాతం


ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను ఇంటిముందు ఆయన కుమార్తెలు

భగ్గుమన్న వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ కుటుంబ వివాదం

- తండ్రి ఇంటి ముందు కుమార్తెల నిరసన
- మరో మహిళతో ఎలా ఉంటున్నారని ప్రశ్న
- గేట్లు వేసుకుని ఇంట్లోనే ఉన్న శ్రీనివాస్

శ్రీకాకుళం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి)/టెక్కలి/మెళియాపుట్టి: వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వివాదం రచ్చకెక్కింది. గురువారం రాత్రి ఆయన ఇంటి ముందు కుమార్తెలు నిరసనకు దిగారు. తమ తండ్రి బయటకు రావాలంటూ మౌనపోరాటానికి దిగారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ, జనసేన నాయకులపై మితిమీరిన నోటిదురుసుతో విమర్శలు చేసిన దువ్వాడ శ్రీనును మరింతగా ప్రోత్సహించేందుకు ఎమ్మెల్సీ పదవిని జగన్ కట్టబెట్టారు. ఆతర్వాత టెక్కలి అసెంబ్లీ సీటు ఇచ్చి ప్రచారం కూడా నిర్వహించారు. ఓ దఫా జడ్పీటీసీగా గెలుపొందారు. ఆతర్వాత పలుపార్టీలు మారినా అన్నిచోట్లా ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో టెక్కలి నుంచి అచ్చెన్నాయుడుపై పోటీచేసి భారీ తేడాతో ఓడిపోయారు. ఎన్నికలకు ఏడాది ముందు దువ్వాడ శ్రీను కుటుంబ వివాదాలు బయటపడ్డాయి. మూలపేటలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి.. టెక్కలి అసెంబ్లీ సీటును దువ్వాడ శ్రీనుకే ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆతర్వాత కొద్దిరోజుల్లోనే దువ్వాడ శ్రీను సతీమణి దువ్వాడ వాణి కొంతమందిని వెంటబెట్టుకుని జగన్‌ను కలిశారు. ఆతర్వాత పరిణామాలతో టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా దువ్వాడ వాణిని నియమించారు. ఆతర్వాత మళ్లీ టెక్కలి సీటును శ్రీనుకు కేటాయించడంతో తాను ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తున్నట్లు వాణి ప్రకటించారు. దీంతో కంగుతిన్న వైసీపీ నాయకులు వైవీ సుబ్బారెడ్డితోపాటు మరికొంతమంది నచ్చజెప్పి.. కుటుంబ వ్యవహారాలను కొంతమేర 'సెటిల్' చేశారు. అప్పట్లో అంతర్గత ఒప్పందానికి శ్రీను కట్టుబడినట్లు సమాచారం. అయితే కొన్నాళ్ల కిందట దువ్వాడ శ్రీను అక్కవరం వద్ద ఇంటిని నిర్మించుకున్నారు. అక్కడ మరో మహిళతో కలసి ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దువ్వాడ శ్రీను-వాణికి హైందవి, నవీన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల శ్రీను మరో మహిళతో ఉంటుండటంతో తమ సంగతేమిటో తేల్చాలంటూ కుమార్తెలు గురువారం రాత్రి ఆందోళన నిర్వహించారు. దువ్వాడ శ్రీను ఇంటి ముందే కుమార్తెలు కారులో కూర్చుని చాలాసేపు ఉన్నారు. బయటి నుంచి పిలిచినప్పటికీ సిబ్బంది గేటు తీయలేదు. దువ్వాడ కుటుంబంలో చాన్నాళ్ల నుంచి వివాదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నా.. తాజాగా అవి బయటపడ్డాయి. కుమార్తెలు అక్కడే విలేకరులతో మాట్లాడుతూ.. తమ తల్లిదండ్రులకు చట్టపరంగా విడాకులు కాలేదని తెలిపారు.

తిరుపతిలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ల అభివృద్ధి

- రాష్ట్రానికి ఐటీ కంపెనీలను రప్పించేందుకు కృషి
- యువతలో నైపుణ్యాలు మెరుగుపర్చి ఉపాధికి దోహదం: లోకేశ్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ క్లస్టర్లను అభివృద్ధి చేయడంతోపాటు విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలో ఐటీ కంపెనీలను స్థాపించేలా దేశంలోని టాప్-10 పారిశ్రామికవేత్తలతో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై గురువారం ఆయన ఉండవల్లిలోని నివాసంలో అధికారులతో సమీక్షించారు. పెట్టుబడిదారులను ఆకర్షించడం, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రియల్ టైం గవర్నెన్స్‌ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని సూచించారు. ఇన్నోవేషన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు అందించి స్టార్టప్‌లకు అవసరమైన ఎకో సిస్టమ్‌ను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఏపీటీఎస్ ఎండీ రమణారెడ్డి, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ డి.వెంకటాచలం, ఐటీ సంయుక్త కార్యదర్శి సూర్జిత్‌సింగ్ తదితరులు సమీక్షకు హాజరయ్యారు.

నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం:లోకేశ్

యువతలోని నైపుణ్యాలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే లక్ష్యంతో దేశంలోనే తొలిసారి


ఐటీ విభాగం సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్

రాష్ట్రంలో నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టామని మంత్రి లోకేశ్ తెలిపారు. విధివిధానాల రూపకల్పనపై సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. నైపుణ్య గణనను తొలుత ఒక నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా గణన చేపడతామని చెప్పారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని, అనంతరం యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ప్రఖ్యాత సంస్థల ద్వారా సర్టిఫికెట్లు కూడా ఇస్తారన్నారు. నౌకరీ, లింక్డ్ ఇన్ లాంటి ఉద్యోగ వెబ్‌సైట్లలో ప్రాధాన్యం లభించేందుకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. గణనలో మెరుగైన సమాచారం కోసం అవసరమైతే ఏఐని ఉపయోగించుకోవాలని, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, యువతను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఉన్నతాధికారులు సౌరభ్ గౌర్, జి.గణేశ్‌కుమార్, దినేశ్‌కుమార్, శ్రీనివాసులు, క్రాంతి పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి డోలా, పనబాక లక్ష్మి తదితరులు

ప్రతి ఫిర్యాదుకూ పరిష్కార మార్గం

- అర్జీదారులకు మంత్రుల హామీ.. టీడీపీ ఆఫీసుకు ఫిర్యాదుల వెల్లువ

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ బాధితులతో పాటు ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకూ పరిష్కార మార్గం చూపుతామని మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మీ కోసం కార్యక్రమానికి 100కు పైగా అర్జీలు వచ్చాయి. వైసీపీ బాధితుల నుంచి భూ సమస్యలు, శాంతిభద్రతల సమస్యలపై అధికంగా ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదిదారుల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రులు మాట్లాడుతూ... ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరిస్తామని చెప్పారు. కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అక్కడికక్కడే పరిష్కరించారు. మాచర్ల నియోజకవర్గానికి చెందిన బత్తుల లక్ష్మి తన 33సెంట్ల స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరులు కబ్జాచేశారని ఫిర్యాదు చేశారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

- హైకోర్టుకు బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి
- విచారణ ఈ నెల 12వ తేదీకి వాయిదా

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): లీజు గడువు ముగియకముందే మద్యం షాపును బలవంతంగా ఖాళీ చేయించి తనకు 50 లక్షలు నష్టం వచ్చేలా చేశారని పేర్కొంటూ విజయవాడకు చెందిన వై.వెంకటేశ్వరరావు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. షాపు ఖాళీ చేయించడం వెనుక బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి పాత్ర ఉందని ఆ కేసులో పేర్కొన్నారు. అయితే ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.నగేష్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారు ఆరోపణలతో వాసుదేవరెడ్డికి సంబంధం లేదన్నారు. బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా ఉండడంవల్ల ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఐడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్‌పై మొత్తం 4కేసులు నమోదయ్యాయని వివరించారు. పిటిషనర్‌కు గతంలో ఓ కేసులో సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇచ్చారన్నారు. వాటిని అనుసరించి పిటిషనర్ పోలీసుల ముందు హాజరు కాలేదన్నారు. అరెస్ట్ చేస్తామనే ఆందోళన అవసరం లేదన్నారు. విచారణను సోమవారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ విచారణను ఈ నెల 12కి వాయిదా వేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.




బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

24, 25న సౌత్‌కాన్ 2024

● హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

లబ్బీపేట/పాయకాపురం: కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25న సౌత్‌కాన్-2024 సదస్సు నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ జాతీయ కార్యదర్శి జి.రామ్‌రెడ్డి తెలిపారు. బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని అయాన్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సదస్సును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అనేక మంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ విజ్ఞానాన్ని, సలహాలు, సూచనలు అందించడం, నిర్మాణాత్మక చర్చలను నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో టెక్నాలజీ షేరింగ్ కి ఈసదస్సు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో టెక్నాలజీ షేరింగ్‌కి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. 5 రాష్ట్రాల నుంచి 700 మంది ప్రతినిధులు సౌత్‌కాన్ 2024కు హాజరవనున్నారన్నారు. జేఎల్‌ఎల్ అనే మల్టీనేషనల్ కంపెని ఆంధ్రప్రదేశ్‌పై ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరమని, 24న ప్రారంభమయ్యే సౌత్‌కాన్‌లో సీఎం చంద్రబాబు నాయుడు ఈ శ్వేతపత్రాన్ని విడుదల చేస్తారన్నారు. క్రెడాయ్ ఏపీ సెక్రటరీ బాయన శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు నగరాలు పెద్ద మెగాసిటీ కాబోతున్నాయని బిల్డర్స్, కస్టమర్లకు ఇది పెద్ద అవకాశమన్నారు. జాయింట్ కన్వీనర్ బి.రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సౌత్‌కాన్ 2024లో ఆర్కిటెక్చర్, డెవలప్‌మెంట్ వంటి 64 అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సౌత్‌కాన్-2024 బ్రోచర్‌ను క్రెడాయ్ ప్రతినిధులు అవిష్కరించారు. ఈ సమావేశంలో ఏపీ ప్రెసిడెంట్ వై.వి.రమణరావు, సౌత్‌కాన్ కన్వీనర్ డి.రాంబాబు, క్రెడాయ్ సభ్యులు పాల్గొన్నారు.


సుజనా చౌదరికి స్వీట్ తినిపిస్తున్న ఏలీషా మాదిగ

సుజనాకు ఎమ్మార్పీఎస్ నేతల కృతజ్ఞతలు

ధర్నాచౌక్, ఆగస్టు 8: సామాజిక దృక్పథంతో అనేక సందర్భాల్లో తమ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పేరెల్లి ఏలీషా మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో కలిసి స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్ల అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఏలీషా మాట్లాడుతూ ఈ నెల 13న కృష్ణమాదిగ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రానుండటంతో స్వాగత ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నేతలు లక్షలాది మంది హైదరాబాద్‌కు తరలివచ్చేలా కృషి చేయాలన్నారు. ధర్మనపు శ్రీనివాస్, మంద వెంకటేశ్వరరావు మాదిగ, కోటా దానియేలు మాదిగ, ఇసుకపల్లి చంటి, దేవులూరియ టోని పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకర్ తదితరులు

27 నుంచి ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర

● సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

ధర్నాచౌక్, ఆగస్టు 8: మరో ఉద్దానంగా మారకముందే తిరువూరు నియోజకవర్గంలోని ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ బాధితులను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడెక్కుతున్న ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఎ.కొండూరు నుంచి నగరంలోని కలెక్టర్ కార్యాలయం వరకు ప్రజాఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర చేపడుతున్నట్టు చెప్పారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక దాసరిభవన్‌లో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కిడ్నీ బాధితులకు కృష్ణాజలాలు సరఫరా చేయాలన్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించాలన్నారు. ఐదేళ్లలో ఆయాప్రాంతాల్లో 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారన్నారు. వందలాది మంది ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, సీపీఐ నేత బుడ్డి రమేష్, రైతు సంఘం నేతలు యలమందరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న కేవీపీఎస్, విద్యార్థి సంఘాల నేతలు

ఎస్సీ జనాభాకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

మొగల్రాజపురం, ఆగస్టు 8: దేశంలో షెడ్యూల్డ్ కులాలు ఎదుర్కొంటున్న సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి జనాభా ప్రాతిపదికన కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మొగల్రాజపురం ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాలు వద్ద దళిత సంఘాలు, కార్మిక సంఘాలు, కులవివక్ష పోరాట సమితి (కేవీపీఎస్), విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి సరైన కేటాయింపులు, నిధుల వినియోగం ఉండేలా సబ్ ప్లాన్ చట్టాన్ని రూపొందించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేతలు జి.కళ్యాణ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నటరాజు, క్రాంతికుమార్, చింతల శ్రీనివాస్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రామన్న, నేతలు పరసా కిరణ్, అంటోని, రారాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వీఎంసీ కమిషనర్‌ను కలిసిన వెలగా జోషి


విజయవాడ కల్చరల్: నగర మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్రను గురువారం వెలగా జోషి మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రపంచ మేధావుల చిత్రపటాన్ని కమిషనర్‌కు బహూకరించి దుశ్శాలువాతో సత్కరించారు.


ధ్యానచంద్రకు చిత్రపటాన్ని అందజేస్తున్న వెలగా జోషి

పోలీసుల శ్రమ దోపిడీ!

ఒకప్పుడు 'బతకలేక బడిపంతులు' అనేవారు. ఇప్పుడు మాత్రం 'చచ్చినా పోలీసు శాఖలోకి రాకూడదంటున్నారు' ప్రస్తుత సిబ్బంది. వెట్టిచాకిరికి కేరాఫ్ అడ్రస్‌గా పోలీసు శాఖ మారిందంటే అతిశయోక్తి కాదంటున్నారు. శ్రమదోపిడీకి గురవుతున్నా ఉద్యోగం కోసం మారుమాట్లాడకుండా అన్నీ దిగమింగుకొని పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడేళ్లలో రిటైరయ్యే పీసీ, హెచ్‌సీ, ఏఎస్‌ఐలు రెండు షిఫ్టుల డ్యూటీలు చేయలేక ఎప్పుడు రిటైర్ అవుతామా అని ఎదురుచూస్తున్నారు.

- వెట్టిచాకిరికి మరోపేరు పోలీసు శాఖ
- కాగితాలపైనే మూడు.. చేసేది రెండు షిఫ్టులు
- రెస్ట్ లేక రోగాల పాలవుతున్న సిబ్బంది
- 6 నెలల నుంచి టీఏలు లేక ఇబ్బందులు
- పెండింగ్‌లో రెండు సరెండర్ లీవ్‌ల నగదు
- జీపీఎఫ్ లోన్లు పెట్టుకొన్నా అతీగతీ లేదు
- 20వ తేదీ దాటితే రక్షక్ వాహనాల ఆయిల్ కోసం ఇండెంట్లు
- అదేబాటలో బ్లూకోట్స్ వాహనాలు
- రక్షక్ వాహనాల టైర్లు, బ్యాటరీలు పాడైనా పట్టించుకొనే వారులేరు
- ఐదేళ్లకు పైగా స్టేషన్లలో పాతుకుపోయిన సిబ్బంది
- ఇదీ నగరంలోని పోలీస్ స్టేషన్ల దుస్థితి



విజయవాడ లీగల్: గతంలో 58 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు రిటైర్‌మెంట్ వయస్సును పెంచితే సంతోషించామని, కానీ ఇప్పుడు ఎందుకు పెంచారా అని బాధపడుతున్నామన్నారు. కారణం రెస్ట్ లేకుండా రెండు షిఫ్టుల డ్యూటీ చేయలేకపోతున్నామని వాపోతున్నారు.

కాగితాలపైనే మూడు షిఫ్టులు..

అధికారుల కాగితాలపైనే సిబ్బంది మూడు షిఫ్టులు చేస్తున్నట్టు చూపిస్తున్నప్పటికీ వేసేది రెండు షిఫ్టులని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు షిఫ్టులంటే ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చేసిన వ్యక్తి మళ్లీ రాత్రి 9 నుంచి మరుసటి ఉదయం 7 గంటల వరకు డ్యూటీ చేయాలి. అదేరోజు మధ్యాహ్నం 1 గంటకు డ్యూటీ ఎక్కి రాత్రి 9 గంటలకు డ్యూటీ చేయాలి. ఇదీ రెండు షిఫ్టుల పద్ధతి. దీని ప్రకారం నెలలో ఒక్కొక్కరు 15 నైట్ డ్యూటీలు చేయాల్సి వస్తుంది. దీంతో తమకు రెస్ట్ దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక స్వంత పనులు చూసుకొనే వీ లేలేదని వాపోతున్నారు. అదే మూడు షిఫ్టుల డ్యూటీ అయితే ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డ్యూటీ చేసిన వ్యక్తి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు డ్యూటీ ఎక్కి ఉదయం 7 వరకు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. తిరిగి అదేరోజు మధ్యాహ్నం 1 గంటకు డ్యూటీ ఎక్కి రాత్రి 9 వరకు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఒక్కొక్కరు 10 నైట్‌డ్యూటీలు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల సిబ్బందికి రెస్ట్ దొరకడంతో పాటు ఆస్పత్రుల పాలయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

పాతుకుపోయిన సిబ్బంది 'చేతివాటం'

ఇకపోతే చాలా పోలీసు స్టేషన్లలో ఐదేళ్లు దాటి పని చేస్తున్న సీనియర్ హెచ్‌సీ, ఏఎస్‌ఐ స్థాయి సిబ్బంది చాలా మందే ఉన్నారు. వీరు అక్కడే పాతుకుపోయి ఉండటంతో వారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐదారు నెలల నుంచి సిబ్బంది టీఏ (ట్రావెలింగ్ అలవెన్స్) కూడా ఇవ్వడం లేదని, రెండు సరెండర్ లీవుల నగదు రావాల్సి ఉందని, సర్వీసును బట్టి ఒక్కొక్కరికి దాదాపు రూ.10 నుంచి రూ.30 వేలకు పైబడి రావాల్సి ఉందంటున్నారు. జీపీఎఫ్ లోన్లు పెట్టుకొన్నా అతీగతీ లేదని ఆందోళన చెందుతున్నారు.

20వ తేదీ దాటితే రక్షక్‌లకు ఇంధనం నిల్

ప్రతి నెలా 20వ తేదీ దాటితే రక్షక్ వాహనాలకు ఆయిల్ ఉండటంలేదని, దీంతో తమ జేబుకు చిల్లు పడటమో, లేదా ఎవరికైనా ఇండెంట్ వేయడమో జరుగుతుందని ఆరోపిస్తున్నారు. ఒక్కో రక్షక్‌కు నెలకు 120 లీటర్ల డీజిల్ ఇస్తున్నారు. పాత వాహనాలు కావడంతో మైలేజీ రాక, కోటా ఆయిల్ 20లోపు అయిపోవడంతో ఎవరో ఒకరిపై ఆధారపడి వాహనాలు నడిపిస్తున్నారు. ఇకపోతే టైర్లు పాడైనా, బ్యాటరీలు పాడైనా పట్టించుకొనే నాథుడు లేక ఆ భారం తమపైనే పడుతోందని గగ్గోలు పెడుతున్నారు. ఇదే బాటలో బ్లూకోట్స్ వాహనాల పరిస్థితి ఉందని తెలుస్తోంది. వారికి నెలకు 30 లీటర్ల పెట్రోలు ఇస్తున్నప్పటికీ సరిపోక, కొన్ని వాహనాలు రిపేర్లతో మూలన పడ్డాయని, మరికొన్నింటిని ప్రజలపై ఇండెంట్ వేసి నడిపిస్తున్నట్టు సమాచారం. కనీసం ఇంజినాయిల్ మార్చాలన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మహిళా పోలీసులు నడిపే దిశ వాహనాలు పరిస్థితీ అలానే ఉండటంతో అవీ మూలనపడ్డాయి. కొత్త పోలీసు కమిషనర్.. పై సమస్యలన్నింటినీ కూలంకుషంగా ఆలోచించి తగు నిర్ణయం తీసుకొని సమస్యలను పరిష్కరించేలా ఆలోచించాలని పోలీసులు కోరుతున్నారు.

ఘనంగా దక్షిణామూర్తికి పూజలు


దక్షిణామూర్తికి పూజ అనంతరం హారతి అందుకుంటున్న ఈవో రామారావు

వన్‌టౌన్, ఆగస్టు 8: మల్లేశ్వరాలయ ప్రాంగణంలో దక్షిణామూర్తి విగ్రహానికి గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సంపత్తిని కలుగజేయాలని, ఆయురారోగ్యాలు, సుఖ శాంతులు కలుగజేయాలని కోరుతూ సంకల్పం చెప్పి పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, హారతి సమర్పించారు. ఈవో పాల్గొని దక్షిణామూర్తిని సేవించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి ఏలూరు జిల్లా, కోట కలిదిండిలోని బంగ్లారోడ్‌కు చెందిన ఎం గంగాధరరావు, కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని ఈవో రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు. హైదరాబాద్ మోతీనగర్‌కు చెందిన టి.సత్యవతి నిత్యాన్నదానానికి రూ.1,01,116 అధికారుల ద్వారా దేవస్థానానికి అందజేశారు. అలాగే నగరంలోని విద్యాధరపురానికి చెందిన వి.వంశీ కృష్ణ రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం ఆయన ఆలయానికి విచ్చేసి ఈవో రామారావు ద్వారా దేవస్థానానికి విరాళం అందించారు. అమ్మవారి దర్శనానంతరం దాతలకు శేషవస్త్రం, ఆశీస్సులు, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

995 గ్రాముల వెండి ప్లేట్ కానుక

నగరంలోని మారుతీనగర్‌కు చెందిన డి.సుదర్శనరావు, కుటుంబ సభ్యులు గురువారం ఆలయానికి విచ్చేసి దేవస్థానానికి 995 గ్రాముల బరువున్న వెండి ప్లేట్‌ను ఏఈవో వెంకట రెడ్డి ద్వారా దేవస్థానానికి అందించారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం అందజేశారు.

ధర్మపథం వేదికపై ఆంధ్రనాట్య ప్రదర్శన

దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడ నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ బృందం ఆంధ్రనాట్య ప్రదర్శన చేసింది. చక్కని హావభావాలతో లయకు అనుగుణంగా నాట్యం చేసి ఆహూతుల హర్షధ్వానాలు అందుకున్నారు.


ధర్మపథం వేదికపై ఆంధ్ర నాట్యప్రదర్శన చేస్తున్న కళాకారులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి సుబ్బారావు, సునీల్‌కుమార్, స్ఫూర్తి శ్రీనివాస్ తదితరులు

చిన్నారుల మానసికోల్లాసానికి చిత్రలేఖనం దోహదం

విజయవాడ కల్చరల్, ఆగస్టు 8: చిన్నారులు మానసికోల్లాసానికి చిత్రలేఖనం ఎంతో దోహదం చేస్తుందని జిల్లా విద్యాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారుల్లో దాగిన సృజనాత్మక శక్తిని వెలికి తీసి మన భారతదేశపు సంస్కృతీ సంప్రదాయాలను తెలియపర్చాలనే ఉద్దేశంతో నగరానికి చెందిన ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రీ క్రియేట్ త్రీడీ లైఫ్ కాస్టింగ్ సమర్పణలో చిత్రలేఖరి పోటీలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టరును గురువారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఎంబీవీకే విజ్ఞానకేంద్రంలో 1వ తరగతి నుంచి పీజీ చదువుతున్న విద్యార్థుల వరకు జయహో భారత్.. ప్రౌడ్ టూ బీ ఇండియన్ ఆర్ట్ కాంటెస్ట్ పేరిట పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ అధ్యక్షుడు సునీల్‌కుమార్ అనుమకొండ, ప్రధాన కార్యదర్శి స్ఫూర్తి శ్రీనివాస్, రీ క్రియేట్ త్రీడీ లైఫ్ కాస్టింగ్ సంస్థ అధినేత పలగాని అఖిల ప్రీతి, జామవా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఉపాధ్యక్షుడు గిరిధర్ అసరవల్లి, మహిళా విభాగం ఇన్‌చార్జి సంధ్యారాణి, వర్కింగ్ కమిటీ మెంబర్స్ లలితా సౌజన్య, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

గొల్లపూడి మార్కెట్ ప్రహరీగోడ కూల్చివేత

● స్థల యజమాని, బిల్డర్‌కు అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ కమిటీ సభ్యుల ఆరోపణ

గొల్లపూడి, వన్‌టౌన్, ఆగస్టు 8: స్థానిక మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్ ప్రహరీగోడను గ్రామ పంచాయతీ అధికారులు రాత్రికిరాత్రే కూల్చివేశారు. ప్రహరీగోడ పక్కన ప్రైవేటు స్థలంలో ఓ బిల్డర్ నూతనంగా నిర్మిస్తున్న భవనానికి రహదారి ఏర్పాటు నిమిత్తం ఆ స్థలం యజమానితో పంచాయతీ అధికారులు కుమ్మక్కైయ్యారని మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్, సెక్రటరీ పరుచూరి నాగేశ్వరరావు, కాసుల నారాయణ ఆరోపిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రానికి వ్యాపార కేంద్రంగా ఉన్న వన్‌టౌన్‌లో రవాణా రాకపోకలకు రద్దీగా మారిన దృష్ట్యా 1997లో నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గొల్లపూడి మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్‌లో సుమారు 500 షాపులు ఏర్పాటు చేశారు. దీనిపై ఆధారపడి వేలాది మంది కార్మికులు జీవిస్తున్నారు. ఈ క్రమంలో షాపు నెం.39 వద్ద ఉన్న ప్రహరీగోడ అవతల వైపు ఓ వ్యాపారికి 2,400 గజాలు ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని గొల్లపూడికి చెందిన బిల్డర్ చిగురుపాటి నాగరాజు డెవలప్‌మెంట్ నిమిత్తం సుమారు 8ఏళ్ల క్రితం తీసుకుని భారీగా బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు. ఆ బిల్డింగ్‌కు మార్కెట్ ప్రాంగణంలో నుంచి దారివ్వాలంటూ స్థల యజమాని, బిల్డర్ మార్కెట్ కమిటీపై ఒత్తిడి చేస్తున్నారు. మార్కెట్ భద్రత నిమిత్తం దారివ్వటం కుదరదని మార్కెట్ కమిటీ తేల్చి చెప్పింది. ఈ వ్యవహారం గొల్లపూడి గ్రామ పంచాయతీ దృష్టికి వెళ్లింది. మార్కెట్ కమిటీ పెద్దలు, గ్రామ పంచాయతీ అధికారుల సమక్షంలో ఆ భవనానికి మార్కెట్‌లో నుంచి రహదారి ఇచ్చేందుకు ఒప్పందం రాసుకున్నారు. మళ్లీ గత నెల నుంచి 2వ రహదారి కావాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. మార్కెట్ కమిటీ కుదరదని తేల్చి చెప్పింది. ఈ వ్యవహారాన్ని మార్కెట్ కమిటీ స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దృష్టికి తీసుకువెళ్లారు. ఇరువర్గాలకు ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో గొల్లపూడి పంచాయతీ అధికారులు స్థలం యజమాని, బిల్డర్‌తో కుమ్మక్కై బుధవారం అర్ధరాత్రి ప్రహరీగోడను కూల్చివేసి రహదారి నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న మార్కెట్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, సెక్రటరీ కాసుల నారాయణ, ఉపాధ్యక్షుడు-1 వెలగపూడి శంకర్‌బాబు, ట్రెజరర్ నంబూరి సాంబశివరావు, ఉపాధ్యక్షుడు-2 ప్రసాద్ కూల్చివేసిన ప్రదేశం వద్దకు వెళ్లి పరిశీలించి దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థలం యజమాని, బిల్డర్ కావాలనే రాత్రికి రాత్రి పంచాయతీ అధికారులతో కలిసి ప్రహరీగోడ కూల్చివేశారని ఆరోపించారు.


ప్రహరీగోడ కూల్చివేసి నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌కు రహదారి ఏర్పాటు చేసిన అధికారులు

అవగాహనతోనే గ్రామాల సమగ్రాభివృద్ధి: ఏపీఎస్‌ఆర్‌డీసీ జేడీ

ఉంగుటూరు, ఆగస్టు 8: ప్రభుత్వ కార్యక్రమాలు, చట్టాలపై సర్పంచ్‌లు, పంచాయతీకార్యదర్శులు అవగాహన పెంచుకుని, గ్రామాల సమగ్రాభివృద్ధికి బాటలు వేయాలని ఏపీఎస్‌ఆర్‌డీసీ జిల్లా జాయింట్ డైరెక్టర్ కేవీ.వరప్రసాద్ తెలిపారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు మండల స్థాయిలో నిర్వహించే 3 రోజుల శిక్షణా తరగతులు స్థానిక స్త్రీశక్తి భవనం మీటింగ్‌హాలులో ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన వరప్రసాద్ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రజాప్రతినిధులకు, సెక్రటరీలకు పలు సూచనలు చేశారు. పంచాయతీ అభివృద్ధి పనులపై నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపట్ల దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో ఈ మహేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎం.అమీర్‌బాషా, సూపరింటెండెంట్ ఎన్.బసవయ్య, ఏపీఎస్‌ఆర్‌డీసీ ప్రతినిధులు, సర్పంచ్‌లు, గ్రేడ్-1, గ్రేడ్-5 సెక్రటరీలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి విజన్‌తో పనిచేయాలి: గుడివాడ డీఎల్పీవో

హనుమాన్‌జంక్షన్: ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధి విజన్‌తో పనిచేసినపుడే మంచి ఫలితాలు వస్తాయని గుడివాడ డీఎల్పీవో సంపత్‌కుమారి అన్నారు. బాపులపాడు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన గ్రామ ప్రణాళిపై మూడు రోజులు శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమైంది. డీఎల్పీవో సంపత్‌కుమారి పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో అశోక్‌కుమార్ ఉపాధి పనులు, వేతనాలు, పనికల్పన విషయాలపై అవగాహన కల్పించారు. బాపులపాడు పీహెచ్‌సీ సీహెచ్‌వో అప్పారావు పీహెచ్‌సీలో నిర్వహించే వైద్య సేవలు, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు నగరంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం

వన్‌టౌన్: స్థానిక తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి భద్రతా ఏర్పాట్లపై గురువారం కళాక్షేత్రంలో పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, కలెక్టర్ డి.సృజన, తదితర అధికారులు పరిశీలించారు. వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రముఖులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకూడదన్నారు. డీసీపీలు గౌతమీశాలి, ఏబీటీఎస్ ఉదయరాణి, కె.చక్రవర్తి, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఏడీసీ వీడీ ప్రసాద్, ఏసీపీలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబును కలిసిన ఢిల్లీరావు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గురువారం వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు ఆయనను కలిసి మొక్కను అందజేశారు.


మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● మంత్రి నారాయణకు టీఎన్‌టీయూసీ వినతి

అజిత్‌సింగ్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెహికల్ డిపోల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను కోరారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్‌టీయూసీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, వెహికల్ డిపోలోని డ్రైవర్లు, మెకానిక్‌ల జీతాలను పెంచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



బాడీ బిల్డర్ వరప్రసాద్‌కు ఏడీఆర్ఎం అడ్విన్ అభినందన

రైల్వే స్టేషన్: పాలకొల్లులో జరిగిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్‌లో పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన రైల్వే పర్సనల్ ట్రైనర్ టి.వరప్రసాద్‌ను గురువారం పీఈ అడ్విన్ అభినందించారు. తన చాంబర్‌లో ఆయన్ను సత్కరించారు. వరప్రసాద్ సాధించిన అద్భుతమైన ఫీట్‌ను కొనియాడారు. క్రీడల పట్ల అతడికున్న ఆసక్తి, నిబద్ధతలను ప్రశంసించారు. అతడి జీవనశైలిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

11న స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఉచిత వైద్యశిబిరం

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గుడివాడ ఈవీఆర్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంతో ఈనెల 11న ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఉదయం 8గంటలకు ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారని, గౌరవ అతిథిగా కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొంటారన్నారు. ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ ఈదుపుగంటి శ్రీనివాస్ బృందం నేతృత్వంలో గుండె, మెదడు, నరాలు, క్యాన్సర్, ఎముకలు, కీళ్లు, సాధారణ జబ్బులు, స్త్రీప్రసూతి సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యలకు వైద్యసేవలతోపాటు, వారం రోజులకు సరిపడా మందులు ఉచితంగా అందజేయబడతాయన్నారు. కంటిపరీక్షలు, దంతపరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 95050 12312లో సంప్రదించాలన్నారు.



ఒంగోలులో రాజీవ్ గృహకల్ప పరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జనార్దన్

ఉన్నదంతా దోచేసి, ఖాళీ ఖజానా ఇచ్చిన వైసీపీ!

▸ సంక్షేమం, అభివృద్ధిలో వెనుకడుగు వేయం: మంత్రి నారాయణ

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 8: 'గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని దోచేసి, ఖజానాను ఖాళీ చేసింది. రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళుతున్నారు' అని పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. గురువారం ఒంగోలు విచ్చేసిన మంత్రి నారాయణ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి కొప్పోలు రోడ్డులోని రాజీవ్ గృహకల్పలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్లు, డ్రైన్లు లేకపోవడాన్ని పరిశీలించారు. వైసీపీ హయాంలో పట్టణాల అభివృద్ధి కోసం ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నిధులు, కేంద్రం మంజూరుచేసిన నిధులు సుమారు రూ.1,900 కోట్లు దోచేశారని, అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు మరో వెయ్యి కోట్లు స్వాహా చేశారని నారాయణ ఆరోపించారు. ఒంగోలులోని రాజీవ్ గృహకల్పలో రోడ్లు, డ్రైన్ల కోసం రూ.2.38 కోట్లతో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తిచేస్తామని, ఆ తర్వాత ఎన్టీఆర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఇతర శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

కూటమి ప్రభుత్వంపై విజయసాయి విమర్శ

▸ ఎంపీని అడ్డుకున్న రాజ్యసభ ప్యానెల్ చైర్మన్

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ 36 మందిని హత్య చేశారంటూ ఫైనాన్స్ బిల్లు పై చర్చ సందర్భంగా రాజ్యసభలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శలు చేశారు. ప్యానెల్ చైర్మన్‌గా ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాజీవ్ శుక్లా ఆయనను అడ్డుకున్నారు. 'బడ్జెట్‌పై చర్చలో ఈ విషయం ఎందుకు ప్రస్తావిస్తున్నారు?' అని నిలదీశారు. దీంతో విజయసాయి తన ఉపన్యాసాన్ని ముగించారు. తమ వారిపై దాడులు చేసిన వారికి మళ్లీ అదే గతి పడుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని అదుపులో ఉంచడం కోసం హోం శాఖకు నిధులు పెంచాలని కోరారు. పోలవరం కోసం ఎలాంటి నిధులు కేటాయించకుండా ఆ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

బంగ్లా హిందువుల్ని కాపాడుకోవాలి: వల్లూరు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హింసాత్మక నిరసనలతో అట్టుడుకుతోన్న బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులను కాపాడు కోవడం భారత్‌లోని ప్రతి హిందువు బాధ్యత అని జాతీయ లేబర్ బోర్డు చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ అన్నారు. మతానికి సంబంధంలేని నిరసనల్లో హిందూ ఆలయాలను మాత్రమే ఇస్లామిక్ వాదులు ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలు పిచ్చి పిచ్చిగా మాట్లాడటం వారికి మాత్రమే తెలిసిన సెక్యులరిజం అని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. పొరుగుదేశంలోని 27 జిల్లాల్లో గత ఐదు రోజులుగా జరిగిన దాడుల్లో వందలాది హిందూ గృహాలు, వ్యాపారాలు లూటీ అయ్యాయని.. అక్కడి హిందువులకు రక్షణ కల్పించాల్సిన అవసరం మన దేశానికి ఉందని, ఆ దిశగా అడుగులు వేయాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను అభివృద్ధి చేయండి

▸ ఆరోగ్య శాఖ కమిషనర్ హరికిరణ్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖ ఉద్యోగుల కోసం ఉపయోగిస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్ నిర్వహణ తీరు సరిగ్గా లేదని ఆరోగ్య శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏపీఐఐసీలో యాప్ పనితీరుపై ఆయన సమీక్షించారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవడం ద్వారా దీన్ని మరింతగా మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల కల్లా రాష్ట్రవ్యాప్తంగా క్యాడర్ వారీగా ఉద్యోగుల అటెండెన్స్ వివరాలను అందజేయాలని ఆదేశించారు. ఉద్యోగుల సార్వత్రిక గుర్తింపు సంఖ్య ఆధారంగా వివరాలు కనిపించేలా యాప్‌ను అప్డేట్ చేయాలని కోరారు.

బాలినేనికి ప్రాణహాని లేదు

▸ ఎస్ఆర్‌సీ నివేదికతోనే భద్రతను ఉపసంహరించాం

▸ హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ న్యాయవాది

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): భద్రతా సిబ్బందిని ఉపసంహరించడాన్ని సవాల్ చేస్తూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2 ప్లస్ 2 సెక్యూరిటీని పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్ సెక్యూరిటీకి సంబంధించి భద్రతా రివ్యూ కమిటీ(ఎస్ఆర్‌సీ) సమీక్షించింది. ఎలాంటి ప్రాణహాని లేదని నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే భద్రతను అధికారులు ఉపసంహరించారు. ప్రస్తుతం పిటిషనర్ ఎలాంటి హోదాలో లేరు' అని తెలిపారు. ఈ దశలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటూ పిటిషనర్ ఎస్ఆర్‌సీ నివేదికను సవాల్ చేశారా? అని ఆరా తీసింది. లేదని ప్రభుత్వ న్యాయవాది బదులివ్వడంతో.. 'పిటిషనర్‌కు భద్రత ఉపసంహరణపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలి. ఎస్ఆర్‌సీ నివేదికను పిటిషనర్‌కు అందజేయాలి' అని ప్రభుత్వాన్ని, అధికారులను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఎలాంటి నోటీసు ఇవ్వకుండా పిటిషనర్‌కు భద్రతను తొలగించారన్నారు. ఎస్ఆర్‌సీ నివేదికను తమకు అందజేయలేదన్నారు.

సొంత డబ్బుతో సెక్యూరిటీ పెట్టుకోవచ్చుగా!

▸ జగన్‌ను ప్రశ్నించిన మాజీ ఎంపీ చింతా మోహన్

అమరావతి, ధర్నాచౌక్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ల అధికారంలో ఉన్న ఒక కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించిందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలున్న జగన్ సొంతంగా సెక్యూరిటీని పెట్టుకోవచ్చు కదా! అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి తన సెక్యూరిటీ కోసం రూ.100 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. తమకెవరికీ సెక్యూరిటీ లేదని.. తాము బయట తిరగడం లేదా? అని అడిగారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్, చంద్రబాబు ఎంత ఖర్చు చేశారో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉద్యోగ ఆఫర్లతో గ్రాడ్యుయేట్లకు నాన్-ఇమిగ్రెంట్ వీసా

▸ జారీ ప్రకియను సులభతరం చేయనున్న అమెరికా

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అమెరికాలో గుర్తింపు పొందిన ఉన్నత విద్యాసంస్థల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి జాబ్ ఆఫర్ పొందిన విద్యార్థులు పని ఆధారిత నాన్-ఇమిగ్రెంట్ వీసాలు పొందడం సులభతరం కానుంది. నిర్దిష్ట దరఖాస్తులకు మినహాయింపులను ఎప్పుడు సిఫారసు చేయాలనే దానిపై జూలై 15న కాన్సులర్ అధికారులకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. వర్క్ వీసా జారీ ప్రక్రియను క్రమబద్ధీకరించడంతో పాటు వేగవంతం చేసే లక్ష్యంతో ఈ మార్పులు ప్రతిపాదించింది. కొత్త పథకం ప్రకారం అర్హులైన దరఖాస్తుదారులు నాన్-ఇమిగ్రెంట్ వీసాలను మరింత తర్వగా అందుకుంటారు. కొత్త ప్రతిపాదనలు అమలులోకి వస్తే పెద్దసంఖ్యలో గ్రాడ్యుయేట్లు ప్రయోజనం పొందుతారు.

కృష్ణానదిపై

'మూడు' ముచ్చట్లు!

రాజధాని నీటి కోసం 'వైకుంఠపురం'.. ప్రకాశం బ్యారేజ్ దిగువన నీటి నిల్వల కోసం 2 మినీ బ్యారేజ్‌లు

కృష్ణా నది పక్కనే ప్రవహిస్తున్నా సాగు, తాగునీటికి కటకట. ఒక్కోసారి రెండో పంటకు నీరు ఇవ్వలేని పరిస్థితి. పులిచింతల గేట్లు ఎత్తితేనే వేసవిలో జిల్లా ప్రజల గొంతు తడుస్తుంది. ఎల్‌నినో వంటి పరిస్థితులు వస్తే నాగార్జునసాగర్ నీటి కోసం కృష్ణా నది నిర్వహణ బోర్డును ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఇదీ రాజధాని అమరావతిని అనుకుని ఉన్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు ఎదుర్కొంటున్న ఇబ్బంది. వరదలు వచ్చినప్పుడు కృష్ణమ్మ నీరు కడలిలో వృథాగా కలిసిపోతోంది.

▸ వైకుంఠపురాన్ని వదిలేసిన వైసీపీ

▸ చోడవరం వద్ద బెలూన్ బ్యారేజ్ డిజైన్ చేసిన గత టీడీపీ ప్రభుత్వం

▸ దాన్ని కూడా పక్కన పెట్టిన జగన్

▸ మరో 2 మినీ బ్యారేజ్‌లకు ప్రతిపాదన

▸ ఏ ఒక్కటీ పూర్తి చేయని వైసీపీ ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

కృష్ణానది నుంచి వృథాగా పోతున్న నీటిని పొదుపు చేయడానికి, భవిష్యత్తులో నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని గత టీడీపీ ప్రభుత్వం రెండు ప్రణాళికలను సిద్ధం చేసింది. రాజధానిలో నీటి అవసరాల కోసం వైకుంఠపురం వద్ద ఒక బ్యారేజ్‌ని, ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువన చోడవరం వద్ద ఒక బెలూన్ బ్యారేజ్‌ని నిర్మించాలని తలపెట్టింది. ఈ రెండింటిని వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. చోడవరం వద్ద బ్యారేజీని నిర్మిస్తే విజయవాడ నగరం వైపు చల్లగాలులు వీయడంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం కృష్ణా నదిపై ఒకే ఒక్క బ్యారేజీ మాత్రమే ఉంది. అదే ప్రకాశం బ్యారేజ్. దీని పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. వరదలు వచ్చినప్పుడు బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేస్తే హంసలదీవి వద్ద సముద్రంలో కలుస్తోంది. ఒక్కో ఏడాది 300 నుంచి 400 టీఎంసీల నీరు వృథాగా పోతోంది. ఒక్కోసారి ఇది 1200 టీఎంసీలను దాటిన సందర్భాలు ఉన్నాయి. దీనికి చెక్ పెట్టడానికి గత టీడీపీ ప్రభుత్వం ప్రకాశం బ్యారేజ్‌కి దిగువన 2017లో కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరం వద్ద బెలూన్ బ్యారేజ్‌ను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి డీపీఆర్‌ను రూపొందించింది. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ ప్రణాళికను పక్కన పెట్టింది. ప్రకాశం బ్యారేజ్‌కి దిగువన 12 కిలోమీటర్ల దూరంలో పెనమలూరు మండలం చోడవరం వద్ద ఒక బ్యారేజ్‌ను, దీనికి దిగువన 60 కిలోమీటర్ల దూరంలో శ్రీకాకుళం వద్ద మరో బ్యారేజ్‌ను నిర్మించాలని భావించింది. ఐదేళ్ల కాలంలో రెండింటిలో ఒక్కదాన్నీ పూర్తి చేయలేదు. మినీ బ్యారేజ్‌ల ఒక్కోదాని నీటి సామర్థ్యం 4.05 టీఎంసీలు. కొత్తగా మినీ బ్యారేజ్‌లు అందుబాటులోకి వస్తే మొత్తం 11.17 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. రెండు మినీ బ్యారేజ్‌లకు ఒకేసారి ఆమోదం తెలపడంతో నిర్మాణం ఒకేసారి ప్రారంభమవుతుందని రైతులు, ప్రజలు భావించారు. తర్వాత రెండింటికి కాకుండా ఒక బ్యారేజ్ నిర్మాణానికి మాత్రమే పరిపాలన ఆమోదం ఇచ్చింది. చోడవరం వద్ద నిర్మించబోయే బ్యారేజ్‌ను పెండింగ్‌లో పెట్టి శ్రీకాకుళం వద్ద బ్యారేజ్‌ను తొలుత నిర్మించాలని భావించింది. శ్రీకాకుళం వద్ద సముద్రం ఆటుపోటుల సమయంలో నీరు సమీప గ్రామాల్లోకి చొచ్చుకు వస్తోంది. దీంతో ఇక్కడ భూగర్భ జలాల పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉన్నందున రెండో బ్యారేజ్ నిర్మాణం చేపట్టాలని వైసీపీ ప్రభుత్వం భావించినా ఒక్క అడుగు ముందుకు పడలేదు.

దిగువ ఇబ్బందులు ఎన్నెన్నో

ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతాన్ని మినహాయిస్తే దిగువన నదీ పరివాహక ప్రాంతంలో చుక్క నీరు ఉండడం లేదు. వరదలు వచ్చినప్పుడు ఈ ప్రాంతం నిండుకుండలా కనిపిస్తోంది. నదిలో నీరు నిరంతరం ప్రవహిస్తున్న దానికి, వరదలు వచ్చి ఆగిపోయినప్పటి పరిస్థితికి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. గ్రామాలకు సిగలో ఉన్నట్టుగా నది ప్రవహిస్తున్నా బోర్లు తవ్వినప్పుడు స్వచ్ఛమైన నీరు రావడం లేదు. పెనమలూరు మండలంలోని గ్రామాలను ఆనుకుని నది.. సముద్రం సరిహద్దు వరకు ప్రవహిస్తుంది. చోడవరం, ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బోర్లు తవ్వినప్పుడు వచ్చే జలాల్లో స్వచ్ఛత ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోపిదేవి, అవనిగడ్డ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిస్థితి మరోలా ఉంది. పోటు సమయంలో సముద్రపు నీరు నదిలోకి వచ్చి చేరుతుంది. ఇక అల్పపీడనాల సమయంలోనూ సముద్రపు నీరు రోజుల తరబడి నదిలో ఉంటోంది. ఈ కారణంగా ఆ పరిసర ప్రాంతాల్లోని భూములు చౌడు బారుతున్నాయి. ఇక్కడ ఏ ప్రదేశంలో బోర్లు వేసిన ఉప్పు నీరు తప్ప స్వచ్ఛమైన నీరు రావడం లేదు. ప్రకాశం, చోడవరం, మోపిదేవి బ్యారేజ్‌ల మధ్య ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేలా చేస్తే ఈ పరిస్థితులు మారతాయని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు.



రాజధానికి 'వైకుంఠం'

రాజధానిలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికి ప్రకాశం బ్యారేజ్‌కి ఎగువన, పులిచింతల ప్రాజెక్టుకు దిగువన వైకుంఠపురం వద్ద నదిపై ఒక బ్యారేజ్ నిర్మించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దానికి రూ.3,278.60 కోట్లను కేటాయించాలని నిర్ణయించింది. ప్రకాశం బ్యారేజ్‌కి 23 కిలోమీటర్ల ఎగువన, పులిచింతల ప్రాజెక్టుకు 60 కిలోమీటర్ల దిగువన వైకుంఠపురం వద్ద కొత్త బ్యారేజ్‌ను డిజైన్ చేశారు. దీని పొడవు 3.068 కిలోమీటర్లు. అన్నీ పరిశీలించిన తర్వాత ప్రభుత్వం వైకుంఠపురాన్ని ఎంపిక చేసింది. రాజధానికి నీటి వనరులను తరలించాలంటే ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా కెనాల్, గుంటూరు చానల్ మీదుగా మళ్లించాలి. దిగువ ప్రాంతం నుంచి ఎగువ ప్రాంతానికి తీసుకెళ్లడం కంటే ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి తరలించడం సులభంగా ఉంటుందని వైకుంఠపురం దగ్గర బ్యారేజీని ప్రతిపాదించారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజ్ ఎగువన పులిచింతల ప్రాజెక్టు ఉంది. దీని పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45 టీఎంసీలు. విజయవాడలో ఉన్న ప్రకాశం బ్యారేజ్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. ఈ రెండింటికీ మించి సుమారుగా 60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేలా వైకుంఠపురం బ్యారేజ్‌ను నిర్మించాలనుకున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. రాజధాని లేనప్పుడు వైకుంఠపురం బ్యారేజ్ ఎందుకన్నట్టుగా వదిలేసింది. కృష్ణా నదిపై వైకుంఠపురంతోపాటు ప్రకాశం బ్యారేజ్‌కి దిగువన రెండు మినీ బ్యారేజ్‌లను పూర్తిచేస్తే జీవనది విజయవాడ సిగలో ఉన్నట్టవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మాజీ ఎమ్మెల్సీ రఘురాజు వ్యాజ్యంలో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

▸ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

▸ విచారణ వచ్చే వారానికి వాయిదా

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ రఘురాజు దాఖలు చేసిన వ్యాజ్యం గురువారం హైకోర్టు ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న శాసనమండలి సెక్రెటరీ జనరల్, ట్రైబ్యునల్ చైర్మన్, మండలి చైర్మన్, విప్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి, శాసనవ్యవహారాల కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై అనర్హత వేటు వేస్తూ శాసన మండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ రఘురాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మండలి చైర్మన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. స్థానిక సంస్థల కోటా కింద తన స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంటూ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు రఘురాజు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయవద్దని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. గురువారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా ధర్మాసనం స్పందిస్తూ... ప్రస్తుతం అధికార పక్షంలోనే ఉన్నారు కదా..? పిటిషన్‌ను ఉపసంహరించుకొని, తిరిగి ఎన్నికల్లో పోటీ చేయవచ్చు కదా..? అని సరదాగా వ్యాఖ్యానించింది. రఘురాజు తరపు న్యాయవాది సార్వభౌమారావు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్‌పై అనర్హత వేటు వేసే విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించలేదన్నారు. అనర్హతపై దాఖలైన వ్యాజ్యాలను 8 వారాల్లో పరిష్కరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

పేకాట శిబిరంపై దాడి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 8: చిలకలపూడి పోలీసు స్టేషన్ పరిధిలో డబ్బును కాయిన్స్‌గా మార్చుకుని కాయిన్స్ వినియోగిస్తూ నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం మెరుపు దాడి చేశారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నారాయణపురానికి చెందిన రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి వెంకటేశ్వరరావు ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారన్నారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేశామని, వారి నుంచి రూ.47,500 నగదు, 9 బైక్‌లు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. డబ్బును కాయిన్స్ రూపంలో మార్చి పేకాట ఆడుతున్నారన్నారు. ఇలా ఈ పేకాటలో దొరికిన కాయిన్స్ విలువ రూ.5 లక్షలకు సమానమన్నారు. రెండు నెలలుగా కాయిన్స్ రూపంలో రాత్రీపగలు తేడా లేకుండా ఆడుతున్నారని, ఇంటిని క్లబ్‌లాగా మార్చేశారని డీఎస్పీ తెలిపారు. దాడిలో ఆర్‌పేట సీఐ సోమేశ్వరరావు, చిలకలపూడి సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

కుప్పకూలిన సుంకిశాల గోడ



▸ ధ్వంసమైన రెండో టన్నెల్ గేటు

▸ కూలిన ఇంటేక్ వెల్ రక్షణ గోడ

నాగార్జునసాగర్, హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8: అది నాగార్జున సాగర్ జలాశయానికి ఆనుకుని నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు! నిత్యం ఒక్కో షిఫ్టులో అక్కడ వంద మంది పని చేస్తూ ఉంటారు! ఈనెల రెండో తేదీన రాత్రి షిఫ్టు చేసిన కార్మికులు ఉదయం ఆరింటికి బయటకు వెళ్లారు! పగలు డ్యూటీ కార్మికులు ఇంకా లోపలికి రాలేదు! ఆ సమయంలో భారీ శబ్దం! టన్నెల్ గేటు, ఇన్‌టేక్ వెల్ రక్షణ గోడ ఒక్కసారిగా కుప్పకూలాయి. కళ్లు మూసి తెరిచేలోగానే ఇన్‌టేక్ వెల్ (భారీ సంపు) నీట మునిగింది! ఆ సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 50 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. సాగర్ జలాశయంలో నీటిమట్టం కనిష్ఠస్థాయికి దిగువన ఉన్నా.. జంటనగరాలకు తాగు నీటిని తరలించేందుకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేలా నిర్మిస్తున్నారు. 2022 మే 14న శంకుస్థాపన చేశారు. తొలుత, రూ.1,450 కోట్లతో మేఘా ఇంజనీరింగ్ వర్క్స్ ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత అంచనా వ్యయం రూ.2,215 కోట్లకు పెంచారు. ప్రాజెక్టులో భాగంగా ఇన్‌టేక్ వెల్ (భారీ సంపు), మూడేసి పంప్ హౌజ్‌లు, టన్నెళ్లు, పంప్ హౌజ్ సూపర్ స్ట్రక్చర్ నిర్మిస్తారు. నాటి నుంచి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈనెల ఒకటో తేదీన 2వ నంబర్ పంప్‌హౌజ్‌లో రక్షణ గోడ ఒక్కసారిగా కూలిపోయింది.

మూడు స్థాయుల్లో పంప్‌హౌజ్‌లు

జలాశయం నుంచి ఇన్‌టేక్ వెల్‌కు నీటిని తరలించడానికి మూడు పంప్‌హౌజ్‌లు నిర్మిస్తున్నారు. వీటిలో మొదటిది, మూడోది పూర్తయ్యాయి. రెండో టన్నెల్, పంప్ హౌజ్ పనులు కొనసాగుతున్నాయి.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతటి అలజడి

▸ ప్రస్తుతం ప్రపంచమంతా గందరగోళంగా ఉంది

▸ సీడీఎస్ అనిల్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ప్రస్తుతం ప్రపంచమంతా గందరగోళంగా ఉందని, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రస్తుతం అంతటి అలజడి నెలకొని ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ప్రపంచంలోని పలు దేశాల మధ్య అసాధారణ వివాదాలు నెలకొని ఉన్నాయని ఆయన అన్నారు. ఢిల్లీలో గురువారం భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) మందుగుండు సామగ్రిపై నిర్వహించిన సదస్సులో అనిల్ చౌహాన్ మాట్లాడుతూ, మయన్మార్, సుడాన్, కాంగో దేశాలు అంతర్గత యుద్ధాలతో సతమతమవుతున్నాయని అన్నారు. అలాగే లిబియా, సిరియా, యెమెన్, ఆర్మేనియాలలో యుద్ధం ఆగిపోయినప్పటికీ అక్కడ శాంతి వాతావరణం నెలకొంటుందో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొని ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలో నెలకొన్న ఈ అశాంతి వాతావరణం సరఫరా గొలుసు వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. యుద్ధ సామగ్రి మొదలుకొని ప్రతి వస్తువుకు గిరాకీ ఏర్పడిందని చెప్పారు. ఫిక్కీ ఈ సమస్యకు పరిష్కారం చూపుతుందని అనిల్ చౌహాన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రంప్ ఓడితే రక్తపాతమే

▸ అధికార మార్పిడి సాఫీగా జరుగుతుందనే నమ్మకం లేదు: బైడెన్

వాషింగ్టన్, ఆగస్టు 8: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఓడిపోతే దేశంలో రక్తపాతం తప్పదని ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. కమలా హారిస్‌కు అధికార మార్పిడి శాంతియుతంగా జరుగుతుందనే విశ్వాసం తనకు లేదన్నారు. ఓ మీడియా సంస్థకు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో బైడెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబరులో జరగనుండగా జనవరిలో అధికార మార్పిడి జరుగుతుంది. 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత జనవరిలో అధికార మార్పిడికి కొన్ని గంటల ముందు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తన ఓట్లను దొంగలించి ఎన్నికల్లో ఓడించారని ఆరోపించారు. దీంతో ట్రంప్ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో క్యాపిటల్ హాల్‌పై దాడి చేశారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు జరిపిన కాల్పుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. కాగా, ఎన్నికల్లో గెలిచినా, ఓడిపోయినా దేశాన్ని ప్రేమించాలని బైడెన్ హితవుపలికారు.

గత ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్‌కు ఇక్కట్లే

▸ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: నెరెడ్కో ప్రతినిధులు

▸ త్వరలోనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తాం: మంత్రి అనగాని

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. నేషనల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) ప్రతినిధుల బృందం గురువారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిసి తమ సమస్యలను ప్రస్తావించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు విధానాలపై అసంతృప్తి వ్యక్తపరిచారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని ఇక్కట్లకు గురి చేశారని నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. భూసర్వే పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని విభాగాలతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికలోను కూటమిదే గెలుపు

▸ గేట్లు ఎత్తితే వైసీపీలో ఎవరూ మిగలరు: గంటా

విశాఖపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఎవరైనా విజయం సాధించడం ఖాయమని భీమి లి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నాడు దౌర్జన్యాలతో 30 శాతం ఏకగ్రీవాలు చేసుకున్న వైసీపీ.. ప్రతిపక్ష నాయకుల నామినేషన్లు సైతం విత్‌డ్రా చేయించి స్థానిక సంస్థలను గెలుచుకుది. అదే వైసీపీ ఇప్పుడు రాజకీయ విలువలు, నైతికత గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది. రాష్ట్ర అభివృద్ధిని ఆశించినవారే కూటమికి మద్దతుగా వస్తారు. అసెంబ్లీలో కనీసం 10 శాతం సీట్లు కూడా గెలుచుకోలేకపోయిన జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా కోరుకోవడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. కూటమి ప్రభుత్వం గేట్లు తెరిస్తే వైసీపీలో ముఖ్య నాయకులు సహా ఎవరూ మిగలరు. విశాఖలో వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించిన ముఖ్య నాయకుడు విశాఖ, విజయనగరం జిల్లాల్లో రెండు లక్షల గజాల భూములను లాక్కున్నారు. విశాఖ ఫైల్స్ పేరుతో ఆ వివరాలన్నీ త్వరలోనే వెల్లడిస్తాం' అని గంటా తెలిపారు.

పెళ్లయిన రోజే నరికేశాడు!

ఉదయం వివాహం... సాయంత్రం హత్య

▸ తర్వాత ఆత్మహత్యకు పాల్పడిన భర్త

▸ కర్ణాటకలోని కోలార్ జిల్లాలో ఘటన

▸ వరుడు చిత్తూరు జిల్లా యువకుడు

▸ మనస్పర్థలకు వాట్సప్ చాటింగే కారణమా?



మృతి చెందిన నవదంపతులు (ఫైల్)

రామకుప్పం/శాంతిపురం/బెంగళూరు(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 8: అనుమానమే పెనుభూతంగా మారి నవదంపతుల ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన కర్ణాటకలోని కోలార్ జిల్లాలో కేజీఎఫ్ తాలూకా చంబరసనహళ్లిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం సంతూరు గ్రామానికి చెందిన జయమ్మ, మునెప్ప దంపతులకు కుమారుడు నవీన్(30) కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేట క్రాస్‌లో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. కర్ణాటకలో బైనహళ్ళికి చెందిన శ్రీనివాసులు, లక్ష్మీ దంపతుల కుమార్తె నిఖితశ్రీతో అతనికి బుధవారం ఉదయం చంబరసనహళ్ళిలో వివాహమైంది. నిఖితతో పాటు ఆమె తల్లిదండ్రులను నవీన్ గ్రామంలోని తన అక్క ఇంటికి తీసుకెళ్లాడు. సాయంత్రం వరకూ బంధువులతో ఆహ్లాదంగా గడిపిన అనంతరం నవదంపతులు ఓ గదిలోకి వెళ్లారు. కొద్దిసేపటికే గది లోపలి నుంచి కేకలు వినిపించాయి. నవీన్ మేనకోడలు కిటికీలో నుంచి చూడగా భార్య నిఖితపై నవీన్ కొడవలితో దాడి చేయడం కనిపించింది. నిఖిత తల్లితండ్రులు, బంధువులు తలుపులు బద్దలు కొట్టి లోపలకి వెళ్లి చూడగా నిఖిత రక్తపుమడుగులోనూ, పక్కనే నవీన్ తీవ్ర గాయాలతో పడి ఉన్నారు. హుటాహుటిన కోలారులోని జిల్లా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే నిఖిత మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నవీన్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. కొంతకాలంగా నవీన్ మానసిక పరిస్థితి సరిగ్గా లేదని, ఈ కారణంగానే నిఖితను చంపి, తానూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిఖిత సెల్‌ఫోన్‌ను నవీన్ చూశాడని, అందులో వేరొక యువకుడితో చాటింగ్ చేసినట్లు గుర్తించి ప్రశ్నించాడని, ఈ క్రమంలోనే ఆమెపై దాడి చేసి హతమార్చి ఉండొచ్చని భావిస్తున్నారు.

ఎస్ఆర్‌సీ నివేదికను సవాల్ చేస్తూ పొన్నవోలు అనుబంధ పిటిషన్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను గురువారం హైకోర్టు అనుమతించింది. పిటిషన్‌పై తుది విచారణ జరుపుతామని ప్రకటిస్తూ విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. తుదపరి విచారణ వరకు పొన్నవోలుకు భద్రతను కొనసాగించాలని ఆదేశించారు. అందుకు అయ్యే ఖర్చును పిటిషనరే భరించాలని స్పష్టం చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... 'ప్రాణహాని లేదని ఎస్ఆర్‌సీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుత పిటిషన్‌లో అభ్యర్థనను సవరణ చేస్తూ అనుబంధ పిటిషన్ వేశాం. కోర్టు ఆదేశాలను అనుసరించి మాకు ఎస్ఆర్‌సీ నివేదికను ఇవ్వలేదు' అని తెలిపారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... 'ఎస్ఆర్‌సీ నివేదికను సవాల్ చేస్తూ పిటిషనర్ తన వ్యాజ్యంలోని ప్రధాన అభ్యర్థనను మాత్రమే సవరించారు. పిటిషన్‌లో పూర్వ నివేదనలు(ప్లీడింగ్స్) అలాగే ఉన్నాయి. ఎస్ఆర్‌సీ నివేదికను సవాల్ చేస్తున్నందున ప్రాణహాని ఉందని చెప్పేందుకు తగిన ఆధారాలు చూపించాల్సిన లేదా ఎస్ఆర్‌సీ నిర్ణయంలో దురుద్దేశం ఉందని నిరూపించాల్సిన బాధ్యత పిటిషనర్‌పై ఉంది' అని తెలిపారు.

తగ్గని నీటి ప్రవాహం.. రాకపోకలకు అంతరాయం

తిరువూరు, ఆగస్టు 8: డివిజన్‌లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరడంతో పాటు పలు వాగుల్లో, చప్టాలపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దాంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. అక్కపాలెం పడమటి వాగు గురువారం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో, ఈ రహదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నూజివీడు రోడ్డులో లక్ష్మీపురం- మల్లేల మధ్యలో చప్టాపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. చప్టాకు రెండు వైపుల ఎటువంటి రక్షణ లేకపోవడంతో, రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని కనుగుల, మల్లమ్మ చెరువులు పూర్తిగా నిండి ఆ చెరువుల మధ్య గల అక్కపాలెం రోడ్డుమీదుగా ప్రవహిస్తుంది. కనుగుల చెరువులోకి భారీగా వరద చేరింది. గండి పడకుండా ఇసుక బస్తాలు ముందస్తుగా ఉంచారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 9 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ ఏయూ)- వ్యవసాయ సంబంధిత డిప్లొమా ప్రోగ్రామ్‌లలో స్పాట్ కౌన్సెలింగ్ తరవాత మిగిలిన సీట్ల భర్తీ కోసం వాక్-ఇన్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తోంది. టీఎస్ పాలిసెట్ 2024(అగ్రికల్చర్/ఇంజనీరింగ్ స్ట్రీమ్) ర్యాంక్ లేదా పదోతరగతి మెరిట్ ఆధారంగా రాష్ట్రంలోని వర్సిటీ పాలిటెక్నిక్‌లు, అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. అగ్రికల్చర్ స్ట్రీమ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. తరవాత ఇంజనీరింగ్ స్ట్రీమ్ అభ్యర్థులకు; ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో పదోతరగతి మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మొదటి కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల అప్లయ్ చేయనవసరం లేదు. వీరు కౌన్సెలింగ్‌కు హాజరైతే చాలు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు 60 శాతం సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

జయశంకర్ వర్సిటీలో డిప్లొమా కౌన్సెలింగ్



రెండేళ్ల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్: జోగిపేట బాలికల పాలిటెక్నిక్; జమ్మికుంట, బసంత్‌పూర్, మల్తుమ్మెద బాలుర పాలిటెక్నిక్ కాలేజీలు; కంపసాగర్, మధిర, నారాయణ్‌పేట్, పొలాస, రుద్రూర్, సిరిసిల్లా కో ఎడ్యుకేషన్ పాలిటెక్నిక్‌లలో 33 రెగ్యులర్ సీట్లు, 18 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 51 సీట్లు ఉన్నాయి. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల్లో 182 రెగ్యులర్ సీట్లు, 27 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 209 సీట్లు మిగిలాయి.

మూడేళ్ల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్: సంగారెడ్డి-కందిలోని అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో రెగ్యులర్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల్లో ఒక్కోదానిలో ఒక సీటు చొప్పున రెండు సీట్లు ఉన్నాయి. మెదక్ జిల్లా-తునికిలోని డా.డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్(అనుబంధ కళాశాల)లో 23 రెగ్యులర్, 3 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 26 సీట్లు మిగిలాయి.

రెండేళ్ల డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్: వికారాబాద్-గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్(అనుబంధ కళాశాల)లో 44 రెగ్యులర్, 6 ఈడబ్ల్యూఎస్ సీట్లు చొప్పున మొత్తం 50 సీట్లు మిగిలాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. టీఎస్ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్/ఇంజనీరింగ్ స్ట్రీమ్) అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 12
- **వేదిక:** ఎగ్జామినేషన్ సెంటర్, వాటర్ టెక్నాలజీ సెంటర్ ఎదురుగా, పీజేటీఎస్ ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయి. ఇంటర్/ఓపెన్ ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆగస్టు 18లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆసక్తిగలవారు నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.ఎం.విజయ్ కుమార్ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సహాయ కేంద్రానికి వచ్చి డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ అనంతరం ఆన్‌లైన్‌లో నిర్దేశిత ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చు. అలాగే రెండో సంవత్సరం, మూడో సంవత్సరం చదువుతున్నవారు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించవచ్చు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నెం.7382929630ను సంప్రదించాలి.

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ(సీఎంయూ)

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- అమెరికాలోని 'సెంట్రల్ మిచిగన్ యూనివర్సిటీ(సీఎంయూ)' సహకారంతో ఎంబీఏ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇందులో 18 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొదటి ఏడాది కాకినాడ జేఎన్‌టీయూలో, రెండో ఏడాది సీఎంయూలో చదవాల్సి ఉంటుంది. ఐసెట్ 2024 ర్యాంక్, అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇది సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ప్రోగ్రామ్. అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐసెట్ 2024 అర్హత పొంది ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి ఏడాది రూ.1,50,000; రెండో ఏడాది 12000ల యూఎస్ డాలర్లు
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి నుంచి డిగ్రీ వరకు సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఐసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డ్
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ-533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in



నేషనల్ లా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌ఎం(ప్రొఫెషనల్)

ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ)- ఎల్‌ఎల్‌ఎం(ప్రొఫెషనల్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇది ఎగ్జిక్యూటివ్ డిప్లొమా ప్రోగ్రామ్. దీనిని పీజీ డిప్లొమాకు సమానంగా పరిగణిస్తారు. దీనికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో కోర్ పేపర్లు, రెండో సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన పేపర్లు చదవాల్సి ఉంటుంది. సెమిస్టర్‌కు నాలుగు పేపర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌ను డిస్టెన్స్ ఎడ్యుకేషన్, కాంటాక్ట్ లెర్నింగ్ విధానాల్లో నిర్వహిస్తారు. కాంటాక్ట్ తరగతులు ఢిల్లీ క్యాంపస్‌లో ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. సెమిస్టర్ చివరలో ఎండ్ ఎగ్జామ్ ఉంటుంది. ఇంటర్నల్ అసైన్‌మెంట్‌కు 30 మార్కులు, ఎండ్ ఎగ్జామ్‌నకు 70 మార్కుల వెయిటేజీ నిర్దేశించారు.

స్పెషలైజేషన్‌లు: క్రిమినల్ లా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్టడీస్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కమర్షియల్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా అండ్ జస్టిస్, కన్జూమర్ లా అండ్ ప్రాక్టీస్, హెల్త్ లా అండ్ పాలసీ, ట్యాక్సేషన్ లా

కోర్ పేపర్లు
- బేసిక్ ఇంట్రడక్షన్ టు లా అండ్ లీగల్ సిస్టమ్
- కాన్‌స్టిట్యూషనల్ లా-ఇంట్రడక్షన్
- ఫండమెంటల్స్ ఆఫ్ లా(క్రిమినల్, కమర్షియల్, సివిల్)
- లిటిగేషన్ ప్రాక్టికం

అర్హత: గుర్తింపు పొందిన కాలేజ్/యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ/పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్నవారు లేదా కనీసం మూడేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎల్‌ఎల్‌ఎం, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు రిజిస్టర్ చేసుకొన్న అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.1,25,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **వెబ్‌సైట్:** www.nludelhi.ac.in

NLU DELHI



జాబ్ కార్నర్

ఐఓసీఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 400

చెన్నైలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ - ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, సదరన్ డివిజన్ పరిధిలోని ఆరు రీజియన్లలో కింద పేర్కొన్న విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

రీజియన్లు: తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఖాళీల వివరాలు:
1. ట్రేడ్ అప్రెంటిస్: 95 ఖాళీలు
2. టెక్నీషియన్ అప్రెంటిస్: 105 ఖాళీలు
3. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్/అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్: 200 ఖాళీలు

విభాగాలు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ తదితరాలు

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీబీఏ, బీఏ, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 31 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, వైద్య పరీక్ష, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 19

వెబ్‌సైట్: iocl.com/apprenticeships

'సమీర్'లో ప్రాజెక్ట్ స్టాఫ్

ఖాళీలు 43

భారత ప్రభుత్వరంగ సంస్థకు చెందిన కోల్‌కతాలోని సొసైటీ ఫర్ అప్లయిడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. రీసెర్చ్ సైంటిస్ట్: 21 పోస్టులు
2. ప్రాజెక్ట్ అసిస్టెంట్: 10
3. ప్రాజెక్ట్ అసిస్టెంట్-బి: 1
4. ప్రాజెక్ట్ టెక్నీషియన్-ఎ: 8
5. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-బి: 2
6. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-సి: 1

విభాగాలు: ఎలక్ట్రానిక్స్/కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్, మెకానికల్(ఫిట్టర్/మెషినిస్ట్), కంప్యూటర్/ఐటీ, ఫిజిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, బీఏ/బీఎస్సీ/బీకాం, బీబీఏ/బీఎంఎస్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్/ఎంఈ/బీకాం, ఎంటెక్, బీఎంఎస్‌తోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు సీనియర్ సైంటిస్ట్ పోస్టుకు రూ.30,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.17,000; ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-బికు రూ.20,000; ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-సికు రూ.26,000.

వయోపరిమితి: సీనియర్ సైంటిస్ట్ పోస్టు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-బికు 30 ఏళ్లు; ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ టెక్నీషియన్-ఏకు 25 ఏళ్లు; ప్రాజెక్ట్ అసిస్టెంట్-బీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్-సికు 35 ఏళ్లు.

SAMEER

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి, రాత పరీక్ష/స్క్రీనింగ్ టెస్ట్/స్కిల్ టెస్ట్, దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25

రాత పరీక్ష/స్క్రీనింగ్ టెస్ట్/ఇంటర్వ్యూ: సెప్టెంబరు 5

వెబ్‌సైట్: https://sameer.gov.in/



ఢిల్లీ ఎయిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 233

ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: అనస్తీషియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ, సర్జరీ, మెడిసిన్, న్యూరాలజీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, సైకియాట్రి, రేడియాలజీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, డీఎన్‌బీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధనానుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.1,42,506

వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3000; ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.2400, దివ్యాంగులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10

వెబ్‌సైట్: rrp.aiimsexams.ac.in/

ఎన్‌హెచ్‌ఏఐలో ఇంజనీరింగ్ ఉద్యోగాలు

ఖాళీలు 11

ఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ బ్రిడ్జ్/స్ట్రక్చరల్ ఇంజనీర్: 1 పోస్టు
2. బ్రిడ్జి డిజైన్ ఇంజనీర్: 2
3. జియోటెక్నికల్ ఇంజనీర్: 1
4. హైడ్రాలజీ అండ్ హైడ్రాలిక్ ఎక్స్‌పర్ట్: 1
5. సీనియర్ టన్నెల్ ఇంజనీర్: 1
6. టన్నెల్ ఇంజనీర్: 1
7. జియాలజిస్ట్: 1
8. క్వాంటిటీ సర్వేయర్: 1
9. డ్రాఫ్ట్స్‌మన్: 2

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(సివిల్), డిగ్రీ(సివిల్), పీజీ(జియాలజీ/స్ట్రక్చరల్/టన్నల్/మైనింగ్), పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: స్ట్రక్చరల్ ఇంజనీర్, సీనియర్ టన్నల్ ఇంజనీర్ పోస్టులకు 60 ఏళ్లు, క్వాంటిటీ సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మన్ పోస్టులకు 45 ఏళ్లు, మిగతా పోస్టులకు 55 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 30

వెబ్‌సైట్: https://nhai.gov.in

టీహెచ్‌ఎస్‌టీఐలో క్లినికల్ రీసెర్చ్ ఆఫీసర్లు

ఖాళీలు 6

హరియాణాలోని ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్.. కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. క్లినికల్ రీసెర్చ్ ఆఫీసర్: 1 పోస్టు
2. అసిస్టెంట్ డేటా మేనేజర్: 1 పోస్టు
3. టెక్నికల్ అసిస్టెంట్: 1 పోస్టు
4. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-2: 1 పోస్టు
5. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1: 1 పోస్టు
6. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎండీ/డీఎన్‌బీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: క్లినికల్ రీసెర్చ్ ఆఫీసర్, అసిస్టెంట్ డేటా మేనేజర్‌కు 4 ఏళ్లు, టెక్నికల్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-2 పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 12

వెబ్‌సైట్: https://thsti.res.in/



విటమిన్స్


ఆయుధాలకంటే బలమైనది

పాండురంగ పురాన్ని పాలించే మహేంద్రుడనే రాజుకు చుట్టుపక్కల రాజ్యాలనుంచి శత్రువుల బెడద ఎక్కువ. వారి దాడులను ఎదుర్కోవడానికి అతను తన కోటను అవసరమైన మరమ్మత్తులు చేయించి, దృఢంగా మార్చాలనుకున్నాడు. తన కోట ప్రధాన ద్వారాన్ని పెద్ద పెద్ద ఇనుప కమ్మీలతో బలంగా కట్టించి, వాటిని ఏనుగులతో, ఇంకా ఫిరంగి గుళ్లతో ఢీకొట్టించి, పరీక్షించాడు. ద్వారం చెక్కుచెదరలేదు. అదిచూసి, తన మంత్రితో మహేంద్రుడు ఇలా అన్నాడు 'చూసారా మహామంత్రీ.. ఇక ఏ ఆయుధాల వలనా మన కోటకు ఎలాంటి ఇబ్బందీఉండదు'




ఆ మాటలు విన్న మంత్రి ఏమీ మాట్లాడకుండా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. ఆ మర్నాడు రాజు మంత్రిని తీసుకుని, మారు వేషాలలో కోట బయటకు వెళ్లారు కొంత సేపటికి కోట ప్రధాన ద్వారం వద్దకు వచ్చి, తలుపులు తెరవమని కాపలా వారిని అడిగారు.. అక్కడి భటులు సాయంత్రం అయిన తర్వాత ఎవరు అడిగినా కోట తలుపులు తెరవగూడదని మా మహారాజు ఆజ్ఞ. కాబట్టి మీకు ఈ సమయంలో తలుపులు తెరవలేము అని చెప్పారు. అది విన్న మహారాజు గర్వంగా చిరునవ్వుతో మంత్రి వైపు చూసాడు. ఈలోగా మంత్రి ఒక కాపలా వాడిని పక్కకు తీసుకెళ్లి, అతనికి వంద బంగారు కాసులు ఇస్తాననీ.. తలుపులు తెరవమనీ అడిగాడు. వెంటనే ఆ భటుడు తలుపులు తెరిచాడు. లోపలికి వెళ్లిన మంత్రి రాజుతో ఇలా అన్నాడు 'ఏ ఆయుధాలూ కూల్చలేని మన కోట తలుపులను ఏమి చేస్తే తెరిపించవచ్చో ఇపుడు అర్థమైందా మహారాజా?' అన్నాడు తన అజాగ్రత్తను తెలుసుకుని మహేంద్రుడు వెంటనే ఆ పనివారిని మార్చి, నిజాయితీ గల వేరే ఉద్యోగులను కాపలాగా నియమించాడు.


10 తేడాలను కనుక్కోండి



ఏవి ఎన్ని ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 379

	5	4			1
1					
	4		1		
		1		5	
					6
6			2	1	

సుడోకు - 378 సమాధానం

4	3	2	5	1	6
6	1	5	4	3	2
5	2	3	6	4	1
1	6	4	3	2	5
3	5	1	2	6	4
2	4	6	1	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.